
www.prajapakasham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం




PRAJAPAKSHAM ★★

కల్తీకల్లు తాగి 15 మంది ఆసుపత్రిపాలు 06

ఒకరి పరిస్థితి విషమం, కూకట్‌పల్లిలోని హైదర్ నగర్‌లో ఘటన

సంపుటి 08, సంచిక: 219 | బుధవారం | 09-07-2025 | మహబూబ్‌నగర్ | Published from: Mahabubnagar, Hyderabad, Khammam, Karimnagar | పేజీలు: 12+8 | వెల రూ. 5.00

# సకాలంలో యూరియా ఇవ్వండి

- తెలంగాణకు కేటాయించిన కోటా సరఫరా చేయండి
- దేశీయంగా ఉత్పత్తి అయిన కోటా పెంచండి
- జహీరాబాద్ ఇండస్ట్రియల్ పార్క్ సిటీ అభివృద్ధికి సహకరించండి
- వరంగల్ విమానాశ్రయానికి ఆర్థిక సాయం
- హైదరాబాద్ – బెంగళూరు ఎరో డిఫెన్స్ కారిడార్ మంజూరు చేయండి
- కేంద్ర మంత్రులు నడ్డా, పీయూష్ గోయల్‌కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వినతి

ప్రజాపక్షం/హైదరాబాద్


ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మంగళవారం ఢిల్లీలో పర్యటించారు. రాష్ట్రానికి సంబంధించిన అవసరాలను కేంద్ర మంత్రులకు విన్నవించారు. అందులో భాగంగా తెలంగాణకు కేటాయించిన యూరియాను సకాలంలో సరఫరా చేయాలని కేంద్ర ఎరువులు, రసాయనాల శాఖ మంత్రి జగత్ ప్రకాష్ నడ్డాకు తెలంగాణ ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. కేంద్ర మంత్రిని ఢిల్లీలోని ఆయన అధికారిక నివాసంలో సిఎం రేవంత్ రెడ్డి మంగళవారం కలిశారు. వానాకాలం సీజన్‌కు సంబంధించి ఏప్రిల్‌జూన్ నెలల మధ్య 5 లక్షల మెట్రిక్ టన్నులకుగానూ కేవలం 3.07 లక్షల మెట్రిక్ టన్నులు మాత్రమే సరఫరా తరువాయి 2లో



# నేడు సార్వత్రిక సమ్మె

## కార్మిక సంఘాల సమాయత్తం

- రోడ్లపైకి రానున్న 25 కోట్ల మందికిపైగా కార్మికులు, కర్షకులు
- సంపూర్ణ మద్దతిచ్చిన రైతు సంఘాలు, వామపక్షాలు




**న్యూఢిల్లీ:** కార్మికులు, రైతులకు వ్యతిరేకంగా కార్పొరేట్లకు అనుకూలంగా మోదీ ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలకు నిరసనగా బుధవారం సార్వత్రిక సమ్మె జరగనుంది. ఇందుకు 10 కేంద్ర కార్మిక సంఘాలు సమాయత్తమయ్యాయి. మోదీ సర్కారుకు తమ సత్తా చూపించాలని, వినాశకర విధానాలు అవలంభిస్తామంటే ప్రజలు ఒప్పుకోరన్న సందేశాన్ని ఇవ్వాలన్న కృతనిశ్చయంతో కార్మిక సంఘాలు ఉన్నాయి. సార్వత్రిక సమ్మె విజయవంతం చేసేందుకు ఏర్పాట్లు చేశారు. సమ్మెలో 25 కోట్ల మందికిపైగా కార్మికులు పాల్గొననున్నారు. బ్యాంకింగ్, పోస్టల్, మైనింగ్, నిర్మాణ రంగంతో పాటు రవాణా సంస్థల సేవలు స్తంభించనున్నాయి. కార్మికులు, రైతులకు అనుబంధ సంస్థలు సంపూర్ణ మద్దతు ప్రకటించాయి. వామపక్ష పార్టీలు సమ్మె జయప్రదానికి కృషి చేశాయి. సమ్మెలో రైతులతోపాటు గ్రామీణ కార్మికులు పాల్గొంటారని ఏఐటీయూసీ జాతీయ ప్రధాన కార్యదర్శి అమర్‌జీత్ కౌర్ వెల్లడించారు. కార్మిక వ్యతిరేక విధానాలపై కదం తొక్కనున్నట్లు తెలిపారు. నాలుగు లేబర్ కోడ్ల వల్ల కార్మికులకు తీవ్ర నష్టం వాటిల్లుతుందని, వాటిని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. మోదీ సర్కారు విధానాలతో నిరుద్యోగం, ద్రవ్యోల్బణం పెరిగిందని, ఆరోగ్యం, విద్య, పౌర సేవలు తగ్గాయన్నారు. ప్రభుత్వ ఉద్యోగులు పదవీ విరమణ చేస్తున్నప్పటికీ, వారి స్థానంలో యువతకు ఉద్యోగ అవకాశాలు రావడంలేదని విమర్శించారు. పదేళ్లుగా మోదీ సర్కారు కార్మిక సదస్సులు నిర్వహించకపోవడాన్ని అమర్‌జీత్ కౌర్ తప్పుపట్టారు. పబ్లిక్ సెక్యూరిటీ బిల్లులను పక్కన పెట్టేయడం వంటి కారణాలతో సార్వత్రిక సమ్మెకు సిద్ధమైనట్లు తెలిపారు. రైతుల సమస్యలను సైతం మోదీ ప్రభుత్వం పట్టించుకోవడం లేదని అమర్‌జీత్ కౌర్ అన్నారు. సార్వత్రిక సమ్మెతో అన్ని రంగాల సేవలు స్తంభిస్తాయని హింద్ మజ్దూర్ సభ నాయకుడు హర్భజన్ సింగ్ సిద్దూ అన్నారు. కార్మిక శాఖ మంత్రి మన్సుఖ్ మాండవియాకు గతేడాది తమ యూనియన్లు 17 డిమాండ్ల పత్రాన్ని సమర్పిస్తే, ఇప్పటి వరకు వాటికి పరిష్కారం చూపలేదన్నారు. కార్మికులపై మోదీ ప్రభుత్వానికి ఏ మాత్రం చిత్తశుద్ధి ఉందో దీంతో తేలిపోయిందని వ్యాఖ్యానించారు. సమ్మె మద్దతు ప్రకటిస్తూ ఏఐటీయూసీ, ఐఎన్‌టీయూసీ, సీఐటీయూ, హెచ్‌ఎంఎస్, ఎస్ఇడబ్ల్యూఏ, ఎల్‌పీఎఫ్, యూటీయూసీ సంయుక్త ప్రకటన చేశాయి. ప్రభుత్వ రంగ సంస్థలు, సేవల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా, ఔట్ సోర్సింగ్ తరువాయి 2లో

**సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయండి**
**అన్ని వర్గాల ప్రజలకు కూనంనేని పిలుపు**



# సవాలు విసిరి ఢిల్లీకి వెళ్తారా?

- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై కెటిఆర్ విమర్శలు
- సిఎం సవాల్‌ను స్వీకరించి హైదరాబాద్ ప్రెస్‌క్లబ్‌కు వచ్చా
- చర్చకు మంత్రులెవరొచ్చినా సిద్ధమేనని వ్యాఖ్య

ప్రజాపక్షం/హైదరాబాద్

రైతులు, నిరుద్యోగ అంశాలపై చర్చకు సిద్ధమని సిఎం రేవంత్ రెడ్డి సవాల్ విసిరి, ఇప్పుడు ఢిల్లీకి వెళ్లిపోయారని బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటి.రామారావు అన్నారు. సిఎం సవాలును తాను స్వీకరించి చర్చించేందుకు సోమాజిగూడలోని హైదరాబాద్ ప్రెస్ క్లబ్‌కు వచ్చానని, సిఎం ఢిల్లీలో ఉన్నందున ఎవరైనా రాష్ట్ర మంత్రులు తరువాయి 2లో

## కెసిఆర్‌కు సవాల్ విసిరితే..

# కెటిఆర్ వచ్చాడు!

- ఎక్కడపడితే అక్కడ కాదు..
- లెక్కలు తీసుకొని అసెంబ్లీకి రండి చర్చిద్దాం
- బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ విమర్శలను తిప్పికొట్టిన మంత్రులు, కాంగ్రెస్ నేతలు



ప్రజాపక్షం/హైదరాబాద్

సిఎం రేవంత్‌రెడ్డి అసెంబ్లీకి రావాలని సవాల్ చేశారని,బిఆర్‌ఎస్ అధినేత కెసిఆర్, వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ లెక్కలు తీసుకొని అసెంబ్లీకి వస్తే రైతులు, నిరుద్యోగులతో ప్రతి అంశంపై చర్చించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రి మంత్రి పొన్నం ప్రభాకర్ చెప్పారు. బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ సిఎం రేవంత్‌రెడ్డిపై చేసిన విమర్శలను భట్టి, పొన్నం ప్రభాకర్‌తో పాటు టిపిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ తూర్పు జయప్రకాష్‌రెడ్డి, ఎంఎల్‌సి అద్దంకి దయాకర్, ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య తీవ్రంగా ఖండించారు. మహబూబాబాద్ జిల్లాలో జరిగిన ఒక సభలో భట్టి మాట్లాడుతూ సిఎం రేవంత్ రెడ్డి ఒకరికి సవాల్ విసిరితే మరొకరు బయటకు వచ్చారు అని ఎద్దేవా చేశారు. రూ. లక్ష రుణమాఫీ విషయంలో మాజీ సిఎం కెసిఆర్ రెండుసార్లు మోసం చేశారని మండిపడ్డారు. తొలిసారి రుణమాఫీ పూర్తి చేసేందుకు ఐదేళ్ల సమయం తీసుకున్నారని విమర్శించారు. బిఆర్‌ఎస్ నేతలు పదేళ్లలో రూ.లక్ష కోట్లు దోచుకున్నారని ధ్వజమెత్తారు. కృష్ణా, గోదావరి బేసిన్ జలాలపై చర్చకు ఎప్పుడైనా సిద్ధమేనని సవాల్ విసిరారు. కాళేశ్వరం నిర్మించి పది ఎకరాలకు కూడా నీళ్లు ఇవ్వలేదని, అసత్యాలు మానకపోతే.. తరువాయి 2లో

## భద్రాద్రి రామాలయం ఇఒ రమాదేవిపై

# భూ ఆక్రమణదారుల దాడి

- స్పృహ కోల్పోవడంతో హుటాహుటిన భద్రాచలం తరలింపు
- ''మీది తెలంగాణ.. మాది ఆంధ్రా'' అంటూ ఆలయ సిబ్బందితో భూ ఆక్రమణదారులు వాగ్వాదం
- ఎపి పురుషోత్తం పట్టణంలో ఉన్న భూముల వద్ద ఘర్షణ వాతావరణం



ప్రజాపక్షం/భద్రాచలం

మీది తెలంగాణ, మాది ఆంధ్రా. మీరు మా రాష్ట్రంలోనికి రావద్దు' అంటూ భద్రాద్రి రామాలయం సిబ్బందిని భూముల ఆక్రమణ దారులు హెచ్చరికను జారీ చేశారు. ఆంధ్రప్రదేశ్‌లోని పురుషోత్తపట్నం రామాలయం భూముల్లో అక్రమ నిర్మాణాలు చేపడుతున్న నేపథ్యంలో మంగళవారం భద్రాచలం ఆలయ సిబ్బందితో కలిసి ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ రమాదేవి అక్కడికి వెళ్లారు. అక్రమ నిర్మాణాలు ఆపాలని, కోర్టు తీర్పు ఉందని, ఆ తీర్పును గౌరవించాలని చెప్పినప్పటికీ ఆక్రమణ దారులు ఖాతరు చేయకుండా ఆమెతో వాగ్వివాదానికి దిగారు. దురుసుగా ప్రవర్తించారు. పోలీసులు, రెవెన్యూ అధికారులు చూస్తుండగానే ఆక్రమణ దారులు ఇవో, సిబ్బందిపై తరువాయి 2లో

# పాలస్తీనావాసులను గాజా నుండి తరలించాలి

- వైట్‌హౌస్ విందులో ట్రంప్–నెతన్యాహూ ఉద్ఘాటన
- వచ్చేవారం ఇరాన్‌తో చర్చలు, గాజా ఒప్పందం



**వాషింగ్టన్ :** పాలస్తినా ప్రజలను గాజా స్ట్రిప్ నుండి తరలించాలన్న పూర్వపు ఆలోచనలను డోనాల్డ్ ట్రంప్–బెంజిమన్ నెతన్యాహూ పునరుద్ఘాటించారు. గాజాలో 60 రోజుల కాల్పుల విరమణ ఒప్పందం కుదిరి హింసకు తెరపడుతుందన్న ఆశలమధ్య మంగళవారంనాడు నాయకులిద్దరూ వైట్‌హౌస్‌లో సమావేశమయ్యారు. ఇరాన్‌పై యుద్ధం తర్వాత మొదటిసారి వారిద్దరి మధ్య విందు సమావేశం జరిగింది. గడచిన ఆరునెలలకాలంలో వైట్‌హౌస్‌ను మూడుసార్లు సందర్శించిన నాయకుడు నెతన్యాహూతో కలిసి ట్రంప్ ఈసారి అధికారికంగా ఎలాంటి పత్రికా గోష్ఠి ఏర్పాటు చేయలేదు. ఐనప్పటికీ విందు ప్రారంభానికి ముందుగా బ్లూ రూమ్‌కు పాత్రికేయులను ఆహ్వానించారు. ఇరాన్‌లో తమ విజయం మధ్యప్రాచ్యంలో కొత్త శకానికి నాంది పలుకుతుందని నాయకులు ఇద్దరూ తరువాయి 2లో

## సిటీ సివిల్ కోర్టుకు

# బాంబు బెదిరింపు

- జింఖానా క్లబ్‌లోనూ 4 ఆర్‌డిఎక్స్ బాంబులు పేలుతాయంటూ ఇమేజ్‌లు
- అప్రమత్తమైన పోలీసులు
- బాంబు స్క్వాడ్‌తో తనిఖీలు
- ఉత్తదే అని తేలడంతో ఊపిరి పీల్చుకున్న వైనం

ప్రజాపక్షం/హైదరాబాద్



''సిటీ సివిల్ కోర్టులో ఆర్‌డిఎక్స్ బాంబులు పెట్టాము..ఈ బాంబులు పేలిన 20 నిముషాలలో జింఖానా క్లబ్‌లో కూడా నాలుగు ఆర్‌డిఎక్స్ బాంబులు పేలబోతున్నాయి'' అంటూ ఓ అగంతకుడు సిటీ సివిల్ కోర్టుతో పాటు జింఖానా క్లబ్‌కు ఇమెయిల్ పంపించాడు. బుధవారం ఉదయం 3 గంటలకు వచ్చిన ఈమెయిల్ అంశాన్ని పోలీసులకు చేరవేశారు. దీంతో పోలీసులు ఆగమేఘాలపై అక్కడికి చేరుకుని బాంబ్ స్క్వాడ్‌తో తనిఖీలు నిర్వహించారు. బాంబులు తరువాయి 12లో

## హాట్‌టాపిక్‌గా...

# జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక

- అన్ని పార్టీలకు ప్రతిష్ఠాత్మకమే
- టిక్కెట్ కోసం తీవ్ర పోటీ


(మల్లం వెంకటేశ్)

బిఆర్‌ఎస్‌కు చెందిన ఎమ్మెల్యే మాగంటి గోపినాథ్ మరణంతో జూబ్లీహిల్స్ శాసనసభ స్థానం ఖాళీ ఏర్పడింది. దీంతో అందరి కళ్లూ ఇప్పుడు జూబ్లీహిల్స్ ఉప ఎన్నికపై పడ్డాయి. గతంలో ఏ ఉప ఎన్నికకూ లేనంత ఆసక్తి నెలకొంది. ఆరునెలలోపు ఉప ఎన్నిక జరగనున్న ఈ నియోజకవర్గాన్ని అన్ని పార్టీలూ సవాల్‌గా తీసుకున్నాయి. జూబ్లీహిల్స్‌లో పోటీ చేసేందుకు అన్ని పార్టీలలో ఆశావహులు తమ ప్రయత్నాలను తీవ్రతరం చేశారు. ఇప్పటికే పలువురు ఆశావహులు తమకే టికెట్ కేటాయించాలని బయోడేటాలు పట్టుకొని పార్టీ అధిష్ఠానం, పెద్ద నాయకుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు.



**బల్దియా ఎన్నికలకు సెమీ ఫైనల్స్**

జూబ్లీహిల్స్ నియోజకవర్గం ఉప ఎన్నికను అన్ని పార్టీలు ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంటున్నాయి. బిహార్ అసెంబ్లీ ఎన్నికలతో పాటు అక్టోబర్‌లో జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక జరిగే అవకాశాలు ఉన్నాయి. రాబోయే డిసెంబర్ జనవరి మధ్య జిహెచ్‌ఎంసి పాలకమండలి ఎన్నికలు జరిగే అవకాశాలు ఉన్నాయి. దీంతో తరువాయి 2లో






# ప్రపంచం
WORLD NEWS

## గుండెపోటుతో వైద్యుడు హఠాన్మరణం

**అక్రా :** పశ్చిమ ఆఫ్రికాదేశం ఘనాలోని ఒక ఆసుపత్రిలో డ్యూటీలో ఉన్న వైద్యుడు డాక్టర్ క్వామే అదూ అఫోరీ ఆకస్మికంగా గుండెపోటుతో మరణించాడు. 47 ఏళ్ళ వయసుగల ఎమర్జెన్సీ ఫిజీషియన్ విధినిర్వహణలో ఉన్నప్పటికీ ఆసుపత్రి వైద్యం అతడిని కాపాడలేకపోయింది. ఘనాలో రెండవ అతిపెద్ద ఆసుపత్రి కుమాసీలోని కోంఫో అనోక్యేలో ఈ ఘటన జరిగింది. ఎంతో అత్యున్నత సాంకేతిక పరిజ్ఞానంగల పరికరాలు ఉన్నప్పటికీ ఆయనను అవేవీ కాపాడలేదు. గుండెకు రక్తం సరఫరాచేసే రక్తనాళం పూడుకుపోవడంతో ఆయన హఠాన్మరణానికి గురయ్యారు. వైద్యులు వెంటనే అతడి రక్తనాళాణ్ణి తెరచి చికిత్సకు యత్నించినప్పటికీ మధ్య మధ్యలో అంతరాయాలవల్ల ఆయన మరణించారు. తన జీవితంలో అనేకమందిని కాపాడిన చరిత్రగల వైద్యుడుగా పేరుపొందిన అఫోరీ మృతికి ఆసుపత్రి సిబ్బంది, రోగులు తీవ్ర సంతాపం తెలియజేశారు.

## ఉగ్రవాద జాబితాలోంచి హెచ్‌టిఎస్ తొలగింపు



**వాషింగ్టన్ :** సిరియాలో ఉగ్రవాద కార్యకలాపాలు నిర్వహించి ప్రస్తుతం ప్రభుత్వంలో విలీనమై అతర్ధానమైన హెచ్‌టిఎస్ (హయత్ తహ్రిర్ అల్‌–షామ్) సంస్థను అంతర్జాతీయ ఉగ్రవాద సంస్థల జాబితా నుండి ట్రంప్ తొలగించారు. సిరియాపై ఆంక్షలను ఎత్తివేసి అంతర్యుద్ధంవల్ల నాశనమైన ఆ దేశ పునర్నిర్మాణానికి సహాయం చేసేందుకు తీసుకుంటున్న చర్యల్లో భాగంగా ట్రంప్ ప్రభుత్వం ఆ తాజా నిర్ణయం తీసుకుంది. ఇజ్రాయెల్‌తో శాంతికి, ఘర్షణలు ఆపేయడానికి వీలుగా 1974 నాటి ఒప్పందాన్ని అమలు చేసేందుకు గడచిన శుక్రవారంనాడు సిరియా సమ్మతించిన పూర్వరంగంలో ట్రంప్ ఈ నిర్ణయం తీసుకున్నారు. హయత్ తహ్రిర్ అల్‌–షామ్ అనే సున్నీ ఇస్లామిస్ట్ రాజకీయసంస్థ, పారామిలిటరీ విభాగం సిరియా అంతర్యుద్ధ సమయంలో ఎంతో కీలకపాత్ర వహించింది. అనేక సాయుధ గ్రూపులు విలీనమయ్యాక 2017 జనవరిలో ఈ హెచ్‌టిఎస్ ఆవిర్భవించింది. అస్సాద్ కుటుంబ పాలనను అంతమొందించి 'సిరియా రివల్యూషన్' సాధించేందుకు హెచ్‌టిఎస్ ఆవిర్భవించింది. అందుకు అనుగుణంగా గత ఏడాది డిసెంబరు ఎనిమిదో తేదీన అల్ బషర్ అస్సాద్ ప్రభుత్వం కుప్పకూలింది. ఆయన రష్యాకు పారిపోయాడు. అప్పటివరకూ హెచ్‌టిఎస్ రథసారథిగా ఉన్న అహ్మద్ అల్ షరా అమెరికా అండదండలతో సిరియా దేశాధ్యక్షుడయ్యారు. మహ్మద్ అల్‌–బషీర్ ప్రధానమంత్రి బాధ్యతలు తీసుకున్నారు. ఇక హెచ్‌టిఎస్ లక్ష్యం పూర్తి కావడంతో దానిని అందులోని సంస్థలను సిరియా సైన్యంలో, ఇతర ప్రభుత్వ విభాగాలలో విలీనం చేసి హెచ్‌టిఎస్ ఉనికిని రద్దు చేశారు. దీంతో ఇప్పుడు అమెరికాకు సిరియా మిత్రదేశంగా మారింది.

## వాణిజ్య ఒప్పందానికి చేరువలో భారత్‌–అమెరికా

### ట్రంప్ ప్రకటన




**న్యూయార్క్ :** భారత్‌–అమెరికా ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందం చేసుకోవడానికి చేరువలో ఉన్నాయని డోనాల్డ్ ట్రంప్ చెప్పారు. ''ఇప్పుడు మేం బ్రిటన్‌తో ఒక ఒప్పందం చేసుకున్నాం, చైనాతో ఒప్పందం చేసుకున్నాం, భారత్‌తో కూడా ఒప్పందం చేసుకునే ప్రక్రియ దగ్గరపడింది. ఇతరులను కూడా కలుసుకుని చర్చిస్తున్నాం, అందరితో చర్చిస్తాం, ఒప్పందం చేసుకుంటాం, కేవలం లేఖలు పంపడం లాంఛనం మాత్రమే, మీరు గనుక ఆటలాడాలనుకుంటే ఈమేరకు చెల్లింపులు చేయాల్సి ఉంటుందంతే'' అని ట్రంప్ మంగళవారంనాడు ప్రకటించారు. ఏ దేశం ఎంత టారిఫ్ వసూలు చేస్తే అమెరికా కూడా వారివద్ద అంతే టారిఫ్ వసూలు చేస్తుందని ట్రంప్ చెప్పారు. ఇతరదేశాలు అనుసరిస్తున్న టారిఫ్ విధానంవల్ల అమెరికా వాణిజ్యలోటు విపరీతంగా పెరిగిపోతోందని, తమతో వ్యాపారం చేసే అన్నిదేశాలూ బాగా లాభపడుతున్నాయని ట్రంప్ అన్నారు. అదేవిధంగా ట్రంప్ మరోసారి భారత్‌–పాకిస్తాన్ యుద్ధాన్ని తానే ఆపానని చెప్పారు. యుద్ధం ఆపకపోతే రెండు దేశాలతో వాణిజ్యం చేసేదిలేదని తేల్చి చెప్పామన్నారు.

**ఆగస్టు 1వరకు గడువు పెంపు భారత్‌కు ఊరట**

ట్రంప్ యంత్రాంగం ముందుగా సంకేతాలిచ్చినవిధంగానే టారిఫ్‌ల అమలు గడువు తేదీని అమెరికా ఈనెలాఖరు వరకు పొడిగించింది. దీంతో భారత్‌కు ఊరట లభించింది. రెండు దేశాలమధ్యా వాణిజ్య చర్చలు ఇంకా ఒక కొలిక్కి రాలేదు. ట్రంప్‌కు లొంగిపోయే పద్ధతులలో హడావుడి ఒప్పందాలు చేసుకోవద్దని దేశంలో కూడా ప్రతిపక్షాలు మోదీ ప్రభుత్వంపై ఒత్తిడి చేస్తున్నాయి. వివిధ శాఖల సీనియర్ అధికారుల నుండి అమెరికాకు ఇంకా భారత్ సమాచారాన్ని అందజేయాల్సి ఉన్న తరుణంలో భారత్‌కు ఈ గడువుతేదీ పొడిగింపు ఊరటనిచ్చింది. భారత్ కొద్దిరోజులుగా ద్వైపాక్షిక ఒప్పందంపై ముమ్మరంగా చర్చలు చేస్తున్న తరుణంలో సోమవారం నుండి ట్రంప్ టారిఫ్ లేఖల పంపిణీ ప్రారంభించారు. బంగ్లాదేశ్, బోస్నియా, హెర్జిగోవీనా, కంబోడియా, కజఖస్థాన్, లావోస్, సెర్బియా,ట్యునిషియా, ఇండోనేసియా, జపాన్, దక్షిణాఫ్రికా, దక్షిణ కొరియా, మలేసియా, థాయ్‌లాండ్ దేశాలు టారిఫ్ లేఖలు అందుకున్నాయి. చాలా దేశాలు ఇంకా గడువు కోరుతున్నాయి. పైగా ఒప్పందాలు చేసుకునేందుకు ముందుకు వచ్చిన దేశాలకు తగిన సమయం లేకపోవడంతో ట్రంప్ ఈ నిర్ణయం తీసుకున్నారు.

## దోహాలో ఇజ్రాయెల్‌–హమాస్

### రెండోరోజూ చర్చలు విఫలం

**దోహా :** మధ్యవర్తుల ప్రమేయంతో దోహాలో ప్రారంభమైన ఇజ్రాయెల్‌–హమాస్ చర్చలు మంగళవారం రెండో రోజున కూడా ఎలాంటి పురోగతి సాధించలేదు. గడచిన శుక్రవారం ట్రంప్ చేసిన ప్రకటనతో గాజాలో యుద్ధ విరమణకు ఎంతో ఉత్సాహం చూపిస్తున్న హమాస్ ఈసారి ఎలాగైనా 60 రోజుల కాల్పుల విరమణ ఒప్పందం సాధించాలన్న పట్టుదలతో ఉంది. ఐనప్పటికీ హమాస్ కొన్ని షరతులు విధిస్తుండగా, ఇజ్రాయెల్ కూడా తనదైనబాణిలో పాత షరతులను పునరుద్ఘాటిస్తున్నది. ఈసారి గతంకంటే భిన్నమైన వాతావరణం ఉందని, చర్చల్లో ఒప్పందం జరుగుతుందని మధ్యవర్తిదేశాలు ఖతార్, ఈజిప్టు కూడా ఆశాభావంతో ఉన్నాయి. అంతకుమించిన స్థాయిలో ట్రంప్ కూడా ట్రూత్ సోషల్ మీడియాలో పోస్టింగుల ద్వారా ఒక సానుకూల వాతావరణాన్ని సృష్టించారు. ఇది హమాస్‌కు ''ఆలసించిన ఆశాభంగం.., ఇదే చివరి మేలైన అవకాశం...'' అంటూ పోస్టింగుల మోత మోగించారు. ఒప్పందం కుదిరినా కుదరకపోయినాగానీ ఇజ్రాయెల్ సైన్యం గాజాను వదిలివెళ్ళిపోవాలని హమాస్ కోరుతున్నది. 60 రోజుల కాల్పుల విరమణకు, సజీవంగా ఉన్న 10 మంది బందీల విడుదలకు తాము సిద్ధంగా ఉన్నామని హమాస్ సీనియర్ అధికారులు ఇప్పటికే ప్రకటించారు. అదేవిధంగా మరో 18 మృతదేహాలను కూడా స్వాధీనం చేస్తామని వారు ప్రకటించారు. కానీ పాలస్తినాలో హమాస్ పరిపాలన ఉండకూడదని నెతన్యాహూ పట్టుదలతో ఉన్నారు.

**ఐదుగురు ఐడిఎఫ్ సైనికులు మృతి**

ఉత్తర గాజాలో జరిగిన దాడుల్లో ఐదుగురు ఇజ్రాయెలీ సైనికులు మరణించారు. మరో 14 మంది గాయపడ్డారు. అదేవిధంగా ఐడిఎఫ్ దాడుల్లో 18 మంది పాలస్తీనియన్లు మరణించారు. కాల్పుల విరమణ ఒప్పందం గురించి మాట్లాడేందుకు ఇజ్రాయెల్ ప్రధానమంత్రి నెతన్యాహూ అమెరికాలో పర్యటిస్తున్న సమయంలో, గాజాలో ఉగ్రవాదులు జరిపిన కాల్పుల్లో ఇజ్రాయెల్ సైనికులు మరణించారు.

ఉత్తరగాజా బైట్ హనౌన్ ప్రాంతంలో సైనిక చర్యలకు దిగిన ఐడిఎఫ్ సైనికులపై కాల్పుల్లో ఐదుగురు మరణించారు. సరిగ్గా నెలరోజుల క్రితం కూడా ఐడిఎఫ్ బృందం ప్రయాణిస్తున్న వాహనానికి ఉగ్రవాదులు బాంబులు తగిలించడంతో అవి పేలి ఏడుగురు ఇజ్రాయెలీ సైనికులు మరణించారు. ఆ తర్వాత ఇజ్రాయెల్ సైన్యానికి ఎదురైన అతిపెద్ద విఘాతం ఇదే.

## నేడు సార్వత్రిక సమ్మె

(మొదటి పేజీ తరువాయి)

విధానాలు, ఒప్పందీకరణకు వ్యతిరేకంగా కార్మిక సంఘాల పోరాడుతున్న విషయాన్ని గుర్తుచేశాయి. కార్మిక ఉద్యమాలను నీరుగార్చే నాలుగు లేబర్ కోడ్‌ల రద్దుకు డిమాండ్ చేశాయి. పని గంటలు పెంచడం, కార్మిక హక్కులను హరించడం, సమ్మె హక్కును అణచివేయడం, యజమానుల ద్వారా కార్మిక చట్టాల ఉల్లంఘనలను నేరం కాకుండా చూడటం కోసం పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను మోదీ ప్రభుత్వం నీరుగార్చిందని దుయ్యబట్టాయి. ప్రజలు, రైతులు, కార్మికుల ప్రయోజనాలను పణంగా పెట్టి కార్పొరేట్ అనుకూల విధానాల అమలు కోసం కసరత్తు చేస్తూ, సంక్షేమాన్ని గాలికి వదిలేసిందని మోదీ ప్రభుత్వాన్ని కార్మిక సంఘాలు విమర్శించాయి. ఇటువంటి అన్ని చర్యలను నిలదీసేందుకు, కార్మికులు, రైతులకు వ్యతిరేకంగా అమలు చేసే విధానాలపై ఒత్తిడి తెచ్చేందుకు సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని అన్ని రంగాల వారికి ముఖ్యంగా యువజనులు, విద్యార్థులకు కార్మిక సంఘాలు పిలుపునిచ్చాయి.

**సమ్మెను జయప్రదం చేయండి : కూనంనేని పిలుపు**

కేంద్ర ప్రభుత్వకార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ 10కేంద్ర కార్మిక సంఘాలు, స్వతంత్ర సమాఖ్యల పిలుపు మేరకు బుధవారం జరగనున్న జాతీయ సార్వత్రిక సమ్మెలో అన్ని వర్గాల ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయడం ద్వారాకేంద్రంలోని బిజెపి ప్రభుత్వానికి కళ్ళు తెరిపించాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎంఎల్‌ఎ కూనంనేని సాంబశివరావు విజ్ఞప్తి చేశారు. ఇది కేవలం కార్మికులకు సంబంధించిన సమ్మె కాదని, నిత్యావసరాల ధరల పెరుగుదల, నిరుద్యోగం, పంటలకు కనీస మద్దతు ధరకు చట్టబద్ధత,ద్రవ్యోల్బణం, కనీస వేతనం, పెన్షన్ తదితర సామాన్యుల సమస్యలపై జరుగుతున్న పోరాటమని ఆయన అన్నారు. అనేక సమస్యలతో కూడిన 17 డిమాండ్లతో జాతీయ సమ్మె జరుగుతున్నదని, సమ్మెకు సిపిఐ సంపూర్ణ మద్దతు ప్రకటించిందని ఆయన గుర్తు చేశారు. సమ్మెలో సిపిఐ శ్రేణులు ప్రత్యక్ష భాగస్వాములు అవుతున్నారని, ప్రజలంతా తమ సంఘీభావాన్ని ప్రకటించాలని కూనంనేని విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర ప్రభుత్వం వాణిజ్య ప్రదేశాలలో 10 గంటల పనిదినాన్ని అనుమతించేందుకు జారీ చేసిన జిఒ282ను తక్షణమే ఉపసంహరించుకోవాలని ఆయన పునరుద్ఘాటించారు.

## ఢిల్లీకి వెళ్తారా?

(మొదటి పేజీ తరువాయి)

చర్చకు వచ్చినా తాను సిద్ధమేనని స్పష్టం చేశారు. రైతు, నిరుద్యోగ సమస్యలపై చర్చించేందుకు కెటిఆర్ నేతృత్వంలోని బిఆర్‌ఎస్‌కు చెందిన మాజీ మంత్రులు, ఎంఎల్‌ఎలు, నాయకులు తెలంగాణ భవన్ నుంచి సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌కు మంగళవారం పెద్ద సంఖ్యలో చేరుకున్నారు. ప్రెస్‌క్లబ్ వద్ద సిఎం కోసం ఒక ప్రత్యేక కుర్చీని కూడా ఏర్పాటు చేశారు. రాష్ట్రంలో ఆత్మహత్యలు చేసుకున్న 600 మంది రైతులకు బిఆర్‌ఎస్ నాయకులు ఒక నిమిషం పాటు మౌనం పాటించారు. కాగా సిఎం రేవంత్ రెడ్డి ఢిల్లీ పర్యటనలో ఉండడంతో కొద్ది సేపు వేచి చూసిన తర్వాత కెటిఆర్ మీడియాతో మాట్లాడారు. సిఎం రేవంత్‌రెడ్డికి రచ్చ చేయడం తప్ప చర్చ చేయడం రాదనే సంగతి తెలంగాణ రాష్ట్ర ప్రజలకు మరోసారి తెలిసిందన్నారు. బూతులు తప్ప రైతుల గురించి సిఎంకు బేసిక్ నాలెడ్జ్ లేదని,18 నెలల అసమర్థ పాలనలో తెలంగాణ రాష్ట్రంలో 70 లక్షల మంది అన్నదాతలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆరోపించారు. కొడంగల్ నియోజక వర్గంలోనే 670 మంది రైతులకు రైతు భరోసా రాలేదని, వారిపేర్లు, అడ్రసులు, ఫోన్ నంబర్లను తీసుకొచ్చానని వివరించారు. రుణమాఫీ కానీ లక్షల మంది అధికారిక జాబితా కూడా తమ వద్ద ఉన్నదని, అలాగే రేవంత్ రెడ్డి సిఎం అయిన తర్వాత వ్యవసాయం చేయలేక ఆత్మహత్యలు చేసుకున్న 670 మంది రైతుల వివరాలు, వడ్ల బోనస్ రాని రైతుల జాబితా కూడా తమ వద్ద ఉన్నదని కెటిఆర్ వివరిచంఅరు. తమ కంటే సిఎం రేవంత్ రెడ్డి బిజీగా ఉంటారని, ఆయన ఢిల్లీలో ఉన్నందున, ఎవరైన మంత్రులు చర్చకు వస్తే, తమ వద్ద ఉన్న వివరాలు ఇచ్చేవాడినిన కెటిఆర వివరించారు. ఏ అంశంపైనైనా,ఎప్పుడైనా, ఎక్కడైనా తాము చర్చకు సిద్ధమన్నారు. ఒకవేళ చర్చకు రాకపోతే కెసిఆర్‌కు కి క్షమాపణ చెప్పాలని సిఎం రేవంత్‌రెడ్డిని కెటిఆర్ డిమాండ్ చేశారు.

## కెటిఆర్ చర్చకు వస్తారా?

(మొదటి పేజీ తరువాయి)

బిఆర్‌ఎస్ కు డిపాజిట్లు రావు అని అన్నారు. నోరుంది కదా అని కెటిఆర్ ఏది పడితే అది మాట్లాడమేనా? అని భట్టి ప్రశ్నించారు.

**ప్రతిపక్ష హోదాలో కెటిఆర్ వస్తే సమాధానమిస్తాం : పొన్నం**

గాంధీభవన్‌లో మంగళవారం పొన్నం ప్రభాకర్ మీడియాతో మాట్లాడుతూ బిఆర్‌ఎస్ నుంచి ఎవరు చర్చకు వచ్చినా సమాధానం చెప్పేందుకు ప్రభుత్వం సిద్దంగా ఉందని, అయితే చర్చ అనేది ప్రజాప్రతినిధులు అసెంబ్లీలో చేస్తారని, కెసిఆర్‌తో లెటర్ రాయించుకుని ప్రతిపక్ష నేత హోదా తీసుకుని కెటిఆర్ చర్చకు రావాలని అన్నారు. అసెంబ్లీలో చర్చకు రావాలని, ఎవరేమిటో కాంగ్రెస్ ప్రభుత్వం ఏమి చేసిందో, బిఆర్‌ఎస్ ప్రభుత్వం ఏమి చేసిందో అంతా చర్చిద్దామని మంత్రి అన్నారు. ప్రతి అంశంపై అసెంబ్లీలో చర్చిస్తే అంత రికార్డ్ అవుతుందని, బిఆర్‌ఎస్ అధినేత కెసిఆర్‌కు, కెటిఆర్‌కు చేతనైతే అసెంబ్లీలో చర్చకు రావాలని డిమాండ్ చేశారు.

**విదేశాల్లో తిరుగుతున్న కెటిఆర్‌కు సిఎం షెడ్యూల్‌పై అవగాహన లేదు :జగ్గారెడ్డి**

జగ్గారెడ్డి మాట్లాడుతూ సిఎం రేవంత్‌రెడ్డి రైతులకు ఎరువులు, నిధులు, నీళ్ల పంచాయతీ కోసం, తెలంగాణ రాష్ట్రానికి అవసరమైన నిధుల కోసం ఢిల్లీకి వెళితే కెసిఆర్ కుటుంబం లిక్కర్ దందా కోసం ఢిల్లీ వెళ్లిందన్నారు. గాంధీభవన్‌లో మీడియాతో ఆయన మాట్లాడుతూ కెటిఆర్ ఇటీవలి కాలంలో తెలంగాణలో ఉండడం లేదని, నెలకోసారి విదేశాల్లో ఉంటున్నారని, విదేశాల్లో తిరిగే కెటిఆర్‌కు సిఎం రేవంత్‌రెడ్డి షెడ్యూల్ ఏమిటి, ఏమి చేస్తున్నారనే విషయాలపై కెటిఆర్‌కు అవగాహన లేదన్నారు. పదేళ్లు మంత్రిగా చేసిన కెటిఆర్, సిఎంగా ఉన్న కెసిఆర్‌కు ముఖ్యమంత్రులు ఢిల్లీకి ఎందుకు పోతారనే ఇంగిత జ్ఞానం లేదా అని ప్రశ్నించారు. పదేళ్లు అధికారంలో ఉన్న కెసిఆర్, కెటిఆర్‌లకు 18 నెలలు అధికారంలో లేకపోయే సరికి నీళ్లలో చేప ఒడ్డున పడ్డట్టు గిలగిల కొట్టుకుంటున్నారని, అందులో భాగంగానే కాంగ్రెస్ ప్రభుత్వం, సిఎం రేవంత్‌రెడ్డిపై ఇష్టానుసారంగా మాట్లాడుతున్నారన్నారు.

**అసెంబ్లీకి వచ్చే ధైర్యం లేని బిఆర్‌ఎస్ నేతలు : ఎంఎల్‌సి అద్దంకి దయాకర్**

బిఆర్‌ఎస్ నేతలకు అసెంబ్లీకి వచ్చే ధైర్యం లేదని, అందుకే రోడ్లపై చర్చలకు డిమాండ్ చేస్తున్నారని, బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ బజారున పడి పిచ్చి కుక్కలా వ్యవహరిస్తున్నారని ఎంఎల్‌సి అద్దంకి దయాకర్ అన్నారు. సిఎల్‌పి కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ సిఎం రేవంత్ రెడ్డి పేరు చెబితే బిఆర్‌ఎస్ నాయకులు వణికిపోతున్నారన్నారు. అసెంబ్లీకి కెసిఆర్ ఎందుకు రావడంలేదని ప్రశ్నించారు. కెటిఆర్ తన స్థాయికి దిగజారి నీచ, నికృష్ట స్థాయిలో మాట్లాడుతున్నారని, లక్ష కోట్లు దోచుకున్న దొంగలు, అవినీతి సంపాదనతో ఎగిరెగిరి పడుతున్నారు.

**కెటిఆర్ మరో కొత్త డ్రామాకు తెరలేపారు : బీర్ల అయిలయ్య**

తెలంగాణ రాష్ట్రంలో కెటిఆర్ మరో కొత్త డ్రామాకు తెరలేపారని, రైతులు, నిరుద్యోగులు, బనకచర్ల అంశాలపై చర్చకు అసెంబ్లీకి రావాలని కెసిఆర్‌కు సిఎం రేవంత్ రెడ్డి సవాల్ విసిరితే సోమాజీగూడ ప్రెస్ క్లబ్‌కు రావాలని కెటిఆర్ సవాల్ విసరడం ఏమిటి అర్థం కావడంలేదని ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య అన్నారు. బనకచర్ల ప్రాజెక్టు విషయంలో కెసిఆర్, హరీష్‌రావు అప్పనంగా ఆంధ్రకు నీళ్లు పంపించారని అన్నారు. రాయలసీమకుపోయి రొయ్యల పులుసు తిని తెలంగాణను ఎండబెట్టి రాయలసీమకు నీళ్లు ఇవ్వడానికి ఒప్పుకుంది కెసిఆర్ అన్నారు. మరోసారి సిఎం రేవంత్ రెడ్డిపై చిల్లర మల్లర మాటలు మాట్లాడితే తెలంగాణ ప్రజలు బిఆర్‌ఎస్ నేతలను ఉరికించి కొడతారని ఆయన హెచ్చరించారు.

## ఇఒలపై దాడి చేస్తే ఊరుకోం : మంత్రి సురేఖ

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** భద్రాచలం ఈవో రమాదేవిపై జరిగిన దాడిని దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ తీవ్రంగా ఖండించారు. దేవుడి భూములు రక్షించే ఈవోలపై దాడి చేస్తే ఊరుకునే ప్రసక్తేలేదని కొండా సురేఖ తేల్చి చెప్పారు. రాష్ట్రంలో ఎక్కడైనా... రూల్స్‌కు విరుద్ధంగా ఎండోమెంట్ భూములను కబ్జా చేస్తే పిడి యాక్టు పెడుతాం.... ఈ విషయంలో గతంలోనూ తాము స్పష్టం చేశానని గుర్తు చేశారు.భద్రాచలం రామాలయ భూములు పురుషోత్తపట్నం (ఎపి)లో కబ్జాకి గురవుతుండగా అడ్డుకున్న ఈవో రమాదేవిపై దాడి చేయడం సహేతుకం కాదన్న పేర్కొన్నారు. ఈ విషయంలో ఎపి ప్రభుత్వం.... ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రత్యేక చొరవ తీసుకొని... సమస్యను పరిష్కారం చేయాలని దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ విజ్ఞప్తి చేశారు.పురుషోత్తపట్నం దాడికి సంబంధించి భద్రాచలం ఈవో రమాదేవితో మంత్రి కొండాసురేఖ ఫోన్లో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. ప్రస్తుతం ఈవో రమాదేవి స్థానిక ఆసుపత్రి ఐసీయూలో చికిత్స పొందుతున్నారు. డిపార్టుమెంటు నుంచి అండగా ఉంటామని... వైద్యుల సూచన మేరకు చికిత్స పొందాలని రమాదేవికి మంత్రి సురేఖ సూచించారు.

## భూ ఆక్రమణదారుల దాడి

(మొదటి పేజీ తరువాయి)

విరుచుకుపడుతూ బెదిరింపులకు పాల్పడ్డారు. దీంతో పరిస్థితి ఉద్రిక్తతంగా మారింది. ఆక్రమణదారులు ఇవో రమాదేవిపై దాడిచేశారు. దీంతో ఆమె స్పృహకోల్పోవడంతో హుటాహుటిన భద్రాచలంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించి చికిత్సలు అందిస్తున్నారు. ఇదిలా ఉండగా ఆక్రమ నిర్మాణాలు జరుగుతున్నాయనే సమాచారం మేరకు ఏపిఒ భవాని రామకృష్ణ కొందరు సిబ్బందితో కలిసి సోమవారం ఘటనా స్థలానికి చేరుకున్న విషయం విధఇతమే. నిర్మాణాన్ని ఆపేందుకు ప్రయత్నం చేయగా అక్కడ వివాదం చోటు చేసుకుంది. దీంతో రంగ ప్రవేశం చేసిన ఆంధ్రా పోలీసులు, రెవెన్యూ అధికారుల ముందే అక్కడికి వెళ్లిన అధికారులపై ధౌర్జన్యానికి పాల్పడమే కాకుండా ఇది ఆంధ్రా, మీది తెలంగాణ ఇక్కడి నుండి తక్షణమే వెళ్లిపోవాలని, లేదంటే ఊరుకునేదే లేదని బెదిరింపులకు పాల్పడంతో విధిలేని పరిస్థితులు అక్కడికి వెళ్లిన సిబ్బంది వెనక్కు మళ్లిన విషయం తెలిసిందే. కోర్టు తీర్పు ఉన్నా పురుషోత్తపట్నంలోని భూములను రామాలయం అప్పగించాలని తెలంగాణ, ఆంధ్రా హైకోర్టులు స్పష్టమైన తీర్పు ఇచ్చినప్పటికీ అంధ్రాకు చెందిన రెవెన్యూ, పోలీస్ అధికారులు సహకరించడం లేదని రామాలయం ఉద్యోగులు అంటున్నారు. రామాలయం భూములను కాపాడుకునేందుకు వెళ్లిన వాలిపై కూడా విచక్షణారహితంగా వ్యవహిస్తుంటే అంతా ప్రేక్షక పాత్ర పోషించారని, హై కోర్టు తీర్పును కూడా గౌరవించకుండా దాడులకు పాల్పడటం హేయమైన చర్యను పలువురు అంటున్నారు.

**విభజన తెచ్చిన తంటా :** సుమారు 918 ఎకరాల రామాలయం భూములు రాష్ట్ర విభజన సమయంలో ఆంధ్రాలో విలీనం అయ్యాయి. దీంతో రాముడు ఇటువైపు, మాన్యం అటువైపు ఉండిపోయింది. రామలయాన్ని అభివృద్ధి చేసేందుకు సెంటు భూమి కూడా లేకపోవడంతో గత ప్రభుత్వం చేతులెత్తేసింది. కోర్టు తీర్పుతో భూములను స్వాదీనం చేసుకుని అభివృద్ధి పనులు చేసి రామాలయాన్ని తీర్చిదిద్ది సుందరభద్రాద్రిగా మారుద్దామననే సంకల్పంతో ఉన్నప్పటికీ ఉపయోగం లేకుండా పోతోంది. ప్రభుత్వం చొరవ చూపాలి దశాబ్దాల కాలంగా ఈ రగడ సాగుతూనే ఉంది. గత కొంతకాలం క్రితం కూడా ఇఒ రామాదేవి భూముల రక్షణ కోసం అక్కడికి వెళ్లినప్పుడు దాదాపూ ఇదే పరిస్థితి నెలకొంది. ఉమ్మడి జిలాల్లో ఉన్న ముగ్గురు మంత్రులు దీనిపై సమగ్ర చర్యలు తీసుకుని ముఖ్యమంత్రి సమక్ష్యంలో ఓ కమిటీని వేసి ఏపి ప్రభుత్వానికి విషయాన్ని క్షుణ్ణంగా వివరించే సమస్య పరిష్కారానికి కృషిచేయాలని, ఈ విషయాన్ని ఇలానే వదిలేస్తే ఎప్పటికీ రావణకాష్టంలా రగులుతూనే ఉంటుందని రామభక్తులు అంటున్నారు.

## జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక

(మొదటి పేజీ తరువాయి)

బల్దియా ఎన్నికలకు జూబ్లీహిల్స్ సెమీ ఫైనల్ కానుంది. జిహెచ్‌ఎంసిలో పాగా వేయాలంటే ఈ ఎన్నికల్లో గెలిచి సత్తా చాటాలని అన్ని పార్టీలు వ్యూహాలు ప్రతి వ్యూహాలు రచిస్తున్నాయి. ఖాళీ అయింది బిఆర్‌ఎస్ స్థానం కాబట్టి తిరిగి నిలబెట్టుకోవాలని ఎన్నికను ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. ఈ ఎన్నికల్లో విజయంతో కాంగ్రెస్‌ను ఆత్మరక్షణలో పడేయాలనే వ్యూహంతో బిఆర్‌ఎస్ పావులు కదుపుతోంది. ఇక కాంగ్రెస్‌కు గతంలో సికిందరాబాద్ కంటోన్మెంట్ ఉప ఎన్నిక మాదిరిగానే గెలుపు ద్వారా ప్రజలు తమవైపే ఉన్నారని నిరూపించుకునేందుకు జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక మంచి అవకాశంగా మారనుంది. దీంతో కాంగ్రెస్ ఈ ఎన్నికను ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. రాబోయే జిహెచ్‌ఎంసి ఎన్నికలకూ సాంకేతంగా మారనుంది. బిజెపి సైతం ఇక్కడ విజయం ద్వారా భవిష్యత్ తమ పార్టీదేనని చెప్పాలనుకుంటోంది. ఈ అసెంబ్లీ సెగ్మెంట్ సికింద్రాబాద్ పార్లమెంట్ పరిధిలో ఉండటంతో కేంద్రమంత్రి కిషన్‌రెడ్డికి సైతం ప్రతిష్టాత్మకంగా మారింది. దీంతో ఆయన ఇటీవల తరచుగా జూబ్లీహిల్స్‌లో పర్యటిస్తున్నారు. ఎన్నికల్లో ఎంఐఎం నిర్ణయం కీలకంగా మారనుంది. ఎంఐఎం పోటీ చేసినా, చేయకపోయినా గెలుపోటములను ప్రభావితం చేసేలా ఉంటుంది. దీంతో ఎంఐఎం అధికార కాంగ్రెస్‌కు మద్దతు ఉంటుందా? లేక అభ్యర్థిని పోటీ పెడుతుందా? అనే విషయం ఉత్కంఠతగా మారింది.

**బిఆర్‌ఎస్‌లో ఎవరికో టికెట్..** బిఆర్‌ఎస్ నుంచి బరిలో దిపిందేకు గోపీనాథ్ భార్య అనిత, ఆయన సోదరుడు వజ్రనాథ్ పేర్లు వినిపిస్తున్నాయి. వారు ఇప్పటికే బస్తీల్లో ప్రజలను కలుస్తున్నారు. పిజెఆర్ తనయుడు, గతంలో ఈ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా గెలిచిన విష్ణువర్ధన్‌రెడ్డి గత ఎన్నికలకు ముందు బిఆర్‌ఎస్‌లో చేరారు. ఈ సారి ఎలాగైనా బిఆర్‌ఎస్ టిక్కెట్ సాధించి గెలవాలనుకుంటున్నారు. బిఆర్‌ఎస్ హయాంలో తెలంగాణ ఎడ్యుకేషన్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ చైర్మన్‌గా పనిచేసిన రావుల శ్రీధర్‌రెడ్డి గతంలో, అంతకు ముందు ఇదే నియోజకవర్గం నుంచి బిజెపి అభ్యర్థిగా పోటీ చేసి ఓటమిపాలయ్యారు. ఆయన కూడా గులాబీ పార్టీ టిక్కెట్ ఆశిస్తున్నారు.

**కాంగ్రెస్‌లో పెరిగిన ఆశావాహులు :** అధికార కాంగ్రెస్ పార్టీ తరపున బరిలో నిలిచేందుకు పెద్ద సంఖ్యలో ఆశవాహుల పోటీపడుతున్నారు. అధికార పార్టీ కావడం, నగరం నుంచి ఆ పార్టీకి గత ఎన్నికల్లో ఒక్క ఎమ్మెల్యే కూడా లేకపోవడం, గెలిస్తే మంత్రిపదవి ఖాయమన్న నమ్మకంతో పలువురు ఇప్పటికే ప్రయత్నాలు ప్రారంభించారు. గత ఎన్నికల్లో ఇక్కడి నుంచి పోటీచేసిన వెటరన్ క్రికెటర్ అజహారుద్దీన్ తన టిక్కెట్ తిరిగి తనకే దక్కుతుందని ధీమా వ్యక్తం చేస్తున్నారు. గత ఎన్నికల్లో నాంపల్లి నియోజకవర్గం నుంచి గణనీయమైన ఓట్లు పొందిన ఫిరోజ్‌ఖాన్ సైతం టిక్కెట్ కోసం ప్రయత్నిస్తున్నారు. ఖైరతాబాద్ కార్పొరేటర్ విజయారెడ్డి, గతంలో తన తండ్రి పిజెఆర్ నియోజకవర్గం కావడంతో తనకు గెలిచే అవకాశాలుంటాయని, టిక్కెట్ కోరుతున్నారు. మేయర్ గద్వాల్ విజయలక్ష్మి తాను ఇక జిహెచ్‌ఎంసి ఎన్నికల్లో పోటీచేయనని ఇప్పటికే ప్రకటించారు. ఉపఎన్నిక ద్వారా వచ్చిన అవకాశాన్ని వినియోగించుకోవాలని, అందుకు తన తండ్రి కె.కేశవ్ రావు ద్వారా టిక్కెట్ కోసం ప్రయత్నిస్తున్నారు. బిసిల జాబితాలో మాజీ మేయర్ బొంతు రామ్మోహన్, మాజీ కార్పొరేటర్ మురళీ గౌడ్ టిక్కెట్ ఆశిస్తున్నారు. మురళీగౌడ్, ఆయన కొడుకు సంజయ్ గౌడ్ ఇద్దరూ చెరొకసారి కార్పొరేటర్లుగా పనిచేశారు. సుదీర్ఘకాలం నియోజకవర్గంలో ఉండటంతో పాటు తాము స్థానికంగా కార్పొరేటర్‌గా పనిచేసినందున ప్రజలతో సత్సంబంధాలు ఉన్నాయని చెప్పుకుంటున్నారు. 2014లో ఎంఐఎం నుంచి పోటీచేసి ద్వితీయ స్థానంలో నిలిచిన నవీన్‌యాదవ్, గత ఎన్నికలకు ముందు కాంగ్రెస్‌లో చేరారు. మాజీ డిప్యూటీ మేయర్ బాబా ఫసియుద్దీన్ సైతం పార్టీ తనకేమైనా అవకాశం ఇస్తే పోటీ చేస్తానని చెబుతున్నారు.

**బిజెపిలో పెరిగిన పోటీ..** గత అసెంబ్లీ ఎన్నికల్లో బిజెపి నుంచే పోటీ చేసిన లంకెల దీపక్‌రెడ్డితో పాటు ఖైరతాబాద్ మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి, పారిశ్రామికవేత్త కీర్తి రెడ్డి, ఎన్.వి. సురేశ్‌లతో సహా పలువురు నేతలు జూబ్లీహిల్స్ టికెట్ కోసం జోరుగా ప్రయత్నిస్తున్నట్లు తెలుస్తోంది. గత లోక్‌సభ ఎన్నికల్లో చార్మినార్ నుంచి పోటీచేసిన మాధవీలత సైతం రేసులో ఉన్నారనే ప్రచారం జరుగుతోంది. టిడిపి నగరంలో రాజకీయ రంగప్రవేశం చేయాలనుకుంటున్నట్లు ప్రచా రం సాగుతోంది. గతంలో కూకట్‌పల్లి నుంచి పోటీచేసిన నందమూరి హరికృష్ణ కుమార్తె సుహాసినిని పోటీలో దింపుతారనే ప్రచారం జరుగుతోంది. టిడిపి అసలు పోటీలో ఉంటుందా? బిజెపికి మద్దతుగా ఉంటుందా? అనే విషయం తెలాల్సి ఉంది.

## గాజా నుండి తరలించాలి

(మొదటి పేజీ తరువాయి)

మీడియా వద్ద ఆశాభావం వ్యక్తం చేశారు. ''మధ్యప్రాచ్యంలో పరిస్థితులన్నీ క్రమంగా సర్దుమణుగుతున్నాయనే అనుకుంటున్నా, వారు (ఇజ్రాయెల్) మమ్మల్ని గౌరవిస్తున్నారు, మేం వారిని గౌరవిస్తున్నాం'' అని ట్రంప్ చెప్పారు. ఇరాన్ తమతో సంప్రదింపులు పునఃప్రారంభించాలని కోరుకుంటోందనీ, కానీ వారు ఇప్పటివరకూ ఆ విషయాన్ని ధృవీకరించలేదని అన్నారు. అమెరికాతో మళ్ళీ చర్చలకు తాము సిద్ధంగానే ఉన్నామని ఇరాన్ గతవారంలో ప్రకటించింది.

గాజా నుండి వెళ్ళిపోయేందుకు ఇష్టపడే పాలస్తినా ప్రజలను స్వీకరించేందుకు కొన్ని దేశాలు సంసిద్ధత వ్యక్తం చేస్తున్నాయని, అందుకు సంబంధించిన ప్రక్రియ పురోగతిలో ఉందన్న విషయాలను వారు ప్రస్తావించారు. పాలస్తినాలో యుద్ధాన్ని విరమించినప్పటికీ అక్కడి ప్రజలను వేరే చోటకు తరలించాలని ట్రంప్‌–నెతన్యాహూ దృఢనిశ్చయంతో ఉన్నారని ఈ విందు సమావేశంలో మరోసారి తేటతెల్లమైంది. గాజాస్ట్రిప్‌ను ఒక రియల్ ఎస్టేట్ ప్రాతిపదికపై ప్రపంచంలోనే అత్యంత సుందరమైన పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దాలన్న ట్రంప్ ఆలోచనలనే ఆ ఇద్దరూ పునరుద్ఘాటించారు. పాలస్తినాలో హమాస్ ప్రభుత్వాధికారాన్ని కొనసాగించేందుకు వీలుగా కాల్పుల విరమణ ఒప్పందానికి నేతన్యాహూ సిద్ధంగా లేరని ఇప్పటికే వార్తలు వెలువడ్డాయి. కానీ వైట్‌హౌస్ అధికారులు మాత్రం సత్వర కాల్పుల విరమణకు ఒత్తిడి తెస్తున్నారు. గాజాలోకి సహాయాన్ని భారీగా తరలించేందుకు ప్రోత్సహిస్తున్నామని చెబుతున్నారు.

ట్రంప్‌–నెతన్యాహూలిద్దరూ భార్యా సమేతంగా ఉన్నతస్థాయి సహాయకులు, ఇతర ముఖ్యులతో ఎదురెదురుగా చెరోవరుసలో కూర్చుని రాత్రి విందు కార్యక్రమంలో పాల్గొన్న సందర్భంగా మధ్యప్రాచ్యంలో అమెరికా ప్రత్యేక దూత విట్‌కాఫ్ ఇరాన్‌–పాలస్తినా విషయాలను ప్రస్తావించారు. గాజాలో హమాస్‌తో కాల్పుల విరమణ ఒప్పందం కూడా వచ్చేవారమే జరుగుతుందని విట్‌కాఫ్ ఆశాభావం వ్యక్తం చేశారు. వచ్చేవారం ఇరాన్‌తో అణుఒప్పందంపై చర్చలు జరిగే అవకాశం ఉందని విట్‌కాఫ్ చెప్పారు. కానీ ఇరాన్ అధ్యక్షుడు పెజెష్కియన్ మొన్న ఒక ఇంటర్వ్యూలో, ఇజ్రాయెల్‌–అమెరికా చేసిన అక్రమ యుద్ధం సృష్టించిన విధ్వంసం నుండి ఆ నష్టం నుండి తమదేశం ఇంకా తేరుకోలేదన్నారు. కాగా నిర్ణీత ప్రకారం నెతన్యాహూ అమెరికా కాంగ్రెస్ స్పీకర్ మైక్ జాన్సన్‌తో కూడా సమావేశమవుతారు.

**నోబెల్‌కు ట్రంప్‌పేరు నెతన్యాహూ సిఫార్సు**

అమెరికా కాలమానం ప్రకారం సోమవారంరాత్రి వైట్‌హౌస్‌లో విందు భోజన సమావేశం సందర్భంగా ప్రశంసలు హోరెత్తాయి. ఇరాన్‌పై 12 రోజులపాటు (జూన్ 13–24) యుద్ధం చేసిన నాయకులిద్దరూ విజయం సాధించినందుకు పరస్పరం ఒకరిపై మరొకరు ప్రశంసలు కురిపించుకున్నారు. ట్రంప్ పేరును నోబెల్ బహుమతి–2026 కి సిఫార్సు చేస్తున్నట్లు నెతన్యాహూ ప్రకటించారు. ఈ మేరకు నార్వేజియన్ నోబెల్ బహుమతి ఎంపికల కమిటీకి ఇజ్రాయెల్ ప్రభుత్వం రాసిన లేఖ ప్రతిని ఈ విందు కార్యక్రమంలో ట్రంప్‌కు ఆయన అందజేశారు. ట్రంప్ సతీమణి మెలానియా, నెతన్యాహూ సతీమణి సారా ఇద్దరూ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## సకాలంలో యూరియా ఇవ్వండి

(మొదటి పేజీ తరువాయి)

చేశారని కేంద్ర మంత్రి దృష్టికి సిఎం తీసుకెళ్లారు. రాష్ట్రంలో ప్రాజెక్టులకు నీరు రావడం, సాగు పనులు జోరుగా సాగుతున్నందున యూరియా సరఫరాలో ఆటంకాలు తలెత్తకుండా చూడాలని కోరారు. జులై నెలకు సంబంధించి 63 వేల మెట్రిక్ టన్నులు దేశీయంగా ఉత్పత్తి అయిన యూరియా, 97 వేల మెట్రిక్ టన్నుల విదేశాల నుంచి దిగుమతి చేసుకున్న యూరియా రాష్ట్రానికి సరఫరా చేయాల్సి ఉండగా ఇప్పటి వరకు కేవలం 29 వేల మెట్రిక్ టన్నుల యూరియా మాత్రమే చేశారని కేంద్ర మంత్రికి సిఎం వివరించారు. దేశీయంగా ఉత్పత్తి అవుతున్న యూరియా కోటాను తెలంగాణకు పెంచాలని సిఎం కోరారు. యూరియా సరఫరాకు సంబంధించి రైల్వే శాఖ తగిన రేక్‌లు కేటాయించడం లేదని, వాటి సంఖ్య పెంచాలని విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా తెలంగాణలో జహీరాబాద్ ఇండస్ట్రియల్ స్మార్ట్ సిటీ అభివృద్ధికి సహకరించాలని కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయుష్ గోయల్‌కు ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. ఢిల్లీలోని వాణిజ్యభవన్‌లో కేంద్ర మంత్రి పీయుష్ గోయల్‌తో సిఎం రేవంత్ రెడ్డి మంగళవారం భేటీ అయ్యారు. జహీరాబాద్ ఇండస్ట్రియల్ స్మార్ట్ సిటీ అభివృద్ధికి జాతీయ పారిశ్రామిక కారిడార్ అభివృద్ధి, అమలు ట్రస్ట్ (ఎన్‌ఐసిడిఐటి) ఆమోదించిన రూ.596 కోట్లను త్వరగా విడుదల చేయాలని కేంద్ర మంత్రిని ముఖ్యమంత్రి కోరారు. స్మార్ట్ సిటీకి అవసరమైన నీటి సరఫరా, విద్యుత్, ఇతర సదుపాయాల కల్పనకు ఆర్థిక సహాయం చేయాలని కేంద్ర మంత్రికి సిఎం విజ్ఞప్తి చేశారు. హైదరాబాద్‌వరంగల్ పారిశ్రామిక కారిడార్‌లో భాగంగా వరంగల్ విమానాశ్రయానికి నిధులు మంజూరు చేయాలని కేంద్ర మంత్రిని సిఎం అభ్యర్థించారు.



హైదరాబాద్‌విజయవాడ పారిశ్రామిక కారిడార్ ఫీజుబిలిటీని అధ్యయనం చేస్తున్నట్లు కేంద్ర మంత్రి దృష్టికి సిఎం తీసుకెళ్లారు. తెలంగాణ ప్రభుత్వం ఆదిభట్లలో అత్యున్నతమైన మౌలిక వసతులతో ప్రత్యేకమైన రక్షణ, ఏరోస్పేస్ పార్క్‌ను ఏర్పాటు చేసిందని, ఈ నేపథ్యంలో హైదరాబాద్‌బెంగళూర్ పారిశ్రామిక కారిడార్‌ను ఏరోడిఫెన్స్ కారిడార్‌గా మంజూరు చేయాలని కేంద్ర మంత్రి గోయల్‌కు సిఎం రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. పెట్టుబడులకు సిద్ధంగా ఉన్న వంద ప్లగ్ అండ్ ప్లే పారిశ్రామిక పార్క్‌ల అభివృద్ధికి సంబంధించిన ప్రతిపాదనలు సమర్పిస్తామని, కేంద్ర ప్రభుత్వం వాటికి మద్దతుగా నిలవాలని కేంద్ర మంత్రిని సిఎం కోరారు. సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు (క్రీడలు) ఎ.పి.జితేందర్ రెడ్డి, ఎంపిలు డాక్టర్ మల్లు రవి, చామల కిరణ్ కుమార్ రెడ్డి, సిఎం ప్రత్యేక కార్యదర్శి అజిత్ రెడ్డి, కేంద్ర పథకాల సమన్వయ కార్యదర్శి డాక్టర్ గౌరవ్ ఉప్పల్ తదితరులు పాల్గొన్నారు.



# జనరల్

STATE & REGIONAL NEWS

## భర్తను గొడ్డలితో చంపిన ఇద్దరు భార్యలు

**ప్రజాపక్షం/లింగాలఘణపురం :** తెలంగాణలో మరో ఘోరమైన సంఘటన చోటుచేసుకుంది. ఇద్దరి భార్యల చేతిలో ఓ భర్త అత్యంత దారుణంగా హత్యకు గురయ్యాడు. ఈ ఘటన జనగామ జిల్లా లింగాల ఘనపురం మండలంలో జరిగింది. పూర్తి వివరాల్లోకి వెళితే, జనగామ జిల్లా లింగాల ఘణపురం మండలం ఏనబావి గ్రామ శివారు పిట్టలోనిగూడెంలో కాల్య కనకయ్య (30) నివాసం ఉంటున్నాడు. అతడు మద్యానికి బానిసయ్యాడు. తరచూ తాగొచ్చి ఇద్దరి భార్యలతో గొడవ పడుతుండేవాడు. మే 18న సొంత అక్కను హత్య చేశాడు. అనంతరం అక్కడ నుంచి పరారయ్యాడు. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు కనకయ్య కోసం గాలింపు చర్యలు చేపట్టారు. అయితే, కనకయ్య అప్పుడప్పుడు గ్రామానికి వస్తూ, భార్యలను, గ్రామస్తులను బెదిరిస్తూ ఉండేవాడు. సోమవారం రాత్రి ఇంటికి చేరుకుని గొడ్డలి పట్టుకుని భార్యను బెదిరించాడు. అదే సమయంలో విసిగిపోయిన ఆ ఇద్దరు అదే గొడ్డలితో భర్తను హత్యచేశారు. విషయం తెలుసుకున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

పుడమి గర్భం నుంచి నల్ల బంగారాన్ని వెలికితీసే

## శ్రమజీవుల యదార్థ జీవితాలే వెలుగుల వెనక

### వేల్పుల నారాయణ రచించిన కథాసంపుటి ఆవిష్కరణలో వక్తల ప్రశంస



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** పుడమి గర్భం నుంచి నల్ల బంగారాన్ని వెలికితీసి సమాజంలో వెలుగు నింపుతున్న శ్రమజీవుల యదార్థ జీవితాలే ''వెలుగుల వెనక'' కథా సంపుటి అని పలువురు వక్తలు ప్రశంసించారు. హైదరాబాద్‌లోని రవీంద్ర భారతిలో మంగళవారం అభ్యుదయ రచయితల సంఘం, తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ, నవచేతన పబ్లిషింగ్ హౌస్ సంయుక్త ఆధ్వర్యంలో తెలంగాణ జాతీయ కార్యదర్శి వేల్పుల నారాయణ రచించిన వెలుగుల వెనుక కథాసంపుటి పుస్తక ఆవిష్కరణ సభ జరిగింది. అరసం అధ్యక్షులు పల్లేరు వీరస్వామి అధ్యక్షతన జరిగిన ఈ పుస్తకావిష్కరణ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా విచ్చేసిన తెలుగు యూనివర్సిటీ మాజీ వైస్ చాన్సలర్ ఆచార్య ఎస్.వి సత్యనారాయణ వెలుగుల వెనుక కథా సంపుటిని ఆవిష్కరించగా, ప్రముఖ కథా రచయిత విమర్శకులు కె.పి.అశోక్ కుమార్ పుస్తకాన్ని పరిచయం చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకటరెడ్డి, తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధులు కందిమళ్ల ప్రతాపరెడ్డి, సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కళవేన శంకర్, ప్రముఖ రచయిత, నవ చేతన పబ్లిషింగ్ హౌస్ సంపాదకులు డాక్టర్. ఏటుకూరి ప్రసాద్, నవ చేతన విజ్ఞాన సమితి జనరల్ మేనేజర్ ఎన్.మధుకర్,అరసం ప్రధాన కార్యదర్శి రాపోలు సుదర్శన్, సమన్వయకర్త కెవిఎల్, ప్రముఖ నవలా రచయిత కాలువ మల్లయ్య, తెలంగాణ బిసి కమిషన్ మాజీ చైర్మన్ బి.ఎస్. రాములు, పుస్తక రచయిత వేల్పుల నారాయణ ప్రసంగించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథి ఎస్.వి. సత్యనారాయణ మాట్లాడుతూ నిమగ్నత, నిబద్ధత, నిబిడిత సంగమం ప్రముఖ రచయిత వేల్పుల నారాయణ రాసిన 'వెలుగుల వెనుక' అగ్రశ్రేణి కార్మిక సాహిత్య కథా సంపుటి అని అన్నారు. కేవలం తెలుగు సాహిత్యంలోనే కాదు. భారతీయ సాహిత్యంలోనే కొత్త చేర్పు ఈ పుస్తకమని, ఇది హిందీ, ఆంగ్లం భాషల్లోకి అనువాదం చెందితే జాతీయ స్థాయిలో గుర్తింపు పొందుతుందని తెలిపారు. ఏటుకూరి ప్రసాద్ మాట్లాడుతూ పుస్తక రచయిత వేల్పుల నారాయణ వెనుక అభ్యుదయ రచయిత సంఘం ఉద్యమం ఉంది. ఆ ఉద్యమానికి భౌతిక వాదమనే పునాది ఉందని, ఆ పునాది మీదనే రచయిత శ్రమజీవుల జీవితాల కథకే అక్షర రూపం ఇచ్చారన్నారు. వేల్పుల కథల్లో చాల కథల్లో కార్మికుల వ్యక్తిగత, సమాజానికి జీవితాల్లో ఉంటే అతి సున్నితమైన భావాల్లో కూడ దోపిడీ ఎలా జరుగుతోందో కళ్లకు కట్టారన్నారు. కథకు ఉండాల్సిన క్లుప్తత, స్పష్టత, తాత్వికత, సుందరత, వాస్తవికత, అన్నింటికి మించి నిబిడిత అన్ని వేల్పుల కథల్లో ఉన్నాయని తెలిపారు. చాడ వెంకటరెడ్డి మాట్లాడు తూ సింగరేణి కార్మికుల బతుకులకు ప్రతి రూప మే 'వెలుగుల వెనుక' కథా సంపుటి అని అన్నారు. ఎంతో మేధోశక్తి, లోతైన విశ్లేషణతో రచయిత సమాజాన్ని మేల్కొల్పే రీతిలో వేల్పుల చురకలు అనే కవిత్వాన్ని రాయడం అభినందనీయమన్నారు. కాలువ మల్లయ్య మాట్లాడుతూ కార్మికులపై అనేక కథలు వచ్చాయని, కాని వేల్పుల స్వీయ అనుభవాల ఆధారంగా రాసిన వెలుగుల వెనుక కథాల్లో చాల బలం ఉందని ప్రశంసించారు. కందిమళ్ల ప్రతాపరెడ్డి మాట్లాడుతూ పుస్తక రచయిత నిరంత కృషీవళుడని, ఎప్పుడు ఏదో ఒకటి రాస్తునే ఉంటాడన్నారు. మధుకర్ మాట్లాడుతూ 'వెలుగుల వెనుక' అనే కథా సంపుటి సింగరేణి కార్మికు ల జీవితాలకు అక్షర రూపంలో వెలువడిన ఓ డ్యాక్యుమెంటరీ అని అన్నారు.

ఈ కార్యక్రమానికి అరసం సమన్వయ కర్త కెవిఎల్ స్వాగతం పలుకగా, అరసం ప్రధాన కార్యదర్శి రాపోలు సుదర్శన్ వందన సమర్పణ చేశారు. ఈ కార్యక్రమంలో నవ చేతన పబ్లిషింగ్ హౌస్ మేనేజర్ పి.నారాయణరెడ్డి, పలువురు కవులు,

## ఎసిబికి చిక్కిన డిప్యూటీ స్టేట్ టాక్స్ ఆఫీసర్ సుధ



**ప్రజాపక్షం/హైదరాబాద్:** డిప్యూటీ స్టేట్ టాక్స్ ఆఫీసర్ ఎం.సుధ ఓ కంపెనీ జిఎస్‌టి రిజిస్ట్రేషన్ కోసం లంచం తీసుకుంటూ ఎసిబి అధికారులకు మంగళవారం రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడ్డారు. జిఎస్‌టి రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తిచేసేందుకు సుధ రూ.8వేలు లంచం డిమాండ్ చేశారు. దీంతో బాధితుడు ఎసిబి అధికారులకు ఫిర్యాదు చేశారు. నాంపల్లిలోని తన కార్యాలయంలో బాధితుడి నుంచి రూ.8000లు తీసుకుం టూ ఎసిబికి పట్టుబడిన సుధను మెజిస్ట్రేట్ ముందు హాజరుపర్చగా 14 రోజుల జ్యూడీషియ ల్ రిమాండ్ విధించారు. దీంతో ఆమెను చంచల్‌గూడలోని మహిళా జైలుకు తరలించారు.



## కృష్ణా–గోదావరి జలాలపై కెసిఆర్ చర్చకు రావాలి

కాళేశ్వరం కట్టి కనీసం పది ఎకరాలకు కూడా నీళ్ళు ఇవ్వలేదు

రైతుల సంక్షేమం కోసం రూ.70వేలకోట్లు ఖర్చు చేశాం

మహబూబాబాద్ సోమ్లతండ బహిరంగ సభలో డిప్యూటి సిఎం భట్టి విక్రమార్క

**ప్రజాపక్షం/మహబూబాబాద్ ప్రతినిధి:** పది సంవత్సరాల్లో లక్ష నుంచి రెండు లక్షల కోట్లు ఖర్చుపెట్టి పట్టుమని పది ఎకరాలకు కూడా నీళ్ళు ఇవ్వనివారు కాళేశ్వరం వాస్తవాలు బయటికి వస్తున్నాయని వాటిని కప్పిపుచ్చుకునేందుకు బిఆర్ఎస్ నేతలు అడ్డగోలు మాటలు మాట్లాడుతున్నారని రాష్ట్ర డిప్యూటి సిఎం మల్లు భట్టి విక్రమార్క అన్నారు. మహబూబాబాద్ జిల్లాలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేసేందుకు విచ్చేసిన డిప్యూటి సిఎం సోమ్లతండాలో మహబూబాబాద్ ఎమ్మెల్యే డాక్టర్ భూక్య మురలీనాయక్ అధ్యక్షతన జరిగిన బహిరంగ సభలో మాటాడుతూ తప్పుడు మాటలు బంద్ చేయాలని, గత పార్లమెంట్ ఎన్నికల్లో గుండుసున్నా వచ్చినా బిఆర్ఎస్‌కు బుద్ధి రావడంలేదని అన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బిఆర్ఎస్ పార్టీకి డిపాజిట్లు కూడా దక్కవని, సంక్షేమ కార్యక్రమాలను కాంగ్రెస్ ప్రభు త్వం ఇంటింటికీ చేరవేస్తుకుంటూ ముందుకు పోతుందని, టిఆర్ఎస్ నేతలు అనవసరంగా ఎక్కువగా ఊహించుకుని సిఎం రేవంత్‌రెడ్డిపై అవాకు లు చవాకులు పేల్చవద్దని డిప్యూటి సిఎం హెచ్చరించారు. సిఎం రేవంత్‌రెడ్డి గురించి ఏది పడితే అది మాట్లాడుతున్నారని, ఆయనకు బేసిన్‌ల గురించి తెలియదని బిఆర్ఎస్ నేతలు ఇష్టానుసారంగా మాట్లాడుతున్నారని, ఆయనకు బేసిన్ల గురించి తెలియకపోతే కృష్ణా, గోదావరి బేసిన్ల నీళ్ళను ఈ రాష్ట్ర అవసరాలకే వాడాలని ఇటీవల ప్రజాభవన్‌లో పవర్ పాయింట్ ప్రజంటేషన్‌తో అందరికీ వివరించిన విషయాన్ని డిప్యూటి సిఎం గుర్తు చేశారు. రాష్ట్రం ఏమైనా పర్వాలేదని కృష్ణా, గోదావరి జలాలు వాడుకోండని పెద్ద మనిషి కెసిఆర్ ఆంధ్రప్రదేశ్‌లో ప్రకటన చేసినవిషయాన్ని వీడియాలతో సహా సిఎం రేవంత్‌రెడ్డి ప్రజాభవన్ లో చూపించారని తెలిపారు. కృష్ణా గోదావరికి బేసిన్ ప్రాజెక్టుల్లో నీళ్ళ గురించి లెక్కలతో సహా చర్చించడానికి సిఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం శాసనసభలో చర్చించడానికి సిద్ధంగా ఉందని, పెద్ద మనిషి కెసిఆర్ చర్చకు రావాలని సవాల్ విసురుతున్నామని డిప్యూటి సిఎం భట్టి విక్రమార్క తెలిపారు. లక్ష కోట్ల పైబడి సంక్షేమం కోసం ప్రజా ప్రభుత్వం ఖర్చుపెట్టిందని సిఎం ప్రకటిస్తే వాస్తవాలను బిఆర్ఎస్ నేతలు జీర్ణించుకోవడం లేదని, నిజంగా వారికి రాష్ట్ర ప్రజలపట్ల బాధ్యత, నిబద్ధత ఉంటే శాసనసభకు రండి లెక్కలు తీసుకుని రండి చర్చిద్దాం, ఎవరిది నిజమో అన్ని సిఎం రేవంత్ రెడ్డి పెద్ద మనిషి కెసిఆర్‌కు సవాల్ విసిరితే కెసిఆర్ సవాల్ స్వీకరించకుండా ఇంకొక ఆయన బయలు దేరారని, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చెప్పింది వీరికి అర్థమవుతోందా అని భట్టి ఎద్దేవా చేశారు. ప్రెస్‌క్లబ్‌కు వచ్చి సవాల్ ఎంటే ఎట్లా? సిఎం సవాల్‌ను స్వీకరించాలనుకుంటే శాసనసభకు రావాలని, రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని, బిఆర్ఎస్ నాయకత్వం మొత్తానికి తాను సవాల్ విసురుతున్నట్లు డిప్యూటి సిఎం తెలిపారు. కరెంట్ కోతలు, ట్రాన్స్‌పార్మర్లు కాలిపోతున్నాయని, నోరు ఉంది కదా అని బిఆర్ఎస్ నేతలు ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నారన్నారు. గిరిజనులు ఆత్మగౌరవంతో తలెత్తుకు బతకాలని అటవీ హక్కుల చట్టం క్రింద పంపిణీ చేసిన భూములను సాగులోకి తీసుకువచ్చేందుకు ఇందిరా సౌర గిరి జల వికాసం పథకాన్ని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నల్లమల డిక్లరేషన్ పేరుతో ప్రారంభించారని భట్టి తెలిపారు. పోడు రైతులకు ఉచితంగా సోలార్ పంపుసెట్లు, స్ప్రింకర్లు, డ్రిప్ లు, అపకాడో, వెదురు వంటి మొక్కలు ఉచితంగా అందించేందుకు ప్రజాప్రభుత్వం రూ.12,600 కోట్లు కేటాయించినట్లు తెలిపారు. రాష్ట్రంలో కోటిమంది మహిళలను కోటీశ్వరులుగా తీర్చిద్దేందుకు డ్వాక్రా మహిళలకు ప్రతిసంవత్సరం రూ.20వేల కోట్లు వడ్డీలేని రుణాలు అందించాల ని నిర్ణయించి మొదటి సంవత్సరం లో రూ.21వేల కోట్ల వడ్డీలేని రుణాలు పంపిణీ చేసినట్లు తెలిపారు. ఈనెల 12నుంచి 18వరకూ రాష్ట్రంలోని అన్నినియోజకవర్గాల్లో వడ్డీ లేని రుణా లు పెద్ద ఎత్తున పంపిణీ చేయబోతున్నట్లు, మహిళలందరినీ వ్యాపారవేత్తలుగా తీర్చిదిద్దాలని ప్రజా ప్రభు త్వం కంకణం కట్టుకుందని డిప్యూటి సిఎం భట్టి విక్రమార్క తెలిపారు. పేద విద్యార్థులకు విలువల తో కూడిన విద్యను అందించేందుకు ఒక్కో పాఠశాలకు రూ.200కోట్లు కేటాయించి 25ఎకరాల విస్తీర్ణంలో అత్యాధునిక వసతులతో ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ నిర్మిస్తున్నట్లు తెలిపారు. ఈ బహిరంగసభ లో రాష్ట్ర రెవిన్యూశాఖ మంత్రి శ్రీనివాసరెడ్డి, డిప్యూటీ స్పీకర్ డాక్టర్ రాంచంద్రునాయక్, రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, గిరిజన పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క, దేవాదాయ, అటవీ శాఖ మంత్రి కొండా సురేఖ, ముఖ్యమంత్రి సలహాదారులు వేం నరేందర్‌రెడ్డి, మహబూబాబాద్ ఎంపి పోరిక బలరాంనాయక్, ట్రైకార్ చైర్మన్ డాక్టర్ తేజావత్ బెల్లయ్యనాయక్, తదితరులు పాల్గొన్నారు.

శాంతి భద్రతలు, సైబర్ క్రైమ్, డ్రగ్స్ నేరాల నివారణలో

## తెలంగాణ పోలీసుల పనితీరు భేష్

తెలంగాణ పోలీసు అధికారులతో కేంద్ర హోం మంత్రిత్వ శాఖ ఉన్నతాధికారుల సమీక్షా సమావేశం

**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణ పోలీసుల పనితీరు తమకు అత్యంత సంతృప్తి నిచిందని కేంద్ర హోం మంత్రిత్వ శాఖ ఉన్నతాధికారుల ప్రతినిధుల బృందం అభిప్రాయపడింది. బంజారాహిల్స్‌లోని ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్ (ఐసిసిసి)లో బుధవారం తెలంగాణ పోలీ సు ఉన్నతాధికారులతో కేంద్ర హోం మంత్రిత్వ శాఖ ఉన్నతాధికారు ల బృందం సమీక్షా సమావేశం నిర్వహించింది.

సిఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వంలో ఇంత పెద్ద స్థాయిలో కేంద్రం సమీక్ష నిర్వహించడం ఇదే మొట్టమొదటిసారి. ఈ సమావేశం తెలంగాణలో భద్రతా పరిస్థితులపై సమీక్ష చేయడం, కేంద్రరాష్ట్ర సమన్వయాన్ని పెంపొందించడం, మౌలిక వసతుల అభివృద్ధి, కొత్త సాంకేతికతలతో నేరాల నివారణ కోసం కేంద్రం నుండి మద్దతు తదితర అంశాలపై సమావేశంలో చర్చించారు. ఈ సమావేశంలో కేంద్ర హోం మంత్రిత్వ శాఖకు చెందిన ఉన్నతాధికారులు జెకెఎల్ ప్రశాంత్ లోఖండె సీతారాం, జాయింట్ సెక్రటరీ పౌశ్యమి బాసు, సిఐసి సెక్రటరీ నిరంజన్‌కుమార్ బన్‌సోద్, బిపిఆర్ అదనపు డిజి రవి జోసెఫ్ లోక్కు, ఎన్‌సిఆర్‌బి జాయింట్ డైరెక్టర్ సంజయ్ మాథూర్, ఎన్ఐసి డిజి శశికాంత్ శర్మ, ఐటి డిఎస్ రాజేంద్ర సింగ్, తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణరావు, డిజిపి డాక్టర్ జితేందర్, అదనపు డిజి మహేష్ భగవత్, ఇంటెలిజెన్స్ చీఫ్ బి.శివధర్‌రెడ్డి, హైదరాబాద్ పోలీసు కమిషనర్ సివి ఆనంద్, సైబర్ సెక్యూరిటీ బ్యూరో డైరెక్టర్ శిఖాగోయల్, డిజాస్టర్ మేనేజ్‌మెంట్ అధికారులు, యాంటి నార్కోటిక్ బ్యూరో డైరెక్టర్ సందీప్ శ్యాండిల్యా, సిఐడి అదనపు డిజి చారు సిన్హా , ఫోరెన్సిక్ చీఫ్ శిఖాగోయల్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు. కేంద్ర, రాష్ట్రాల మధ్య భద్రతా విషయంపై సమావేశంలో చర్చించారు. తెలంగాణ లో నేరాల నియంత్రణ కోసం తీసుకుంటున్న చర్యలను డిజిపి కేంద్ర అధికారులకు వివరించారు. ఫోరెన్సిక్, నార్కోటిక్స్, సైబర్, విభాగాల పనితీరు పై ప్రెజెంటేషన్ల ద్వారా డిజిపి జితేందర్ వివరించారు. గత 6 నెలల్లో జరిగిన ప్రధాన నేరాలపై సమీక్షించారు.

కమ్యూనల్ టెన్షన్, పొలిటికల్ వైరుధ్యం వల్ల ఏర్పడే సమస్యలు, భారీ సభలు, పబ్లిక్ మోమెంట్స్‌కి సంబంధించి భద్రతా ఏర్పాట్లు ఎలా ఉంటున్నాయన్నదిపై చర్చించారు. సైబర్ క్రైమ్, డిజిటల్ మానిటరింగ్, ఆన్‌లైన్ ఫ్రాడ్లు, సోషల్ మీడియాలో ఫేక్ న్యూస్ వ్యాప్తిపై చర్యలు తదితర అంశాలు చర్చకు వచ్చాయి. ఎఐ ఆధారిత సైబర్ ల్యాబ్‌ల అవసరం



ఉందని సమావేశం అభిప్రాయపడింది. సైబర్ సెక్యూరిటీ స్క్వాడ్‌ల కోసం కేంద్ర మద్దతు ఇస్తుందని కేంద్ర అధికారులు హామీ ఇచ్చారు. తెలంగాణ డ్రగ్ స్మగ్లింగ్ హాట్‌స్పాట్‌గా మారుతు న్న పరిస్థితిపై చర్చ సాగింది. ఎన్‌డిపిఎస్ యాక్ట్ అమలులో లోపాలు, ఇంటెలిజెన్స్ సమన్వయం అవసరమని అధికారులు అభిప్రాయపడ్డారు. ఇక డిజాస్టర్ రెస్పాన్స్ ఫైర్ సర్వీసెస్, వరదలు, అగ్ని ప్రమాదాలు వంటి సత్వర స్పందన చర్యలు, జిల్లా స్థాయిలో ఫైర్ సిబ్బంది, వాహనాల అభివృద్ధిపై కేంద్రం సహకారంపై కూడా చర్చించారు. కేసుల పరిష్కార వేగం పెంచేందుకు డిఎన్‌ఎ ల్యాబ్‌లు, మోడరన్ టూల్స్ పెంచుకోవాల్సిన అవసరం ఉందని సమావేశం అభిప్రాయపడింది. జైళ్ల శాఖ అభివృద్ధి, ఓవర్ క్రౌడింగ్, సురక్షిత పర్యావరణం లేకపోవడం వంటి అంశాలు, కేంద్ర సహకారంతో ఆధునిక జైలు నిర్మాణాలపై చర్చించారు.

## ప్రభుత్వ వైద్య కళాశాలలకు తొలిసారి రెగ్యులర్ పరిపాలనాధికారులు

**ప్రజాపక్షం/హైదరాబాద్:**తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత తొలిసారిగా ప్రభుత్వ వైద్య కళాశాలలు, టీచింగ్ హాస్పిటల్స్‌కు రాష్ట్ర ప్రభుత్వం రెగ్యులర్ పద్ధతిలో పరిపాలనాధికారులను నియమించింది. 44 మంది సీనియర్ ప్రొఫెసర్లకు, అడిషనల్ మెడికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్లుగా పదోన్నతి కల్పించింది.

రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ మెడికల్ కాలేజీల ప్రిన్సిపల్స్‌గా, టీచింగ్ హాస్పిటల్స్‌కు సూపరింటెండెంట్స్‌గా నియమించింది. ఈ మేరకు వైద్య ఆరోగ్య శాఖ కార్యదర్శి క్రిస్టియానా జెడ్ చొంగ్తూ ఉత్తర్వులు జారీచేసింది. అసోసియేట్ ప్రొఫెసర్లుగా పనిచేస్తున్న 278 మందికి, ప్రొఫెసర్లుగా పదోన్నతులు కల్పించే ప్రక్రియ చివరిదశకు వచ్చిందని వైద్య ఆరోగ్య శాఖ తెలిపింది. ఎడిఎంఇల పోస్టింగ్ ప్రక్రియ పూర్తయిన నేపథ్యంలో, ప్రొఫెసర్లుగా పదోన్నతి పొందిన వారికి కూడా ప్రభుత్వం త్వరలోనే పోస్టింగులను ఇవ్వనుంది.

పదోన్నతులు కల్పించడంతో అన్ని కాలేజీల్లో ప్రొఫెసర్ల కొరత, డిపార్ట్‌మెంట్ హెచ్ఒడిల సమస్య తీరనున్నదని వైద్య ఆరోగ్య శాఖ వర్గాలు పేర్కొన్నాయి. అసిస్టెంట్ ప్రొఫెసర్లుగా పనిచేస్తున్న సుమారు 231 మంది అసోసియేట్ ప్రొఫెసర్లుగా పదోన్నతులు కల్పించేందుకు ఆరోగ్య శాఖ చర్యలు ప్రారంభించింది.

అసోసియేట్ ప్రొఫెసర్, ప్రొఫెసర్, అడిషనల్ డిఎంఇ వంటి పోస్టులను నేరుగా రిక్రూట్ చేసుకునే అవకాశం లేకపోవడంతో, పదోన్నతుల ద్వారా ఈ పోస్టులను భర్తీ చేయనున్నారు.

607 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులను నేరుగా భర్తీ చేసేందుకు మెడికల్ అండ్ హెల్త్ సర్వీసెస్ రిక్రూట్‌మెంట్ బోర్డు ఇటీవలే నోటిఫికేషన్ జారీ చేసింది. అలాగే మరో 714 పోస్టుల భర్తీకి ఆర్థిక శాఖ ఆమోదం తెలిపింది. ఈ పోస్టులు కూడా త్వరలోనే భర్తీ చేయనున్నారు.

## జలపాతాలు, చెరువుల వద్ద 'వెడ్డింగ్ డెస్టినేషన్'

- మూడు ప్రాంతాలను గుర్తించిన పర్యాటక శాఖ
- త్వరలోనే కేంద్రానికి డిపిఆర్‌లు

(బి. వాసుదేవరాజు)



రాష్ట్రంలోని జలపాతాలు, డ్యామ్‌లు, చెరువుల పరిసర ప్రాంతాలు ఇక నుంచి వివాహ వేడుకలు, ఇతర శుభ కార్యక్రమాలకు వేదిక లు కానున్నాయి. జలపాతాలు, డ్యామ్‌లను, చెరువులను అందంగా, ఆహ్లాదకరంగా తీర్చిదిద్దడమే కాకుండా ప్రైవేటు, కార్పొరేట్ సంస్థలకు దీటుగా 'వెడ్డింగ్ డెస్టినేషన్' విధానాన్ని ప్రవేశపెట్టేందుకు రాష్ట్ర పర్యాటక శాఖ సన్నద్ధమవుతోంది. మధ్యతరగతి కుటుంబాలకు 'వెడ్డింగ్‌డెస్టినేషన్'ను అందుబాటులోకి తీసుకురావడంతో పాటు పర్యాటక శాఖకు ఆదాయాన్ని సమకూర్చేందుకు పర్యాటక శాఖ ప్రణాళికలు రూపొందిస్తోంది. ఇందుకు రాష్ట్రంలోని మూడు వేర్వేరు ప్రాంతాలను గుర్తించింది. ఇందులో యాదగిరిగుట్టలోని బస్వాపూర్ చెరువు, కొల్లాపూర్‌లోని నార్లాపూర్, నాగార్జునసాగర్ డ్యామ్‌ను వెడ్డింగ్ డెస్టినేషన్‌లకు వేదికగా చేయాలని ప్రభుత్వం సూత్రప్రాయంగా నిర్ణయించింది. ఈ మూడు ప్రాంతాలను ఎలా అభివృద్ధి చేయాలి? వివాహ వేడుకలకు కావాల్సిన మౌలిక సదుపాయాలు, ముఖ్యంగా వీడియో, ఫోటోలు అందంగా వచ్చేలా ప్రదేశాల అలంకరణ, ఒక వేడుక నిర్వహించేందుకు పెద్ద, చిన్న హాల్స్, కొన్ని గదులు, సిట్టింగ్ ఏర్పాట్లు ఇలా వివాహానికి సంబంధించి అన్ని సదుపాయాలు ఉండేలా ప్రయత్నిస్తున్నారు. దీనికి సంబంధించి ఇప్పటికే డిటెయిల్డ్ ప్రాజెక్ట్ రిపోర్ట్ (డిపిఆర్)ను రూపొందించినట్టు సమాచారం. డిపిఆర్‌ను ఖరారు చేసిన తర్వాత కేంద్ర ప్రభుత్వానికి పంపించి తద్వారా ఈ ప్రాజెక్ట్‌కు అవసరమైన నిధులను కేంద్ర ప్రభుత్వం నుంచి సమీకరించాలని ప్రభుత్వం భావిస్తోంది. కేంద్ర ప్రభుత్వం నుంచి ఆమోదంరాగానే పనులను చేపట్టేందుకు పర్యాటక శాఖ సిద్ధమైంది. ఈ ప్రాజెక్టు అందుబాటులోకి వస్తే 'వెడ్డింగ్ డెస్టినేషన్' ద్వారా అదనపు ఆదాయం సమకూర్చుకోవాలని పర్యాటక శాఖ భావిస్తుంది.

**'వెడ్డింగ్ డెస్టినేషన్'కు ఆదరణ**

ప్రస్తుతం వెడ్డింగ్ డెస్టినేషన్‌కు సుదూర ప్రాంతాలలో పర్యాటక ప్రాంతాలకు అత్యధిక ఆదరణ ఉన్నది. మధ్యతరగతి ప్రజలు కూడా వెడ్డింగ్ డెస్టినేషన్‌కు అత్యంత ప్రాముఖ్యతను ఇస్తున్నారు. దీంతో వెడ్డింగ్ ఈవెంట్ ఆర్గనైజ ర్లు లక్షల్లో చార్జీలను వసూలు చేస్తున్నారు. హైదరాబాద్‌తో పాటు పలు నగరాలకు దూరంగా కనీసం ఒక ఎకరం, అంతకంటే ఎక్కువగా ఉన్న భూములలో వివాహ వేడుకలకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇందులో ఒక స్విమ్మింగ్, వెడ్డింగ్ మినీ, పెద్ద హాల్స్, ఎసి గదులు, అందులో ఎల్ఇడి తెరలు, ఎల్ఇడిల ను ఏర్పాటు చేస్తున్నారు. ముఖ్యంగా ఫోటో లు తీసేందుకు వీలుగా పరిసరాలను అందంగా అలంకరించడం, గార్డెన్స్, ఫౌంటేన్స్, పిల్లలు ఆడుకునేందు కు వీలుగా సదుపాయాలను అందుబాటులో ఏర్పాటు చేస్తున్నారు. ఇందుకు వివిధ వెడ్డింగ్ ఈవెంట్ మేనేజర్లు వేడుకలకు హాజరయ్యే సభ్యుల సంఖ్య ఆధారంగా ప్యాకేజీలను డిజైన్ చేస్తున్నారు. ఈ నేపథ్యంలో 'వెడ్డింగ్ డెస్టినేషన్' విధానాన్ని పర్యాటక శాఖ కూడా అమలు చేయాలని నిర్ణయించింది. ఇందుకు జలపాతాలను, చెరువులను, డ్యామ్‌లను 'డెస్టినేషన్ వెడ్డింగ్' గా అభివృద్ధి చేసేందుకు చర్యలు చేపట్టింది.

**40 శాతం తక్కువ ధర: టిజిటిడిసి వల్లూరి క్రాంతి**

పర్యాటక రంగాన్ని మరింత అభివృద్ధి చెసేందుకు వెడ్డింగ్ డెస్టినేషన్ ఒక మైలు రాయి. వెడ్డింగ్ డెస్టినేషన్ అన్ని వర్గాలకు అందుబాటులో ఉండే విధంగా ఫీజులు ఉంటాయి. ప్రైయివేట్ నిర్వాహకులు వసూలు చేసే ఫీజు ల కంటే టిజిటిడిసి ఆధ్వర్యంలో నిర్వహించే వెడ్డింగ్ డెస్టినేషన్ బుక్ చేసుకునే వినియోగదారులకు సుమార్ 40 శాతం ఫీజు తగ్గుతుంది.

వెడ్డింగ్ డెస్టినేషన్‌లో కార్యక్రమం నిర్వహించుకోటానికి మూడు రోజుల పూర్తి సమయం ఇస్తారు. కేంద్ర ప్రభుత్వం గనుక వెడ్డింగ్ డెస్టినేషన్‌కు పూర్తి నిధులు సమకూర్చకపోతే తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం, ప్రైయివేటు భాగస్వామ్యంతో నిర్మించేందుకు ప్రత్నాయ ఏర్పాట్లపై కూడా కసరత్తు జరుగుతుంది.

## చేనేత పురస్కార గ్రహీతలకు మంత్రి తుమ్మల అభినందనలు

**ప్రజాపక్షం/హైదరాబాద్:**జాతీయ చేనేత పురస్కారం–2024కి ఎంపికైన చేనేత కార్మికులకు వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అభినందనలు తెలిపారు. దేశ వ్యాప్తంగా 19మంది చేనేత కార్మికులు ఎంపిక కాగా, అందులో తెలంగాణ నుంచి ఇద్దరికి ఈ పురస్కారాలు దక్కడం గర్వకారణమన్నారు. యాదాద్రి–భువనగిరి జిల్లా, సంస్థాన్ నారాయణపురం మండలం, పుట్టపాక గ్రామానికి చెందిన గజం నర్మదకు చేనేత వస్త్రాల మార్కెటింగ్ విభాగంలో రూ.8కోట్ల టర్నోవర్ చేయడానికిగాను, సహజ సిద్ద రంగులను ఉపయోగించి జీఐ ట్యాగ్ పొందిన తేలియా రుమాల్ డిజైన్‌తో పట్టుచీరను నేసిన గూడ పవన్‌కు జాతీయ చేనేత అవార్డుకు ఎంపికై చేనేతరంగంలో ఆదర్శంగా నిలిచారని అభినందించారు..


**సర్టిఫికెట్లు పోయినవి**

నేను, **తమ్మిశెట్టి సులోచన,** D/o. **తమ్మిశెట్టి వెంకటయ్య,** R/o. ప్లాట్ నెం. 642, బి.ఎన్.రెడ్డి నగర్, చర్లపల్లి, మేడ్చల్ జిల్లా. నా యొక్క **ఆంధ్రప్రదేశ్ ఫార్మసీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (పిసిఐ)** ఒరిజినల్ సర్టిఫికెట్లు నెం. 111430/A1, హెచ్‌సిఎల్ చౌరస్తా నుండి చర్లపల్లికి బస్సులో ప్రయాణం చేస్తుండగా పోయినవి. ఎవరికైనా దొరికిచో సెల్ నెం. **9182850224** ను సంప్రదించగలరు.

ఇట్లు
**తమ్మిశెట్టి సులోచన**
**తండ్రి తమిశెట్టి వెంకటయ్య,**
బిఎన్‌రెడ్డి నగర్, చర్లపల్లి.

**గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్**
ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కార్యాలయం, డివిజన్ నెం.14, జిహెచ్ఎంసి, 5వ అంతస్తు, అబిడ్స్ పార్కింగ్ కాంప్లెక్స్, హైదరాబాద్.

RFQ. No. 08/EE/C14/GHMC/KZ/2025-26 ప్రకటన తేది: 07.07.2025

**''జిహెచ్ఎంసి, సర్కిల్-14, 51-గోషామహల్ వార్డులోని మహారాణాప్రతాప్ కమ్యూనిటీ హాల్‌లో స్పోర్ట్స్ కాంప్లెక్స్ (G+1) నిర్మాణం కోసం సర్వే దర్యాప్తు కోసం కన్సల్టెన్సీ సర్వీసెస్ వివరణాత్మక ప్రాజెక్ట్ నివేదిక తయారీ (G+1 అంతస్తుల డిజైన్ నిర్మాణం)''** కోసం కొటేషన్ల కోసం అభ్యర్థన. **టెండర్ ప్రకటన / బిడ్ పిలుపు తేది:** 08.07.2025న మ.03.00గం.లకు, **బిడ్ దాఖలుకు గడువు తేది మరియు సమయం:** 11.07.2025న మ.03.00గం.ల వరకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ పోర్టల్‌లో (tender.telangana.gov.in), **ప్రీ క్వాలిఫికేషన్ □సాంకేతిక బిడ్ల ప్రారంభం:** 11.07.2025న మ.03.30గం.లకు, కాబట్టి అర్హత కలిగిన ఏజెన్సీలు పైన పేర్కొన్న కాలంలో అవసరమైన అన్ని వివరాలతో తమ బిడ్లను సమర్పించవచ్చు.

సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, సర్కిల్-14, జిహెచ్ఎంసి.

DIPR R.O. No. : 4732-PP/CL/ADVT/1/2025-26, Date: 08-07-2025

దేవాదాయ ధర్మాదాయ శాఖ
**శ్రీ వేంకటేశ్వరస్వామి దేవస్థానము**
మార్కెట్ రోడ్, కరీంనగర్ పట్టణము.

ప్రకటన తేది: 02.07.2025

ఇందు మూలముగా సమస్త ప్రజలకు తెలియజేయునది ఏమనగా, దేవాదాయశాఖ శ్రీ వేంకటేశ్వర స్వామి దేవస్థానము, మార్కెట్ రోడ్, కరీంనగర్ పట్టణము యందు **తేది: 01-08-2025 నుండి 31-07-2028 వరకు** అనగా (3) సం॥రాల కాలంపాటు కళ్యాణ మండపము హాలు పొడవు 55 ఫీట్లు, వెడల్పు 40 ఫీట్లు వెడల్పు గల హాలు నెలసరి కిరాయి క్రింద కిరాయికి ఇచ్చుటకు గాను సీల్డ్ టెండర్-కం బహిరంగ వేలము **తేది: 10-07-2025 రోజున ఉదయం 11:00 గం॥లకు** సదరు ఆలయ కార్యాలయము నందు నిర్వహించబడును. ఇట్టి వేలములో పాల్గొనువారు **రూ. 200/-లు** చెల్లించి షెడ్యూలు టెండర్ ఫారం **ఖరీదు చేసి రూ. 1,00,000/- లు** ధరావత్తు చెల్లించవలెను. సీల్డు టెండర్ వేసిన వారు మాత్రమే పాటకు అర్హులు. వేలం పాటకు (3) రోజుల ముందు నుండి టేండర్ ఫారములు ఆలయ కార్యాలయము నందు విక్రయించబడును. వేలం పాట షరతులు ఇతర వివరములకు ఆలయ కార్యాలయము నందు సంప్రదించగలరు.

DIPR R.O. No. : 4735-PP/CL/ADVT/1/2025-26, Date: 08-07-2025 సం/- కార్యనిర్వహణాధికారి

ప్రజాపక్షం
బుధవారం, 09 జులై

## వాణిజ్య చర్చలపై ఎందుకీ గోప్యత?

భారత్‌తో వాణిజ్య ఒప్పందం త్వరలో జరుగుతుందని అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ఇప్పటికే పలుమార్లు చెప్పారు. అమెరికా వాణిజ్య శాఖాధికారులు ఢిల్లీ వచ్చి చర్చలు జరిపి వెళ్లారు. మన అధికారుల బృందం పక్షం రోజుల క్రితం వాషింగ్టన్ వెళ్ళింది. వాణిజ్య మంత్రి పీయూష్ గోయల్ గతవారం అమెరికా వెళ్లి చర్చల్లో పాల్గొన్నారు. వాణిజ్య ఒప్పందాలపై ప్రపంచ దేశాలకు ట్రంప్ పెట్టిన గడువు మరో రోజులో ముగుస్తుండగా తాజాగా నెలాఖరు వరకు పొడిగించారు. ఒప్పందానికై చర్చలకు రాని ఓ డజను దేశాలకు ట్రంప్ నోటీసులు కూడా పంపుతున్నారు.

తమ దిగుమతులపై సుంకాల విధింపును ఏకపక్షంగా భారీగా పెంచుతూ, (రెసిప్రోకల్ టారిఫ్‌లు వాటి పేరు) మళ్లీ కొంత తగ్గిస్తూ, ఒప్పందాలకు గడువు ప్రకటిస్తూ, అప్పటివరకు పెంచిన సుంకాల అమలును నిలుపుదల చేస్తూ ట్రంప్ ఇతర దేశాలను బెదిరించి లొంగదీసుకునే నీచపు ఎత్తుగడలతో, ప్రపంచ వాణిజ్య సంస్థ ఒప్పందాలకు విరుద్ధమైన వ్యవహార శైలితో అంతర్జాతీయ వాణిజ్యాన్ని అనిశ్చితిలో, గందరగోళంలో పడేశాడు. ఒకవైపు సుంకాల పెంపుదల, రెండోవైపున అక్రమ వలస దారులను వెనక్కు పంపడాన్ని ఆయుధాలుగా ఉపయోగించి ఏ కెనడా, మెక్సికోలను దాసోహం చేసుకోవాలనుకున్నాడో అది సాధ్యం కాలేదు. అవి ఎదురు తిరిగాయి. ముందుగా బ్రిటన్, ఆ తర్వాత యూరప్ దేశాలు ఒప్పందాలకు వచ్చాయి. కొరకరాని కొయ్యగా తయారైన చైనాపై భారీగా పెంచిన సుంకాలను గణనీయంగా తగ్గించి ట్రంప్ ఒప్పందం చేసుకున్నాడు.

అయితే అధ్యక్షుడు ట్రంప్‌ను తన మంచి మిత్రునిగా మన ప్రధాని నరేంద్ర మోదీ చెప్పుకుంటున్నప్పటికీ, ట్రంప్‌ది మాత్రం ఎక్కడైనా బావేగాని వంగతోట వద్ద మాత్రం కాదనే వైఖరే. ఉక్కు, అల్యూమినియం దిగుమతులపై అమెరికా పెంచిన 25 శాతం సుంకాలు కొనసాగుతుండగా, ఇతర అనేక రంగాలతో పాటు ప్రధానంగా భారత వ్యవసాయ మార్కెట్‌ను కొల్లగొట్టేందుకు ట్రంప్ ఒత్తిడి చేస్తున్నట్లు అభిజ్ఞ వర్గాల భోగట్టా. జన్యు మార్పిడి పంటలకు భారత్ మార్కెట్‌ను తెరవాలన్న అమెరికా డిమాండ్‌కు మన దేశం గట్టిగా 'నో' చెప్పిందట. వ్యవసాయ రంగంతో పాటు దానికి అనుబంధమైన పాడి ఉత్పత్తుల మార్కెట్‌లో స్థానాన్ని అమెరికా కోరుతున్నది. వీటిని అనుమతిస్తే గ్రామీణ భారతం అల్లకల్లోలమవుతుంది. వాణిజ్య ఒప్పందం దగ్గరలో ఉందని ట్రంప్ పదేపదే అంటున్నాడంటే భారత్ తలొగ్గిందా? ఏమో. ట్రంప్‌ని కాదనే ధైర్యం ఉండాలి కదా? చిత్రమేమంటే, ఏ సమాచారమైన అమెరికా వైపు నుంచే వస్తున్నది గాని మోదీ ప్రభుత్వం నోరు మెదపటం లేదు. ఏమిటీ గోప్యం, ఎందుకీ మౌనం?

మేము యునైటెడ్ కింగ్‌డంతో ఒప్పందం చేసుకున్నాం, చైనాతో ఒప్పందం చేసుకున్నాం, భారత్‌తో ఒప్పందానికి దగ్గరలో ఉన్నాం అని ట్రంప్ వైట్‌హౌస్‌లో నిన్న మళ్లీ ప్రకటించాడు. ఆగస్టు 1 నుంచి హెచ్చు సుంకాలు విధించే దేశాల్లో బంగ్లాదేశ్, థాయిలాండ్, దక్షిణ కొరియా, జపాన్ ఉన్నాయి. ఈలోపు వాణిజ్య ఒప్పందాలకు రాకపోతే నెత్తిమీద మొట్టికాయ వేస్తాడన్నమాట!

ఇదిలా ఉండగా, బ్రిక్స్ మీద తాజాగా విరుచుకుపడ్డాడు ట్రంప్. బ్రిక్స్ అమెరికా వ్యతిరేక విధానాలు అనుసరిస్తున్నదని, దానితో చేరే దేశాలపై 10 శాతం అదనపు సుంకాలు విధిస్తామని ప్రకటించాడు. బ్రెజిల్, భారత్, రష్యా, చైనా, దక్షిణాఫ్రికాలు వ్యవస్థాపక సభ్యులుగా ఉన్న బ్రిక్స్‌లో మరో 10 దేశాలు చేరాయి. పేద దేశాల పక్షాన ప్రత్యామ్నాయ ఆర్థిక పురోగతికి అవి కృషి చేస్తున్నాయి. అమెరికాకు, డాలర్‌కు వ్యతిరేకమైన ఏ చర్యనూ సహించేటట్లు లేదు. కాబట్టి వర్తమాన ప్రపంచం అప్రమత్తం కావాలి. భారత్ ప్రభుత్వం కూడా రెండు పడవలపై కాళ్లు కాకుండా వర్ధమాన ప్రపంచం పట్ల దృఢమైన వైఖరి తీసుకోవాలి.

# జాతీయ ఎమర్జెన్సీ నేపథ్యం, పర్యవసానాలు



ఎస్.బాబు
(టిజిఎస్‌ఆర్టీసి ఎంప్లాయీస్ యూనియన్ అధ్యక్షులు)

భారత దేశంలో ఎమర్జెన్సీకి 50 ఏళ్ళు అని మీడియాలో కథనాలు, బిజెపి పార్టీ ఎమర్జెన్సీపై విమర్శలు చూసిన తరువాత నేను కొంతమంది కాలేజీ స్టూడెంట్స్, ఉద్యోగులు, మిత్రులు మరియు సీనియర్, సూపర్ సీనియర్ సిటిజన్స్‌తో ఇంటరాక్ట్ అయి 1975లో జాతీయ ఎమర్జెన్సీ ఎందుకు విధించారని అడిగితే చాలామంది వద్ద సమాధానం లేదు. కాని ఎమర్జెన్సీలో ఏం జరిగిందనే విషయాలు సీనియర్, సూపర్ సీనియర్ సిటిజన్స్ మాత్రమే చెప్పగలిగారు. అందుకే ఈ ఆర్టికల్ వ్రాయాలని అనిపించింది. అంత మాత్రం చేత నేనేం కాంగ్రెస్ అభిమానిని కాను. భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 352 ఉపయోగించి దేశంలో అంతర్గత ఎమర్జెన్సీ ఏ పరిస్థితిలో విధిస్తారు అంటే 1.యుద్ధం 2.బాహ్య తిరుగుబాటు 3.అంతర్గత తిరుగుబాటు. ఈ కారణాల వల్ల జాతీయ ఎమర్జెన్సీ విధిస్తారు. 1962లో చైనాతో యుద్ధం కారణంగా దేశంలో మొట్టమొదటిసారి రాష్ట్రపతి డా.సర్వేపల్లి రాధాకృష్ణన్ ఎమర్జెన్సీ 26 అక్టోబర్ 1962లో విధించి 10 జనవరి 1968 వరకు కొనసాగిన విషయం చాలా మందికి తెలియకపోవచ్చు. పాకిస్తాన్‌తో బాహ్య తిరుగుబాటు కారణంగా 1971లో జరిగిన యుద్ధం వలన ఆనాటి రాష్ట్రపతి వి.వి.గిరి దేశంలో రెండో ఎమర్జెన్సీ విధించారు. కాని ఈ రెండు ఎమర్జెన్సీల ప్రభావం ఆనాడు ప్రజల మీద పడలేదు. మూడవసారి ఎమర్జెన్సీ 25 జూన్ 1975న దేశంలో అంతర్గత తిరుగుబాటు కారణంగా ప్రధాని శ్రీమతి ఇందిరా గాంధీ ఇచ్చిన లేఖతో నాటి భారత రాష్ట్రపతి ఫకృద్దీన్ అలీ అహ్మద్ దేశంలో ఎమర్జెన్సీ విధించారు. ఆ మచ్చ నేటికీ కాంగ్రెస్ పార్టీని వెంటాడుతూనే ఉంది. ఈ ఎమర్జెన్సీ గురించి కూడా దేశంలో మూడొంతుల మందికి తెలియదు. అసలు ఎమర్జెన్సీ విధించటానికి దారి తీసిన పరిస్థితులు ఏమిటో సూక్ష్మంగా చూద్దాం.

1962, 1965లో చైనా మరియు పాకిస్తాన్‌తో యుద్ధాలు జరిగిన తరువాత భారతదేశ ఆర్థిక పరిస్థితి ఆందోళనకరంగా మారిం ది. అందు వలన ఆర్థిక పరిస్థితిని చక్కబెట్టాలనే ఉద్దేశం మరియు రైతులకు వ్యవసాయ లోన్లు కల్పించాలనే సంకల్పంతో ప్రధాని ఇందిరా గాంధీ 1969లో బ్యాంకుల జాతీయీకరణకి శ్రీకారం చుట్టి ఆర్డినెన్స్ తీసుకొచ్చారు. ఈ ఆర్డినెన్స్‌ని సుప్రీంకోర్టు కొట్టివేసింది. అందువలన 1969 బ్యాంకుల జాతీయీకరణ చట్టాన్ని చేసి అమలు చేశారు. టాటా, బిర్లాల డబ్బంతా ప్రైవేట్ బ్యాంకులలో ఉండటం వలన ఆ బ్యాంకులని జాతీయం చేయడంతో వారు ఇందిరా గాంధీని వ్యతిరేకించారు. ఆర్థిక మంత్రి మొరార్జీ దేశాయ్ కూడా బ్యాంకుల జాతీయీకరణను వ్యతిరేకించారు. అందువలన ఆ ఆర్థిక శాఖను ఇందిరా గాంధీ తీసుకోవడంతో మొరార్జీ దేశాయ్ ఆ పదవికి రాజీనామా చేసి ఒక సిండికేటును ఏర్పాటు చేసుకున్నారు. ఆ విధంగా కాంగ్రెస్ పార్టీలో అసమ్మతి పురుడు పోసుకుంది.

భారతదేశ స్వతంత్రానంతరం 550 స్వదేశీ సంస్థానాలు యూనియన్‌లో విలీనం అయ్యాయి. ఈ విలీనం సందర్భంగా ఆ సంస్థాలకు చెందిన రాజవంశాల వారికి ప్రభుత్వం ప్రతినెల కొంత మొత్తాలలో రాజభరణం అందించేది. అటువంటి రాజభరణాలను 26వ రాజ్యాంగ సవరణ ద్వారా శ్రీమతి ఇందిరాగాంధీ 1970లో రద్దు చేస్తూ ఆర్డినెన్స్ జారీ చేసింది. ఈ రాజభరణాల రద్దును కూడా సుప్రీంకోర్టు వ్యతిరేకించింది. ఈ కారణంగా ఆ సంస్థానాధీశులు ఇందిరాగాంధీపై గుర్రుగా ఉండేవారు. ఒకప్రక్కన పారిశ్రామికవేత్తలు, మరోపక్కన సంస్థానాధీశులు, ఇంకోప్రక్కన పార్టీలో అసమ్మతి, జ్యుడిషియరీ చీకటి బోనులో సింహం లాగా ఆమెను కబళించటానికి సిద్ధంగా ఉన్నారు. ఈ సమయంలో 1971లో పాకిస్తాన్‌తో యుద్ధం జరిగి బంగ్లాదేశ్ అనే కొత్త దేశం ఏర్పడింది. ఈ యుద్ధం అనంతరం ఆర్థిక వ్యవస్థపై బాగా ఒత్తిడి పెరిగింది. అంతర్గతంగా విద్యార్థులు, కార్మికులు, ప్రతిపక్ష నాయకులు సమస్యలపై పోరుబాట పట్టారు. రాజకీయ నాయకుల మాటల ఖజానా నుంచి ఆమెపై విమర్శనాస్త్రాలు క్షిపణుల్లా దూసుకొచ్చాయి. జార్జి ఫెర్నాండెజ్ కార్మిక శ్రేణుల ప్రళయ ఘోషను వినిపిస్తూ వచ్చా రు. ఆమెను సమస్యల సుడిగుండంలో నెట్టి ప్రత్యర్థులు అష్ట దిగ్బంధనం చేశారు. రాజకీయ సంక్షోభంతో పాటు అంతర్గత తిరుగుబాటుల కారణంగా ఆమెపై వ్యతిరేకత అగ్నికెరటాలై ఉవ్వెత్తున ఎగిసిపడ్డాయి. ఈ తిరుగుబాటు కెరటాలు సునామీలా చుట్టుముట్టాయి. స్వాతంత్ర్య సమరయోధులు, మహాత్మా గాంధీ సమకాలీనులు అయిన జయప్రకాష్ నారాయణ్ ప్రజల సమస్యలను 'సంపూర్ణ విప్లవం' పేరుతో బిహార్‌లో ఉద్యమం తీవ్రతరం చేశారు. మరోపక్క గుజరాత్ రాష్ట్రంలో ఇంజనీరింగ్ విద్యార్థులు మెస్ ఛార్జీలు పెంచాలని ఉద్యమించారు. మామూలుగా సాగుతున్న ఈ పోరాటం జయప్రకాష్ నారాయణ్ జోక్యంతో తీవ్రరూపం దాల్చింది. గత్యంతరం లేని పరిస్థితుల్లో కేంద్రం గుజరాత్, బిహార్ రాష్ట్రాల్లో ప్రభుత్వాలను రద్దు చేసి రాష్ట్రపతి పాలన విధించింది. మరోపక్క కార్మిక నాయకులు జార్జి ఫెర్నాండెజ్ కార్మిక ఉద్యమాలను తారాస్థాయికి తీసుకెళ్ళారు. జయప్రకాష్ నారాయణ్ సంపూర్ణ విప్లవం పేరిట "పార్లమెంట్‌కు జనతా మార్చ్" పిలుపుతో కాంగ్రె స్ ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టారు. ఆయనిచ్చిన పిలుపు కారణంగా ఇందిరాగాంధీ ఉక్కిరి బిక్కిరి అయిం ది. ఈ సమయంలోనే రైల్వే మంత్రి లలిత్ నారాయణ్ మిశ్రా బాంబు దాడిలో హత్య చేయబడడంతో శాంతి భద్రతల సమస్య ఏర్పడింది. గుజరాత్‌లో విద్యార్థుల ఉద్యమం తరువాత 1974లో జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి మెజార్టీ రాకపోవడంతో ఆమె తీవ్రమైన మనస్తాపానికి గురైంది.



దేశ పరిస్థితులు ఇలా ఉన్న సమయంలో పార్లమెంట్ ఎన్నికల్లో రాయ్‌బరేలీ నియోజకవర్గంలో తన ప్రత్యర్థి అయిన రాజ్ నారాయణ్ ఇందిరాగాంధీ ఎన్నిక చెల్లదంటూ 14 ఎలిగేషన్స్‌తో అలహాబాద్ హైకోర్టులో కేస్ వేశారు. ఆ కేసులో 12 ఎలిగేషన్స్‌ను కొట్టివేస్తూ కేవలం 2 ఎలిగేషన్స్ 1.ప్రభుత్వ అధికారి అయిన యశ్‌పాల్ కపూర్ ఉద్యోగానికి రాజీనామా చేసినా అది ఆమోదింపబడకముందే ఆయన ఇందిరాగాంధీ తరఫున ఎన్నికల్లో పాల్గొనడం. 2.ఇందిరాగాంధీ రాయ్ బరేలీ వేదికపై ప్రసంగించిన సందర్భంగా ఆ వేదికకు అయిన ఖర్చు మరియు విద్యుత్తు ఛార్జీలు ఉత్తర్‌ప్రదేశ్ గవర్నమెంట్ చెల్లించడంపై తీర్పునిస్తూ ఆమె ఎన్నిక చెల్లదని, 6 సంవత్సరాల పాటు ఎన్నికలలో పాల్గొనకూడదని తీర్పునిచ్చింది. దీనిపై ఇందిరాగాంధీ సుప్రీంకోర్టులో రిట్ అప్పీల్ వేశారు. ఈ రిట్ అప్పీల్ స్వీకరించిన సుప్రీంకోర్టు అలహాబాద్ హైకోర్టిచ్చిన ఉత్తర్వులను సమర్థిస్తూనే ఆమె ప్రధానమంత్రిగా కొనసాగవచ్చునని మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. ఈ తీర్పు రాగానే ఇందిరాగాంధీ ప్రధానమంత్రి పదవికి రాజీనామా చేయాలని జయప్రకాష్ నారాయణ్, మొరార్జీ దేశాయ్‌తో పాటు మితవాద ప్రతిపక్ష నాయకులందరూ పట్టు పట్టారు. ఇప్పటినుండి ఇందిరాగాంధీని బయటకు లాగుదాం. రాజీనామా చేసేంతవరకు ఇంటినుండి ఆమెని బయటికి రానివ్వం. గృహనిర్బంధం చేస్తాం. సుప్రీంకోర్టిచ్చిన తీర్పును లెక్క చెయ్యం. ఆమె రాజీనామా చేయాల్సిందే అని జయప్రకాష్ నారాయణ్, మొరార్జీ దేశాయ్, జార్జి ఫెర్నాండెజ్, రామ్ నారాయణ్‌తో పాటు జనసంఘ్ పార్టీ కలిసి ఆమెను కార్నర్ చేశారు.

సమస్యలన్నీ చుట్టుముట్టడంతో 25–06–1975న రాష్ట్రపతికి నేషనల్ ఎమర్జెన్సీ ప్రకటించాలని ఆమె లేఖ వ్రాశారు. ఆ ప్రకారంగా రాష్ట్రపతి ఫకృద్దీన్ అలీ అహ్మద్ 25 జూన్ అర్థరాత్రి నుండి నేషనల్ ఎమర్జెన్సీ ప్రకటించారు. దాంతో దేశంలో 21 నెలల పాటు రాష్ట్రపతి పాలన అనంతరం ఇందిరా గాంధీయే ఎమర్జెన్సీ ఎత్తివేసి ఎన్నికలకు ఉత్తర్వు చేశారు. తరువాత జరిగిన పార్లమెంట్ ఎన్నికలలో ఏకపార్టీ పాలనకు తెర పడిం ది. కాంగ్రెస్ పార్టీకి 154 స్థానాలు కాంగ్రెస్(బ) స్వతంత్ర పార్టీ సోషలిస్టు పార్టీ, జన సంఘ్‌లతో ఏర్పడిన జనతా పార్టీకి 295 స్థానా లు వచ్చాయి. కొత్తతరం నాయకులతో జనతాపార్టీ నుండి మొరార్జీ దేశాయ్ ప్రధానమంత్రిగా పదవి చేపట్టారు. ఉత్తర భారత దేశంలో ఎమర్జెన్సీ అత్యాచారాల కారణంగా కాంగ్రెస్ పార్టీ కి వీచిన వ్యతిరేక పవనాలు దక్షిణ భారత దేశంలో లేవు. అంటే ఆ చీకటి రాత్రులు ఇక్కడ లేవా? ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 42 ఎంపి స్థానాలకు 41 స్థానాలు కాంగ్రెస్ గెలిచింది. తమిళనాడు, కేరళ రాష్ట్రాలలో ఎమ ర్జెన్సీ ప్రభావం ఏమైనట్లు? జనతా పార్టీ ప్రభుత్వం అంతర్గత వైరుధ్యాలతో రెండేళ్లలో కూలిపోయింది.

1980లో మధ్యంతర ఎన్నికల్లో దేశ ప్రజలు ఇందిరాగాంధీకి మళ్లీ పట్టం కట్టారు. దేశంలో ఎమర్జెన్సీని ఓ బ్లాక్ డేగా ప్రస్తుతం బిజెపి వారు చూపుతున్నా, ఆనాడు కాం గ్రెస్‌కు 34.5 శాతం ఓట్లు వచ్చాయి. 2024లో జరిగిన పార్లమెంట్ ఎన్నికలలో భారతీయ జనతాపార్టీకి 36.6 శాతం ఓట్లు వచ్చాయి. ఆ విధం గా చూస్తే బిజెపిది కూడా చీకటి పాలనే అనడంలో ఎటువంటి సందేహం లేదు. అందుకేనేమో దేశంలో ప్రస్తుతం బిజెపి పాలనలో అప్రకటిత ఎమర్జెన్సీ నడుస్తోంది అని అంటున్నారు. ఎందుకంటే ఆనాటి ఎమర్జెన్సీ పరిస్థితులకు, దేశంలో ప్రస్తుతం జరుగుతున్న పరిస్థితులకు పెద్ద తేడా ఏమీ లేదు.

# ఉద్యోగ అనుబంధ ప్రోత్సాహక పథకం

భారతదేశ ఆర్థిక ప్రయాణం వేగంగా విస్తరిస్తున్నది. ప్రపంచవ్యాప్తంగా ప్రాధాన్యత పెరుగుతున్నది, ఆర్థిక సంస్కరణలు ఊపందుకున్నవీ నిశ్చయమే. కానీ ఈ అభివృద్ధి కథనాన్ని నిలబెట్టే ఒక ప్రధాన ప్రశ్న ఇంకా ఎదురుగానే ఉంది. దేశంలో ఉద్యోగాలు ఎక్కడ? మరియు అవి ఎంత స్థిరమైనవి? కేంద్ర ప్రభుత్వం ఇటీవల ఆమోదించిన ఉద్యోగ అనుబంధ ప్రోత్సాహక పథకం ఈ ప్రశ్నకు సమాధానంగా కొత్త మార్గాన్ని సూచిస్తుంది. జూలై 1, 2025న కేంద్ర కేబినెట్ ఆమోదించిన ఈ పథకం, ఆగస్టు 1, 2025 నుంచి ప్రారంభమవుతుంది.
ఈ పథకం ప్రధానంగా రెండు సంవత్సరాల్లోగా 3.5 కోట్ల కొత్త ఉద్యోగాలు సృష్టించాలని లక్ష్యంగా పెట్టుకున్నది. మొత్తం ఖర్చు రూ.99,446 కోట్లు. గతంలో ఉన్న ఉపాధి పథకాల వలె కేవలం జీతాల సహాయానికి మాత్రమే కాకుండా, దీని గమ్యం దీర్ఘకాలిక ఉపాధిని కల్పించడం, ఉద్యోగాల అధికారీకరణను ప్రోత్సహించడం, ఉద్యోగులతో పాటు సంస్థలకూ ప్రత్యక్ష ప్రయోజనాలు కల్పించడం. ఉద్యోగాల కల్పన మాత్రమే కాదు, ఈపీఎఫ్ఓ సంస్థలతో అనుసంధానించడంవల్ల ఈ ఉద్యోగాలకు సామాజిక భద్రతా పదును కూడా ఏర్పడుతుంది.

ఈ పథకం రెండు భాగాలుగా నిర్మితమైంది. మొదటిది భాగం ఎ–మొట్టమొదటి ఉద్యోగాన్ని సంపాదించే యువతకు ప్రత్యక్షంగా ప్రయోజనం కలిగిస్తుంది. నెలకు ఒక లక్ష రూపాయల లోపు జీతం పొందే వారు అర్హులు. ఆరు నెలల నిరంతర సేవ చేసిన తర్వాత ఒక నెల ఈపీఎఫ్ జీతానికి సమానంగా (గరిష్టంగా రూ. 15,000) ప్రోత్సాహకంగా డబ్బు వారి ఖాతాలోకి వస్తుంది. ఏడాది పూర్తి చేసాక మరో విడత డబ్బు అందుతుంది. అయితే అది ఆర్థిక విజ్ఞాన శిక్షణ పూర్తి చేసిన తరువాత మాత్రమే. ప్రోత్సాహకం నేరుగా వ్యక్తుల పాన్ ఆధారిత ఖాతాలోకి డీబీటీ ద్వారా జమ అవుతుంది. ఈ విధంగా, పొదుపు అలవాటు, ఆర్థిక స్థిరత్వం రెండింటినీ పెంపొందించే యత్నం ఇది.



భాగం బి ద్వారా సంస్థలకు ప్రోత్సాహక భత్యం అందుతుంది. 50 మందికి లోపు సిబ్బంది ఉన్న సంస్థలు కనీసం ఇద్దరిని, 50 మందికి మించిన సంస్థలు కనీసం ఐదుగురిని కొత్తగా నియమించాలి. ఈ నియామకాలు స్థిరంగా కనీసం ఆరు నెలలపాటు కొనసాగాలి. వారి జీత స్థాయిని బట్టి నెలకు సంస్థలు ఈ క్రింద పేర్కొన్న విధంగా ప్రోత్సాహాన్ని పొందగలవు జీతం రూ.10,000లోపు అయితే రూ.1,000; జీతం రూ.10,000 నుంచి 20,000 మధ్య అయితే రూ.2,000; జీతం రూ.20,000 నుంచి 1 లక్ష రూపాయల వరకు అయితే రూ.3,000. ఈ సహాయం సాధారణంగా రెండు సంవత్సరాలపాటు అందుతుంది. కానీ తయారీ రంగానికి ప్రత్యేక ప్రాధాన్యంతో ఇది మూడవ, నాలుగవ సంవత్సరాల వరకు పొడిగించబడుతుంది.
తయారీ రంగానికి ఈ ప్రత్యేక దృష్టి అనేది ఊహాజనిత నిర్ణయం కాదు. ఇది భారతదేశ ఆర్థిక స్వావలంబనకు కీలకంగా భావించే రంగం. దీని ద్వారా స్థిర ఉద్యోగాలు, నైపుణ్యాల పెరుగుదల, ఉత్పాదకత మెరుగవుతాయి. అందుకే నాలుగు సంవత్సరాల ప్రోత్సాహం ఈ రంగాన్ని ప్రోత్సహించేందుకు సరైన విధానం. ఈ పథకం ద్వారా తయారీ రంగం ద్వారా సుమారు 2.6 కోట్ల ఉద్యోగాలు, అలాగే 1.92 కోట్ల మొట్టమొదటి ఉద్యోగులకూ ప్రత్యక్ష ప్రయోజనం అందే అవకాశం ఉంది. మొత్తం 3.5 కోట్ల ఉద్యోగాల లక్ష్యం అందుబాటులో ఉందనిపించడంలో ఆశాభావం ఉంది. ఇప్పటి వరకు అమలైన పథకాలతో పోలిస్తే, ఈ పథకం వేరియే. ఉదాహరణకు, కరోనా సమయంలో అమలులో ఉన్న 'ఆత్మనిర్భర్ భారత్ రోజ్గార్ యోజన' తాత్కాలిక సహాయం మాత్రమే. ఈ పథకం మాత్రం సంక్షేమాన్ని దాటి దీర్ఘకాలిక భద్రతను లక్ష్యంగా పెట్టుకున్నది. ఆర్థిక విజ్ఞానం, డీబీటీ ఆధారిత పారదర్శక వ్యవస్థ, తయారీ రంగంపై ప్రత్యేక దృష్టి వంటి అంశాలు దీన్ని కొత్త తరహాలో నిలబెడుతున్నాయి. అయితే, ఈ పథకాన్ని విజయవంతం చేయాలంటే అమలు కీలకం. సంస్థ లు నిజంగా కొత్త ఉద్యోగులను నియమించగలవా? ఉద్యోగులు ఈ అవకాశాన్ని పూర్తిగా వినియోగించుకుంటారా? కేంద్ర, రాష్ట్ర స్థాయిలలో పర్యవేక్షణ, గణాంకాల సేకరణ, మూల్యాంకన విధానాలు సమర్థవంతంగా అమలవుతాయా? ముఖ్యంగా చిన్న పట్టణాల్లో తక్కువ సాంకేతిక వనరులు ఉన్న చోట్లనైనా డీబీటీ ఆలస్యాలు లేకుండా అమలు చేయగలమా అన్నదే అసలైన పరీక్ష.

ప్రభుత్వం ఒక శక్తివంతమైన ఐటీ మౌలిక వ్యవస్థను, జాతీయ స్థాయి అవగాహన కార్యక్రమాలను, సేవా మద్దతు కేంద్రాలను, పబ్లిక్ డాష్‌బోర్డులను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది. ఆర్థిక విజ్ఞాన శిక్షణను అందుబాటులో ఉండే భాషలలో అందించకపోతే అది అవరోధంగా మారే ప్రమాదమూ ఉంది. పథకం భారత యువత ముఖ్యంగా కొత్తగా ఉద్యోగం ప్రారంభించే వారికి ఒక నూతన మార్గాన్ని తెరుస్తోంది. ఉపాధి అనేది కేవలం జీవనాధారం కాదు. అది గౌరవానికీ భద్రతకూ మార్గం. సంక్షేమం గణాంకాల్లో మాత్రమే కాకుండా ప్రతి ఇంట్లో పరిమళించాలన్న లక్ష్యాన్ని ఇది ప్రతిబింబిస్తుంది. ఈ ప్రయోగం విజయవంతమైతే, భారతదేశంలో ఉద్యోగాల రంగంలో ఒక నూతన అధ్యాయాన్ని తెరిచే అవకాశం ఉంది.

**– జనక మోహన రావు దుంగ**
**8247045230**

## ప్రైవేటు రంగ పరిశోధనలకు అధిక నిధులు ప్రమాదకరం

కేంద్ర క్యాబినెట్ సమావేశం గతవారం 1 లక్ష కోట్ల రూపాయలను ప్రైవేటు రంగంలో శాస్త్ర పరిశోధనల అభివృద్ధికి కేటాయించింది. దేశ అభివృద్ధికి, రక్షణకు, స్వావలంబనకు కీలకమైన కృత్రిమ మేధ, ఎలక్ట్రానిక్స్, వ్యాక్సిన్లు, బయోటెక్నాలజీ తదితర రంగాల్లో శాస్త్రీయ పరిశోధనలకు ప్రైవేట్ రంగానికి ప్రాముఖ్యతనివ్వటం జరిగింది. అదే సమయంలో గత బడ్జెట్లో కేవలం 20 వేల కోట్ల రూపాయలను (అంటే జిడిపిలో 1.2 శాతం మాత్రమే) సిఎస్ఐఆర్, ఐసిఎఆర్, ఐఐటిలకు కేటాయించి, ప్రభుత్వ రంగ పరిశోధనలపై సవతి తల్లి ప్రేమ చూపిస్తున్నది. అయినా అంతరిక్ష పరిశోధనలు, ఆహారం స్వయం సమృద్ధి, ఉక్కు పరిశ్రమల అభివృద్ధికి, ఔషధ రంగ అభివృద్ధికి, వ్యాక్సిన్ల అభివృద్ధికి, ప్రభుత్వ రంగ పరిశోధనలు ఎనలేని కృషి చేసి దేశ స్వావలంబనకు అభివృద్ధికి కృషి చేశాయి. కాగా ప్రైవేటు రంగం వారు దేశంలో శాస్త్ర పరిశోధనల అభివృద్ధికి కృషి చేయలేదు, మొత్తంగా పశ్చిమ దేశాల నుండి మాత్రమే టెక్నాలజీని దిగుమతి చేసుకొన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో దేశ సమగ్రాభివృద్ధికి ఇతోధికంగా కృషి చేస్తున్న ప్రభుత్వ రంగ పరిశోధనలను ప్రోత్సహించకపోగా ప్రైవేటురంగ పరిశోధనలకు ఇంత అధిక మొత్తంలో నిధులు కేటాయించడం ఏమాత్రం సమర్థనీయం కాదు. కీలకమైన రంగాల్లోని పరిశోధనలను ప్రైవేటు రంగానికి కేటాయించడం దేశ అభివృద్ధికి, స్వావలంబనకు ప్రమాదకరం. ఈ చర్య ప్రభుత్వ రంగ పరిశోధక సంస్థలను మొత్తంగా నిర్వీర్యం చేసి ప్రైవేటు రంగానికి కట్టబెట్టే దిశగా భావించాలి. ఉదారవాదం ఆర్థిక విధానాల్లో భాగమైన ఈ చర్యను శాస్త్రజ్ఞులు, ప్రజాబాహుళ్యం వ్యతిరేకించాలని కోరుతున్నాను.

**– డాక్టర్.సోమ మర్ల**
విశ్రాంత ప్రధాన శాస్త్రవేత్త ఐసిఎఆర్, న్యూఢిల్లీ

### పదోన్నతుల తర్వాతే డైట్, డిప్యూటీ ఎడ్యుకేషనల్ ఆఫీసర్

# ఉద్యోగాలకు నోటిఫికేషన్ ఇవ్వాలి

తెలంగాణ రాష్ట్ర విద్యా శాఖ త్వరలో డైట్ కళాశాలల్లో లెక్చరర్ పోస్టులకు, డిప్యూటీ ఎడ్యుకేషనల్ ఆఫీసర్ ఉద్యోగాలకు నోటిఫికేషన్ జారీ చేయనున్నట్లు ప్రకటించారు. తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టిజిపిఎస్‌సి) ఆధ్వర్యంలో ముప్పై శాతం పోస్టులను భర్తీ చేసి డెబ్బై శాతం ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులకు పదోన్నతుల ద్వారా భర్తీ చేయనున్నట్లు తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలోని ప్రభుత్వ, పంచాయతీ రాజ్ పాఠశాలల్లో గత ఇరవై, ఇరవై ఐదు, ముప్పై సంవత్సరాల నుండి డిగ్రీలు, పి.జిలు, పిహెచ్‌డిలు, బి.ఎడ్ఎం. ఇడి, స్లెట్, నెట్ అర్హతలు కలిగి డైట్, డిప్యూటీ ఎడ్యుకేషనల్ ఆఫీసర్ పదోన్నతుల కోసం అన్ని అర్హతలు కలిగి ఉన్న గత మూడు దశాబ్దాలుగా ఎలాంటి పదోన్నతులు ఇవ్వడం లేదు. తెలంగాణ రాష్ట్రంలోని పాత పది జిల్లాలలో ఉన్న డైట్, బి.ఎడ్ తెలంగాణ రాష్ట్ర విద్యా పరిశోధన శిక్షణ సంస్థ (ఎస్‌సిఈఆర్‌టి), ఐసిఎస్ఈలలో ఉపాధ్యాయులు, ఉపన్యాసకులు, ఆచార్యుల పోస్టులు ఖాళీగా ఉన్నప్పటికీ ప్రభుత్వ, పంచాయతీ రాజ్ సర్వీస్‌ను కామన్ సర్వీస్‌గా పరిగణించాలని 2005 నుండి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం హైకోర్టులోనూ, సుప్రీంకోర్టులోనూ, రాష్ట్రపతి ఉత్తర్వులను చాలెంజ్ చేస్తూ కాలయాపన చేస్తూ ఇరవై సంవత్సరాలుగా ఉపాధ్యాయులకు ఎలాంటి పదోన్నతులు లేకుండా పదవీవిరమణ చేస్తున్నారు. తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్ర విద్యాశాఖ మంత్రి పదవిని తానే స్వయంగా పర్యవేక్షించడంతో ప్రభుత్వ, పంచాయతీరాజ్ పాఠశాలల్లో నాణ్యమైన విద్యను అందించడానికి ఎంతో కృషి చేస్తున్నారు. ప్రభుత్వ, పంచాయతీ రాజ్ పాఠశాలలకు పూర్వ వైభవం తీసుకొని రావడానికి ఉద్యోగ పోస్టులను భర్తీ చేయడం, ఉపాధ్యాయులకు పదోన్నతులు ఇవ్వడం, మూతపడిన పాఠశాలలను తెరిపించడం, వేసవి సెలవుల్లో ఉపాధ్యాయులకు శిక్షణ తరగతులు నిర్వహించడం, ప్రభుత్వ, పంచాయతీ రాజ్ పాఠశాలల్లో మరమ్మతుల కోసం నిధులను మంజూరు చేయడం విద్యాశాఖ కమిషన్ ఏర్పాటు చేయడం విద్యాశాఖ పట్ల తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రత్యేక దృష్టి కేంద్రీకరించడంతో తెలంగాణ రాష్ట్రంలోని ఉపాధ్యాయులలో డైట్, డిప్యూటీ ఎడ్యుకేషనల్ ఆఫీసర్ పదోన్నతులు వస్తాయని ఆశతో ఎదురు చూస్తున్నారు. కొత్తగా త్వరలో డైట్, డిప్యూటీ ఎడ్యుకేషనల్ ఆఫీసర్ పోస్టులను భర్తీ చేయనున్నట్లు ప్రకటించడంతో ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులు జూనియర్ అవుతారని ముందు ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులకు పదోన్నతులు ఇచ్చిన తర్వాతనే కొత్త నోటిఫికేషన్ ఇవ్వాలని ఉపాధ్యాయ సంఘాలు, ఉపాధ్యాయులు కోరుతున్నారు. తెలంగాణ రాష్ట్రంలోని భాషోపాధ్యాయులకు, పిఇటిలకు మూడు దశాబ్దాలుగా పదోన్నతులు లేక ఉన్నత పాఠశాలలలో పనిచేస్తూ ప్రాథమిక పాఠశాల వేతనాలు తీసుకొని శ్రమ దోపిడీకి, వెట్టిచాకిరికి గురయ్యేవారు. తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేక శ్రద్ధ తీసుకొని తెలంగాణ రాష్ట్రంలోని భాషలు (తెలుగు, హిందీ, ఉర్దూ మిగతా దేశీయ భాషలు) బోధించే ఉపాధ్యాయులకు పదోన్నతులు ఇచ్చారు. రాజు తలచుకుంటే దెబ్బలకు కొదువా? అనే సామెతగా తెలంగాణ రాష్ట్రంలోని ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులకు తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తలుచుకుంటే ఉపాధ్యాయుల సర్వీస్ రూల్స్ తయారు కావడం సులభమేని సర్వీస్ రూల్స్‌తో ముడిపెడుతూ గత రెండు, మూడు దశాబ్దాలుగా ఉపాధ్యాయ శిక్షణ కళాశాలల్లో ఉపాధ్యాయులు లేకుండా విద్యా సంవత్సరం పూర్తి కావడం ఆందోళన కరమైన విషయంగా చెప్తున్నారు.

లేఖ

**– డాక్టర్.ఎస్.విజయ భాస్కర్**
**9290826988**


# యాంటీ ప్రోటాన్ ఆవిష్కర్త

యాంటీ ప్రోటాన్ అనేది ప్రోటాన్ యొక్క యాంటీపార్టికల్. యాంటీప్రోటాన్‌లు స్థిరంగా ఉంటాయి, కానీ అవి సాధారణంగా స్వల్పకాలికంగా ఉంటాయి, ఎందుకంటే ప్రోటాన్‌తో ఏదైనా ఢీకొనడం వల్ల రెండు కణాలను శక్తి విస్ఫోటనంలో నాశనం చేస్తుంది. దీనిని ఓవెన్ చాంబర్ లైన్ ఆవిష్కరణ చేశారు. ఆయన 10 జూలై 1920న జన్మించారు. ఆయన అమెరికన్ భౌతిక శాస్త్రవేత్త. అతను సబ్‌అటామిక్ యాంటీపార్టికల్ యాంటీప్రోటాన్‌ను కనుగొన్నందుకు భౌతిక శాస్త్రంలో నోబెల్ బహుమతిని ఎమిలియో సెగ్రేతో కలిసి పంచుకున్నారు. చాంబర్‌లైన్ 1942లో మాన్‌హాట్టన్ ప్రాజెక్ట్‌లో చేరాడు. అక్కడ ఆయన సెగ్రేతో కలిసి పనిచేశాడు. 1946లో రెండవ ప్రపంచ యుద్ధం తర్వాత చాంబర్‌లైన్ చికాగో విశ్వవిద్యాలయంలో భౌతిక శాస్త్రవేత్త ఎన్రికో ఫెర్మీ ఆధ్వర్యంలో తన డాక్టొరల్ అధ్యయనాలను చేపట్టాడు. ఫెర్మీ ఛాంబర్‌లైన్‌కు ముఖ్యమైన మార్గదర్శిగా మరియు సలహాదారుగా వ్యవహరించాడు. ఫెర్మీ ప్రయోగాత్మక భౌతిక శాస్త్రం కోసం సైద్ధాంతిక భౌతిక శాస్త్రాన్ని విడిచిపెట్టమని అతనిని ప్రోత్సహించారు. ఛాంబర్‌లైన్ తన పిహెచ్‌డిని 1949లో చికాగో విశ్వవిద్యాలయం నుండి పొందారు. 1948లో ఆయన సెగ్రే, ఇతర భౌతిక శాస్త్రవేత్తలు ప్రోటాన్ పరిక్షేపణ (స్కాటరింగ్)ను పరిశోధించారు. 1955లో శక్తివంతమైన పార్టికల్ యాక్సిలరేటర్ బెవట్రాన్ సహాయంతో చాంబర్‌లైన్, సెగ్రేలు చేసిన ప్రోటాన్ పరిక్షేపణ ప్రయోగాల శ్రేణి యాంటీప్రోటాన్‌ను కనుగొనటానికి దారితీసింది. ఇది ప్రోటాన్ వంటి ఒక కణమే కానీ దాని వ్యతిరేక కణం. ఇది దాని చార్జ్‌కు సమానమైన వ్యతిరేక ఛార్జ్(నెగెటివ్) కలిగి ఉంటుంది. వీరి పరిశోధన మరిన్ని యాంటీ పార్టికల్స్ ఆవిష్కరణకు దారి తీసింది. తరువాత సంవత్సరాలలో చాంబర్‌లైన్ తన సహచరులతో హైడ్రోజన్, డ్యుటీరియం, ఇతర మూలకాలతో యాంటీప్రోటాన్ల సంఘర్షణను అధ్యయనం చేశారు. యాంటీన్యూట్రాన్‌లను ఉత్పత్తి చేయడానికి యాంటీప్రోటాన్‌లను ఉపయోగించారు. చాంబర్‌లైన్ 1980లలో న్యూక్లియర్ ఫ్రీజ్ ఉద్యమం స్థాపనకు సహాయం చేశారు. 2003లో హ్యూమనిస్ట్ మ్యానిఫెస్టోపై సంతకం చేసిన 22 మంది నోబెల్ గ్రహీతలలో ఆయన ఒకరు.ఆయన 2006 ఫిబ్రవరి 28న తుదిశ్వాస విడిచారు. యాంటీప్రోటాన్‌లు కొన్ని క్యాన్సర్‌లకు చికిత్స చేయగల సామర్థ్యాన్ని కలిగి ఉన్నాయని ప్రయోగశాల ప్రయోగాలలో నిరూపించారు.



(జులై 10 నోబెల్ గ్రహీత ఓవెన్ చాంబర్‌లైన్ జయంతి)

**– యం.రాంప్రదీప్, జెవివి సభ్యులు,**
తిరువూరు, 9492712836



# జాతీయం
NATIONAL & GENERAL NEWS

## ఉక్రేన్‌కు అమెరికా ఆయుధాలు : ట్రంప్

**వాషింగ్టన్ :** ఉక్రేన్‌కు మరిన్ని ఆయుధాలను తప్పనిసరిగా పంపుతామని అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ చెప్పారు. ఉక్రేన్‌కు కీలక ఆయుధాల సరఫరాను ఆపేయాలని కొద్ది రోజుల క్రితం ఇచ్చిన ఆదేశాల తర్వాత మంగళవారంనాడు ట్రంప్ పైవిధంగా స్పందించారు. పెంటగాన్ రక్షణ వ్యవస్థ గతవారం చేసిన ప్రకటన తర్వాత ట్రంప్ వైఖరిలో ఆకస్మిక మార్పు వచ్చింది. ఉక్రేన్‌కు పంపించే కొన్ని గగనతల రక్షణ క్షిపణులు, లక్ష్యాలను గురిచూసి దెబ్బతీయగల గైడెడ్ ఆర్టిల్లరీ ఆయుధాలు, ఇతర ఆయుధాలను పంపకుండా ఆపేస్తున్నామనీ, ఎందుకంటే చాలా ఎక్కువ నిల్వలను ఉంచడంపట్ల అమెరికా అధికారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారని ఆ దేశ రక్షణ శాఖ ప్రకటించింది. ఆ తర్వాతే ట్రంప్ పైవిధంగా తాజా ప్రకటన చేశారు. ''తమంతట తాముగా వారిని వారు రక్షించుకోవాలి, వారు ఇప్పుడు చాలా పెద్ద దాడులకు గురవుతున్నారు, అందువల్ల మేం కొన్ని ఆయుధాలు పంపుతున్నాం, ప్రధానంగా వారిని రక్షించుకోవడానికి ఉద్దేశించిన ఆయుధాలు పంపుతున్నాం'' అని ట్రంప్ చెప్పారు. రష్యా వైపు నుండి చాలా ఉద్ధృతస్థాయిలో దాడులు పెరిగిపోయిన తరుణంలో అమెరికా నుండి ఆయుధాల సరఫరా ఆగిపోయింది.

# అంబేద్కర్ ఆశించింది 'అధికార' జోక్యం లేని న్యాయవ్యవస్థనే

### మహారాష్ట్ర చట్టసభల అభినందనసభలో సిజెఐ గవాయ్



**ముంబయి :** 'అధికార' జోక్యంలేని న్యాయవ్యవస్థనే రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ కోరుకున్నారని భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ భూషణ్ రామకృష్ణ గవాయ్ అన్నారు. 'భారత రాజ్యాంగం' అనే అంశంపై ముంబయిలో మంగళవారంనాడు చేసిన ప్రసంగంలో గవాయ్ ఈ విషయం చెప్పారు. భారతదేశ అత్యున్నత నాయ్యమూర్తి పదవిస్థాయికి చేరుకున్న గవాయ్‌ను మహారాష్ట్ర శాసనవ్యవస్థ ఘనంగా సత్కరించింది. మహారాష్ట్ర ఉభయసభలూ ఆయనకు అభినందనలు తెలియజేస్తూ ఒక ఏకగ్రీవ తీర్మానం చేసిన తర్వాత ఉభయసభల సభ్యులనూ ఉద్దేశించి మాట్లాడుతూ, న్యాయవ్యవస్థలో కార్యనిర్వాహక వ్యవస్థ జోక్యం ఉండకూడదన్నారు. దేశంలో రక్తపాత రహితంగా విప్లవాన్ని తెచ్చిన ఒక ఆయుధంగా రాజ్యాంగాన్ని ఆయన అభివర్ణించారు. గడచిన 75 సంవత్సరాలుగా దేశంలో సామాజిక—ఆర్థిక సమానత్వాన్ని సాధించడంకో సం శాసన,కార్యనిర్వాహక,న్యాయ వ్యవస్థలు మూడూ సరికొత్త ఉషోదయానికి ఉమ్మడి కృషి చే స్తున్నాయని గవాయ్ చెప్పారు. రాజ్యాంగం శతవార్షికాల దిశగా ప్రయాణిస్తున్న తరుణంలో న్యా యవ్యవస్థలో తానుకూడా భాగస్వామిగా ఉండ టం తనకెంతో సంతోషంగా ఉందని అన్నారు.

రాజ్యాంగ ఆధిపత్యంపై మనందరకూ విశ్వాసం ఉన్నప్పుడే యుద్ధం—శాంతి నెలకున్న సమయాలలో దేశాన్ని ఐక్యంగా ఉంచగలుగుతామని అంబేద్కర్ చెప్పారని గుర్తుచేశారు. కార్యనిర్వాహక వ్యవస్థ జోక్యం లేకుండా న్యాయవ్యవస్థ స్వేచ్ఛగా ఉండాలని, ఐతే అతిముఖ్యమైన శాసన,కార్యనిర్వాహక,న్యాయ వ్యవస్థలు మూడింటికీ రాజ్యాంగం హక్కులు ప్రసాదించిందని చెప్పారు. పౌరహక్కుల సంరక్షకురాలుగా, వారికి ఒక కావలివ్యవస్థగా న్యాయవ్యవస్థ పనిచేయాలని అంబేద్కర్ కోరుకున్నారని, రాజ్యాంగం ఎప్పుడూ చలనరహితంగా, ఒకేలా ఉండిపోదని, రాజ్యాంగం ప్రాణికోటికి సంబంధించినది కాబట్టి అది ఎప్పుడూ అభివృద్ధి చెందుతూ విస్తరిస్తూ ఉంటుందని కూడా అంబేద్కర్ చెప్పారన్నారు. రాబోయేతరం ప్రజలు ఎదుర్కొనే సమస్యలు ఏమిటో పూర్తిగా ఈ తరం ముందుగా ఊహించలేదు కాబట్టి రాజ్యాంగంలో సవరణలను అనుమతించారన్నారు.

రాజ్యాంగం కారణంగానే దేశంలో మహిళలు, వెనుకబడినవర్గాల వారు జాతీయ జనజీవన స్రవంతిలోకి ప్రవేశించగలిగారన్నారు.''మనకు ఒక మహిళా ప్రధానమంత్రిగా పనిచేశారు, ఒక మహిళ రాష్ట్రపతిగా బాధ్యతలు నిర్వహించారు, ప్రస్తుతం నిర్వహిస్తున్నారు, కె.ఆర్.నారాయణన్, రామ్‌నాథ్ కోవింద్ వంటివారంతా వెనుకబడిన తరగతుల నుండి వచ్చి రాష్ట్రపతి పదవి స్థాయికి ఎదిగినవారే, జి.ఎం.సి.బాలయోగి, మీరా కుమార్ లాంటి వారంతా లోక్‌సభ స్పీకర్‌స్థాయి పదవులు నిర్వహించారు, ఇంకా ఎందరో వెనుకబడిన తరగతులకు చెందినవారు ప్రధాన కార్యదర్శులుగా, డి.జి.పిలుగా వివిధ రాష్ట్రాలలో, వివిధ ఉన్నతస్థాయి పదవులలో పనిచేశారు, పనిచేస్తున్నారని గవాయ్ చెప్పారు.''పరిష్కారాలు లేని ప్రాథమిక హక్కులవల్ల ఎలాంటి ఉపయోగం దేని అంబేద్కర్ అభిప్రా యం, మతవిశ్వాసాలు పట్టువిడుపులతో కూడుకున్న వేగానీ, కఠోరమైన,మొండి విశ్వాసాలు కాదు, శాసన,కార్యనిర్వాహక,న్యాయ వ్యవస్థలు మూడింటికీ రాజ్యాంగంలో వేరు వేరు ప్రత్యేక అధికారాలు, బాధ్యతలూ ఉన్నాయి. రాజ్యాంగ చట్రం పరిధిలో చట్టాలన్నీ ఇమిడిపోయేవిధంగా చూ డటం న్యాయవ్యవస్థ బాధ్యత, ప్రజాస్వామ్యంలో ఉన్న ఈ మూడు వ్యవస్థలూ రాజ్యాంగాధిపత్యాని కి లోబడి వ్యవహరించాలి'' అని జస్టిస్ గవాయ్ చెప్పారు.

సమానత్వం, స్వేచ్ఛ, సౌభ్రాతృతం మూడు చేయీ చేయీ కలిపి ముందుకు సాగాలన్నారు. ''కేవలం సమానత్వం మాత్రమే ఉంటే సరిపోదు, ఎవ్వరూ ముందుకెళ్ళేందుకు ఇష్టపడరు, కేవలం స్వేచ్ఛ ఉంటే కూడా బలవంతులే బతికి బట్టకడతారు, సౌభ్రాతృత్వం అనేది ఒక కావలి వ్యవస్థగా పనచేస్తుంది, సమానత్వానికి, స్వేచ్ఛకు మధ్య ఒక కావలివ్యవస్థగా సౌభ్రాతృత్వం పనిచేస్తుంది'' అని గవాయ్ చెప్పారు. మహారాష్ట్ర చట్టసభలు రెండూ ఘన సన్మానం చేయడం పట్ల ఆయన ఎంతో సంతోషం వ్యక్తం చేశారు. తన తండ్రి ఆర్.ఎస్.గవాయ్ 30 సంవత్సరాలపాటు ఎంతో సన్నిహితంగా మహారాష్ట్ర శాసనమండలిలో పనిచేశారని అందుకే ఈ సత్కారం తనకు ఎంతో సంతోషాన్ని ఇచ్చిందన్నారు. గవాయ్ తండ్రి ఆర్.ఎస్.గవాయ్ రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా (ఆర్‌పిఐ) నాయకుడుగా, మహారాష్ట్ర శాసనమండలి ఛైర్మన్‌గా పనిచేశారు. బీహార్, సిక్కిం, కేరళ రాష్ట్రాలలో గవర్నర్‌గా కూడా గవాయ్ ఆర్.ఎస్.గవాయ్ పనిచేశారు. మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ శాసనసభ్యులందరి తరపునా ప్రధాన న్యాయమూర్తి గవాయ్‌ను సత్కరించారు. సెంట్రల్ హాలులో ఈ కార్యక్రమం జరిగింది. మహారాష్ట్రలోని అమరావతిలో 1960 నవంబరు 24వ తేదీన జన్మించిన ప్రధాన న్యాయమూర్తి గవాయ్ 2003 నవంబరు 14వ తేదీన బోంబే హైకోర్టు అదనపు న్యాయమూర్తి పదవి చేపట్టారు. ఈ ఏడాది మే 14వ తేదీన భారత ప్రధాన న్యాయమూర్తిగా పదవీ బాధ్యతలు తీసుకున్నారు.

### విమానాశ్రయ ప్రతినిధులతో...
# పార్లమెంటరీ కమిటీ భేటీ

### అహ్మదాబాద్ విమాన ప్రమాదం, దర్యాప్తు నివేదికపై ప్రశ్నించిన సభ్యులు
### పహల్గామ్ ఉగ్రదాడి తర్వాత శ్రీనగర్‌లో ఆకస్మికంగా విమానచార్జీల పెరుగుదలపై అసహనం



**న్యూఢిల్లీ :** పౌర విమానయాన మంత్రిత్వ శాఖ అధికారులు, విమానయాన సంస్థ (ఎయిర్‌లైన్), విమానాశ్రయ ప్రతినిధుల మౌఖిక సాక్ష్యం తీసుకోవడానికి మంగళవారం పార్లమెంటరీ కమిటీ ఒక కీలక సమావేశం నిర్వహించింది. అహ్మదాబాద్‌లో ఎయిర్ ఇండియా (ఎఐ) విమాన ప్రమాద ఘటన, దానికి సంబంధించిన దర్యాప్తు నివేదిక ఎప్పుడు సిద్ధం అవుతుందనే విషయమై పలువురు పార్లమెంటేరియన్లు ఈ సందర్భంగా ప్రశ్నించినట్లు అధికార వర్గాలు తెలిపాయి. అంతేకాకుండా ఈ సమావేశంలో పార్లమెంటరీ కమిటీ ప్యానెల్ సభ్యులు పలువురు ఏప్రిల్‌లో పహల్గామ్ ఉగ్రదాడి అనంతరం శ్రీనగర్‌లో ఆకస్మికంగా విమాన చార్జీలు పెరగడంపై ప్రశ్నలు, సందేహాలు లేవనెత్తి ఆందోళన వ్యక్తం చేసినట్లు అధికారవర్గాలు వెల్లడించాయి. కొంతమంది సభ్యులు ఇతర సమస్యలతో పాటు బ్యూరో ఆఫ్ సివిల్ ఏవియేషన్ సెక్యూరిటీ (బిసిఎఎస్) ఆడిట్‌ను డిమాండ్ చేసినట్లు కూడా వర్గాలు తెలిపాయి. కెసి.వేణుగోపాల్ నేతృత్వంలోని పబ్లిక్ అకౌంట్స్ కమిటీ (పిఎసి) సీనియర్ అధికారులను, ఎయిర్‌లైన్ ప్రతినిధులను కలిశారు. ఎయిర్ ఇండియా సిఇఓ మరియు ఎండి కాంప్‌బెల్ విల్సన్ సహా ఎయిర్‌లైన్ ప్రతినిధులు ఈ సమావేశానికి హాజరయ్యారని అధికార వర్గాలు తెలియజేశాయి. జూన్ 12న జరిగిన ఎయిర్ ఇండియా విమాన ప్రమాదం గురించి పలువురు ప్యానెల్ సభ్యులు ఈ సందర్భంగా సమావేశంలో ప్రస్తావించారని, ఎయిర్‌క్రాఫ్ట్ బ్లాక్ బాక్సుల విశ్లేషణ నిర్దిష్ట కాల పరిమితిలో పూర్తి చేయించాలని కోరినట్లు అధికార వర్గాలు వివరించాయి. జూన్ 12న అయిన వెంటనే అహ్మదాబాద్‌లో లండన్ గాట్విక్‌కు వెళుతున్న ఎయిర్ ఇండియా విమానం కుప్పకూలిన కారణంగా దాదాపు 270మంది మృతిచెందారు. ఏప్రిల్ 22న పహల్గామ్ ఉగ్రదాడి జరిగిన ఘటనలో 26మంది మరణించిన తర్వాత ప్రభుత్వం పాకిస్థాన్‌కు వ్యతిరేకంగా తీసుకున్న అనేక చర్యలలో భాగంగా నిషేధం విధించింది. పౌర విమానయాన మంత్రిత్వశాఖ, డైరెక్టర్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ (డిజిసిఎ), ఎయిర్‌పోర్ట్స్ ఎకనామిక్ రెగ్యులేటరీ అథారిటీ ఆఫ్ ఇండియా (ఎఇఆర్ఎ), ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ఇ ండియా (ఎఎఐ), ఎఎఐ కార్గో లాజిస్టిక్స్ అండ్ అలైడ్ సర్వీసెస్ కంపెనీ లిమిటెడ్ (ఎఎఐసిఎల్ ఎఎస్) , బ్యూరో ఆఫ్ సివిల్ ఏవియేషన్ సెక్యూరిటీ (బిసిఎఎస్), సమావేశానికి హాజరైన వారిలో ఉన్నారు. ఈ సమావేశం నిర్వహించడంలోని అజెండా పౌర విమానయాన మంత్రిత్వ శాఖ అధికారులు, విమానయాన సంస్థ, విమానాశ్రయ ప్రతినిధుల మౌఖిక సాక్ష్యం తీసుకోవడం. లెవీ, ఫీజుల రెగ్యులేషన్, టారిఫ్స్, యూజర్ చార్జీలు మొదలైన వాటికి సంబంధించినవి ఉన్నాయి. ప్రజలకు మౌలిక సదుపాయాలు, ఇతర ప్రజల అవసరాల అంశాలు కూడా ఉన్నాయని లోక్‌సభ వెబ్‌సైట్ తెలిపింది.

**విమానచార్జీల ఆకస్మిక పెరుగుదలకు అడ్డుకట్టవేస్తాం : కమిటీకి డిజిసిఏ హామీ**

ఇటీవలి మహాకుంభ్‌మేళా, పహల్గామ్ ఉగ్రదాడి తర్వాత భారీగా విమాన టికెట్ల ధరలు భారీగా పెరిగిన నేపథ్యంలో పార్లమెంటరీ కమిటీ సభ్యులు ఆందోళన వ్యక్తంచేయడంతో స్పందించిన డైరెక్టర్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ (డిజిసిఎ) వీటికి అడ్డుకట్ట వేసే యంత్రాంగాన్ని ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చింది. అంతేకాకుండా అహ్మదాబాద్ విమాన ప్రమాదం అనంతరం విమానప్రయాణ భద్రతపై ప్యానెల్ సభ్యులు ఆందోళన వ్యక్తం చేశారు.

**భద్రతా సమస్యలపైనే కమిటీ సభ్యులందరి ఆందోళన**
**: పార్లమెంటరీ కమిటీ చైర్మన్ కెసి.వేణుగోపాల్**

సమావేశం అనంతరం పార్లమెంటరీ కమిటీ చైర్మన్ కెసి.వేణుగోపాల్ విలేకరులతో మాట్లాడుతూ విమాన ప్రయాణాలలో భద్రతా సమస్యలపైనే పార్లమెంటరీ కమిటీ సభ్యులందరూ ఆందోళన వ్యక్తంచేసినట్లు తెలిపారు. ఎన్‌సిపి ఎంపి ప్రఫుల్ పటేల్ ఇటీవల జరుగుతున్న విమాన ప్రమాద ఘటనలను ప్రస్తావించారు. ప్రతీ ప్రయాణికుడూ వారి ప్రయాణంలో భద్రత గురించి ఆందోళన వ్యక్తంచేస్తూ సురక్షిత ప్రయాణాన్ని కోరుకుంటున్నారని చెప్పారు.ఈ విషయమై తమ సమావేశంలో ఎయిర్ ఇండియా సిఇఓ మరియు ఎండి కాంప్‌బెల్ విల్సన్ మాట్లాడుతూ సీట్లు మరియు ఇతర సౌకర్యాల గురించి తరచుగా వస్తున్న ఫిర్యాదులను పరిష్కరించడానికి రెండు సంవత్సరాలలో దాని విమానాల పునరుద్ధరణ చేపడతామని, విమాన భద్రత పట్ల నిబద్ధతకు కట్టుబడి ఉంటామని హామీ ఇచ్చినట్లు తెలియజేశారు.

# బిహార్‌లో శాంతి భద్రతలు విధ్వంసం

### రానున్న ఎన్నికల్లో రాష్ట్రంలో మార్పు ఖాయం : ఖర్గే



**న్యూఢిల్లీ :** బిహార్‌లోని డబుల్ ఇంజిన్ ప్రభుత్వం రాష్ట్రంలో శాంతిభద్రతలను నాశనం చేస్తోందని కాంగ్రెస్ మంగళవారం ఆరోపించింది. రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో మార్పు కచ్చితంగా ఉంటుందని జోస్యం చెప్పింది. బిహార్‌ను దేశానికి 'నేర రాజధాని'గా మార్చడానికి జెడి(యు)—బిజెపి కూటమి ఏ రాయినీ వదలలేదని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే ఆరోపించారు. అవకాశవాద డబుల్ ఇంజిన్ సర్కార్ బిహార్‌లో శాంతిభద్రతలను విధ్వంసం చేసిందని, గత ఆరు నెలల్లో, ఎనిమిది మంది వ్యాపారవేత్తలు హత్యకు గురికాగా, ఐదు సార్లు పోలీసులను కొట్టారని ఖర్గే ఎక్స్‌లో హిందీలో పోస్టు చేశారు. నిన్నటికి నిన్న, మూఢనమ్మకాల కారణంగా ఒక కుటుంబంలోని ఐదుగురు సభ్యులను హత్య చేశారని మండిపడ్డారు. అమాయక పిల్లలను కూడా వదిలిపెట్టలేదని ఖర్గే ఆగ్రహం వ్యక్తం చేశారు. బిహార్‌లోని పూర్నియా జిల్లాలో మంత్రవిద్యను అభ్యసిస్తున్నారనే అనుమానంతో ముగ్గురు మహిళలు సహా ఒక కుటుంబంలోని ఐదుగురు సభ్యులను చంపి, వారి మృతదేహాలను దహనం చేశారని పోలీసులు తెలిపారు. విపక్ష పార్టీల నుండి తీవ్ర విమర్శలు రాగా, ఆదివారం రాత్రి జరిగిన ఈ ఘటనలో ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేశారు. బిహార్‌ను దేశానికి నేర రాజధానిగా మార్చడానికి జెడియు—బిజెపి కూటమి అవకాశాన్ని వదలడం లేదని ఖర్గే తన పోస్ట్‌లో పేర్కొన్నారు. బిహార్‌లో పేదరికం గరిష్ట స్థాయికి చేరుకుందని, సామాజిక, ఆర్థిక న్యాయం పరిస్థితి దారుణం నుండి అధ్వాన్నంగా మారిందని, స్తబ్దుగా ఉన్న శాంతిభద్రతల కారణంగా పెట్టుబడులు కాగితాలకే పరిమితం అయ్యాయని మోదీ ప్రభుత్వ సొంత గణాంకాలే చూపిస్తున్నాయని ఖర్గే అన్నారు.ఈసారి బిహార్ ఇకపై అనారోగ్యంతో ఉండకూడదని నిర్ణయించుకుందని, బిహార్‌లో మార్పు ఖాయమన్నారు. ఇండియా కూటమి ఈ మార్పు తీసుకువస్తుందని ఆయన స్పష్టం చేశారు. గత వారం పాట్నాలోని తన నివాసం వెలుపల ప్రముఖ వ్యాపారవేత్త గోపాల్ ఖేమ్కాను కాల్చి చంపిన తర్వాత ప్రతిపక్షాలు ఎన్‌డిఎ ప్రభుత్వంపై విమర్శలు గుప్పిస్తున్నాయి. బిజెపి, ముఖ్యమంత్రి నితీష్ కుమార్ కలిసి బిహార్‌ను భారతదేశానికి నేర రాజధానిగా మార్చారని ఈ ఘటన మరోసారి నిరూపించిందని కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ పేర్కొన్నారు. రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో, ఓటు ప్రభుత్వాన్ని మార్చడానికే కాదు.. రాష్ట్రాన్ని కాపాడుతునేందుకు వేయాలని రాహుల్ పిలుపునిచ్చారు. హాజీపూర్‌లో ఖేమ్కా కుమారుడిని దుండగులు కాల్చి చంపిన ఏడు సంవత్సరాల తర్వాత, పాట్నాలోని ఆయన నివాసం వెలుపల బైక్‌పై వచ్చిన దుండగుడు ఖేమ్కాను కాల్చి చంపాడు.

# మహిళలకు నితీష్ ఎన్నికల ఎర

### ఉద్యోగాల్లో 35 శాతం రిజర్వేషన్
### యువతకు ఉపాధి కల్పనకు యూత్ కమిషన్ ఏర్పాటు



**పాట్నా :** బిహార్ అసెంబ్లీ ఎన్నికలు ఈ ఏడాది చివర్లో జరగనున్నాయి. ఈనేపథ్యంలో రాజకీయ పార్టీలు అప్పుడే తమ తమ వ్యూహాలకు పదునుపెడుతున్నాయి. ప్రజాకర్షక నిర్ణయాలు ప్రకటిస్తున్నాయి. తాజాగా బిహార్ ముఖ్యమంత్రి నీతీశ్ కుమార్ పలు ప్రకటనలు చేశారు. ప్రభుత్వ ఉద్యోగాల్లో మహిళలకు 35 శాతం రిజర్వేషన్ కల్పిస్తామని హామీ ఇచ్చారు. యువత కోసం బిహార్ యూ త్ కమిషన్‌ను ఏర్పాటుచేస్తామని వెల్లడించారు. వీటితో సహా మరో 43 ప్రతిపాదనలకు మంత్రిమండలి ఆమోదం తెలిపింది. మంగళవారం ము ఖ్యమంత్రి నితీశ్ కుమార్ అధ్యక్షతన కేబినెట్ భేటీ జరిగింది. సమావేశంలో పలు నిర్ణయాలు తీసుకున్నారు. బిహార్‌లో శాశ్వత నివాసితులుగా ఉన్న మహిళలకు ప్రభుత్వ ఉద్యోగ నియామకాల్లో భాగంగా ప్రతి విభాగంలోని అన్ని పోస్టులకు 33 ప్రత్యేక రిజర్వేషన్ వర్తిస్తుందని సిఎం చెప్పారు. దీనివల్ల ప్రభుత్వ సర్వీసుల్లో స్త్రీల ప్రాతినిధ్యాన్ని పెంచడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు. అదే విధంగా యువత కోసం బిహార్ యూత్ కమిషన్‌ను ఏర్పాటుచేస్తామని వెల్లడించారు. దీనికింద యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తామని, శిక్షణ ఇస్తామని వెల్లడించారు. 'బిహార్ యువతకు మరిన్ని ఉపాధి అవకాశాలను అందించడం, వారికి శిక్షణ ఇవ్వడం, వారిని సాధికారత, సమర్థులుగా మార్చడం లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం బిహార్ యువజన కమిషన్‌ను ఏర్పాటు చేయాలని నిర్ణయించిందని కు తెలియజేయడానికి సంతోషంగా ఉందని' సిఎం ఎక్స్‌లో పోస్టు చేశారు. సమాజంలో యువత స్థితిని మెరుగుపరచడం, ఉద్ధరించడం వంటి అన్ని విషయాలపై ప్రభుత్వానికి సలహా ఇవ్వడంలో ఈ కమిషన్ ముఖ్యమైన పాత్ర పోషిస్తుంది. యువతకు మెరుగైన విద్య, ఉపాధిని నిర్ధారించడానికి ఇది ప్రభుత్వ విభాగాలతో సమన్వయం చేసుకుంటుంది' అని ఆయన అన్నారు. 'బిహార్ యువజన కమిషన్‌లో ఒక చైర్‌పర్సన్, ఇద్దరు వైస్‌చైర్‌పర్సన్‌లు, ఏడుగురు సభ్యులు ఉంటారు. గరిష్ట వయోపరిమితి 45 సంవత్సరాలు' అని ఆయన అన్నారు. ఈ కమిషన్ రాష్ట్రంలోని ప్రైవేట్ రంగ ఉపాధిలో రాష్ట్రంలోని యువతకు ప్రాధాన్యత ఇచ్చేలా పర్యవేక్షిస్తుందని చెప్పారు. అదే సమయంలో రాష్ట్రం వెలుపల చదువుతున్న, పనిచేస్తున్న యువత ప్రయోజనాలను కూడా కాపాడుతుందన్నారు. కాగా, భారత యువజన కాంగ్రెస్ (ఐవైసి) గత వారం రాష్ట్ర యువత కోసం 19న పాట్నాలో ఉద్యోగ మేళాను నిర్వహిస్తామని ప్రకటించింది. ప్రభుత్వ ఉద్యోగాల్లో మహిళలకు 35 శాతం కోటాను రాష్ట్ర శాశ్వత నివాసితులకు పరిమితం చేయడంతో సహా మొత్తం 43 ప్రతిపాదనలను మంత్రివర్గం ఆమోదించిందని అదనపు ప్రధాన కార్యదర్శి (క్యాబినెట్ సెక్రటేరియట్) ఎస్ సిద్ధార్థ సమావేశం తర్వాత తెలిపారు. సివిల్ సర్వీసెస్ పరీక్షలకు సిద్ధమవుతున్న వికలాంగులకు ఆర్థిక ప్రోత్సాహకాలు అందించాలనే సాంఘిక సంక్షేమ శాఖ ప్రతిపాదనకు కూడా ఆమోదం తెలిపిందని ఆయన చెప్పారు. నితీష్ కుమార్ ప్రభుత్వం తన సంక్షేమ అజెండాలను కాపీ చేస్తోందని ప్రతిపక్ష నాయకుడు తేజస్వి యాదవ్ పేర్కొన్నారు.

# నేపాల్—చైనా సరిహద్దుల్లో వరదలు

**కఠ్మండు :** రుతుపవనాలు ప్రారంభమైన తర్వాత కేవలం భారత్‌లోనే కాకుండా ఇతర ఆసియా దేశాలను కూడా భారీ వర్షాలు, వరదలు ముంచెత్తుతున్నాయి. నేపాల్—చైనా సరిహద్దుల్లో భారీ వర్షాల కారణంగా వరదలు పోటెత్తాయి. జనావాసాల ప్రాంతాల్లో ప్రకృతి విలయం సృష్టించడంతో హిమాలయ పర్వతలోయలో, నేపాల్‌లో ఒకరు మరణించారు. మరో 17 మంది గల్లంతయ్యారు. 11 మంది చైనా ప్రజలు వరదల్లో గల్లంతయ్యారు. చైనాలో పనిచేస్తున్న నిర్మాణ కార్మికులు ఆరుగురు నేపాల్ వైపు వరదల్లో కొట్టుకుపోయారు. మొత్తంగా చూస్తే ఆ పరిహద్దు ప్రాంతంలో 28 మంది గల్లంతయ్యారు. వారి కోసం గాలిస్తున్నారు. మరోవైపు సహాయ కార్యక్రమాలు కూడా ముమ్మరంగా జరుగుతున్నాయి. చైనా—నేపాల్‌ను కలుపుతూ భోటేకోషి ప్రాంతంలో నిర్మించిన ప్రధాన వంతెన, నదీ వరద ముంచెత్తకుండా అడ్డంగా కట్టిన గోడ కూడా వరద ఉద్ధృతికి కొట్టుకుపోయాయి. వాతావరణ మార్పుల కారణంగా జూన్ నుండి సెప్టెంబరు వరకూ భారీ వర్షాలు, వరదలు, కొండచరియలు విరిగిపడటం వంటివన్నీ ఆసియాదేశాలలో సాధారణంగా మారుతున్నాయి. ఈ జూలై నెలలో ప్రకృతి విలయాలపట్ల అప్రమత్తంగా ఉండాలని నేపాల్ ప్రభుత్వ వాతావరణ విభాగం ప్రజలకు హెచ్చరిక చేసింది.

**100 దాటేసిన టెక్సాస్ వరద మృతులు**

టెక్సాస్‌లోని కెర్ కౌంటీలో సంభవించిన వరద విలయంలో మృతులసంఖ్య 100దాటినట్లు అధికారులు ధృవీకరించారు. వందలమంది సహాయ బృందాలు ఐదోరోజు మంగళవారంనాడు కూడా ముమ్మర గాలింపు చర్యలు కొనసాగించాయి. మృతుల్లో 27 మంది సమ్మర్ క్యాంప్‌కు వచ్చిన 12 ఏళ్ళలోపు బాలికలు ఉన్నారు. దెబ్బతిన్న ప్రకృతి సమతౌల్యానికి చిహ్నంగా గురువారంనాడు రాత్రి ప్రారంభమైన ఆకస్మిక భారీ వర్షాలు, నదీ వరద ముప్పు నుండి ప్రజలను అప్రమత్తం చేయడంలో స్థానిక ప్రభుత్వం విఫలమైంది. గ్వాడలుపే నది ఒడ్డున ఏటా నిర్వహించే ప్రఖ్యాత మైస్టిక్ సమ్మర్ క్యాంప్‌లో 750మందికిపైగా 14 ఏళ్ళలోపు బాలికలు పాల్గొంటున్న సమయంలో తెల్లవారుజామున భారీ వర్షాలవల్ల 45 నిమిషాల వ్యవధిలోనే గ్వాడాలుపే నది నీటి మట్టం26 అడుగులు ఎత్తు పెరిగింది. నది గట్టు తెంచుకుని ప్రవహించడంతో వరద బీభత్సమై నివాసాలను ముంచేసింది. ఈస్ట్‌ల్యాండ్‌కు చెందిన క్యాంప్ డైరెక్టర్ రిచర్డ్ డిక్‌సహా అనేకమంది యువ క్యాంపర్లు, ఫుట్‌బాల్ కోచ్‌లు, ఉపాధ్యాయులు మరణించినవారిలో ఉన్నారు.

# మరాఠీ 'అస్మిత' కోసం ర్యాలీ



**థానె :** థానే జిల్లాలోని మీరా భయాందర్ ప్రాంతంలో మరాఠీ 'అస్మిత' (గర్వం)ను సమర్థించడానికి ఎంఎంఎన్, కొన్ని సామాజిక సంఘాలు మంగళవారం నిర్వహించిన మోర్చాలో వందలాది మంది పాల్గొన్నారు. మరాఠీ మాట్లాడనందుకు ఒక దుకాణదారుడిపై దాడి తర్వాత రాజకీయ వేడి రగులుకుంది. వీధుల్లో తీవ్ర నాటకీయ పరిణామాల చోటు చేసుకోగా నిరసనలో శివసేన (యుబిటి), ఎన్‌సిపి (ఎస్‌పి) నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. అయితే అనేక మంది కార్యకర్తలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మధ్యాహ్నం నిరసన స్థలాన్ని శివసేన మంత్రి ప్రతాప్ సర్నాయక్ సందర్శించగా, అప్పటికే ఆగ్రహంతో ఉన్న ప్రదర్శనకారులు మంత్రిని అడ్డుకుని అక్కడి నుంచి తరిమికొట్టారు. శాంతిభద్రతలకు ముప్పు ఉందని పేర్కొంటూ పోలీసులు నిరసన ప్రదర్శనకు అనుమతి నిరాకరించారు. అయితే, వీధుల్లో తీవ్ర నాటకీయత, స్పష్టమైన రాజకీయ జోక్యం తర్వాత, నిర్వాహకులు ప్రతిపాదించిన అసలు మార్గం గుండా మోర్చ వెళ్ళింది. మరాఠీ మాట్లాడనందుకు ఎంఎన్‌ఎస్ కార్యకర్తలు ఫుడ్ స్టాల్ యజమానిని చెంపదెబ్బ కొట్టడాన్ని నిరసిస్తూ వ్యాపారులు ఇటీవల నిర్వహించిన నిరసనను ఎదుర్కోవడానికి ఎంఎన్‌ఎస్, ఇతర మరాఠీ అనుకూల గ్రూపు ఈ ర్యాలీ నిర్వహించాయని అధికారులు తెలిపారు. 'మరాఠీ అస్మిత' (గర్వం)ను కాపాడాలని నినాదాలు చేస్తున్న నిరసనకారులను పోలీసులు అదుపులోకి తీసుకోవడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. మీడియాతో మాట్లాడుతుండగా వారిలో కొందరిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మరికొందరిని అర్ధరాత్రి నుండే అదుపులోకి తీసుకున్నారు. పోలీసుల తీవ్ర చర్యకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తున్న మహిళలను పోలీసు వ్యాన్లలోకి లాక్కెళ్లిన చిత్రాలను టెలివిజన్ ఛానెల్‌లు ప్రసారం చేశాయి. నిరసన వేదిక వద్దకు చేరుకోకుండా నిరోధించడానికి అనేక మంది కార్యకర్తలను విందు హాలులో అదుపులోకి తీసుకున్నారు. వీధుల్లో హై డ్రామా జరుగుతుండగా, మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ రాజకీయ నష్టాన్ని అరికట్టడానికి చర్యలకు ఉపక్రమించారు. ర్యాలీకి అనుమతి మంజూరు చేశామని, అయితే శాంతిభద్రతలకు సవాళ్లను కలిగించే నిర్దిష్ట మార్గంలో ఎంఎన్‌ఎస్ పట్టుబట్టిందని ఆయన చెప్పారు. తన మార్గం కోసం అనుమతి కోరితే తాము తప్పకుండా అనుమతి ఇచ్చేవారిమన్నారు. పోలీసులు ఆమోదించిన మార్గంలో మరొక సంస్థ ర్యాలీ నిర్వహించిందన్నారు. అయితే వీరు కూడా అదే మార్గంలో ర్యాలీ చేస్తామని పట్టుబట్టినట్లు సిఎం పేర్కొన్నారు. మరాఠీ ఉద్యమానికి మద్దతు వెల్లువెత్తడంతో శివసేన మంత్రి ప్రతాప్ సర్నాయక్ పోలీసులను అనధికారిక చర్యల కోసం ఉపయోగించారు, ఇది ఏ ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా లేకపోవడం గమనార్హం. 'పోలీసుల చర్య పూర్తిగా తప్పు. మరాఠీ ప్రయోజనాలకు మద్దతుగా శాంతియుత మోర్చాను అణచివేయడానికి ప్రభుత్వం అలాంటి సూచనలను జారీ చేయలేదు' అని సర్నాయక్ విలేకరులతో అన్నారు. ముఖ్యమంత్రితో ఈ విషయాన్ని చర్చిస్తానని చెప్పారు. ఇదిలా ఉండగా, నిరసనకారులు బాలాజీ స్క్వేర్ నుండి మీరా రోడ్ రైల్వే స్టేషన్ ముందు ఉన్న మేజర్ కౌస్తుభ్ రాణే స్మారక చిహ్నం వరకు ప్రజలు ప్రధాన వీధుల గుండా శాంతియుతంగా ర్యాలీ చేశారు. మరాఠీ మాట్లాడనందుకు భయాందర్ ప్రాంతంలోని ఫుడ్ స్టాల్ యజమానిని ఎంఎన్‌ఎస్ కార్యకర్తలు చెంపదెబ్బ కొట్టిన తర్వాత, మహారాష్ట్రలోని ప్రాథమిక పాఠశాలల్లో భాష 'విధించడం'పై వివాదం పురపాలక ఎన్నికలకు ముందు ఒక ప్రధాన రాజకీయ ఉద్రిక్తతగా మారింది.

### భారత ప్రధాని మోదీ
# మౌనం వీడేది ఇంకెప్పుడు ?

### కాంగ్రెస్ పార్టీ ప్రధానకార్యదర్శి జైరామ్ రమేశ్



**న్యూఢిల్లీ :** భారతదేశం, పాకిస్థాన్ మధ్య 'కాల్పుల విరమణ' ప్రస్తావనను అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కనీసం 21వ సారి పునరావృతం చేశారని, ఈ అంశంపై భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తన మౌనాన్ని ఇంకెప్పుడు వీడతారని మంగళవారం కాంగ్రెస్ పార్టీ ప్రశ్నించింది. డోనాల్డ్ ట్రంప్ సోమవారం తన వ్యాఖ్యలలో, ఒకవేళ రెండు పొరుగు దేశాలు ఇంకా యుద్ధం కొనసాగిస్తామంటే వాషింగ్టన్ వారితో వ్యాపారం చేయదని చెప్పడం ద్వారా భారతదేశంపాకిస్థాన్ మధ్య యుద్ధాన్ని తానే ఆపాననే వాదనను పునరావృతం చేశారని కాంగ్రెస్ గుర్తుచేసింది. కాంగ్రెస్ ప్రధానకార్యదర్శి ఇన్‌చార్జి కమ్యూనికేషన్స్ జైరామ్ రమేశ్ మాట్లాడుతూ గత 59 రోజుల్లో అమెరికా అధ్యక్షుడు ట్రంప్ చేసిన వ్యాఖ్యలలో 'కనీసం భారత్ పాక్ మధ్య మేలో నాలుగు రోజులపాటు జరిగిన యుద్ధం అణుసంఘర్షణగామారబోతున్న సమయంలో నేనే ఆపానని ఆయన కనీసం 21సార్లు ఆ వ్యాఖ్యలను పునరావృతం చేశారు' అని చెప్పారు. భారత్‌పాక్ మధ్య అణు సంఘర్షణకు దారితీస్తున్న సమయంలో అమెరికా ఇరుదేశాల మధ్య కాల్పుల విరమణకు బుజ్జగించో, బెదిరించో అంగీకరింపజేసినట్లు అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ స్వయంగా చెప్పారని జైరామ్ రమేశ్ వివరించారు. 'వేరే మాటల్లో చెప్పాలి అంటే ఆయన సందేశం...వెంటనే ఈ యుద్ధాన్ని ఆపండి లేదా అమెరికన్ మార్కెట్లు ( మరియు బహుశా పెట్టుబడులను) కోల్పోయే నిజమైన అవకాశాలను ఎదుర్కోండి' అని ఆయన చెప్పారు. ఇండియాపాకిస్థాన్‌లతో అమెరికా ఒప్పందం అతిత్వరలో ప్రకటించబడుతుందని అధ్యక్షుడు ట్రంప్ ఊదరగొట్టారని జైరామ్ రమేశ్ తెలిపారు. ఒకప్పుడు తన సీనియర్ కొలీగ్ ఘన్‌శ్యామ్ తివారీ దీనిని 'బిజెపి ట్రంప్ కార్డు' అని అభివర్ణించినప్పటికీ నరేంద్రమోదీ ఈ అంశంపై ఎప్పుడు మౌనం వీడతారని కాంగ్రెస్ ప్రధానకార్యదర్శి ప్రశ్నించారు. భారత్‌తో వాణిజ్య ఒప్పందాన్ని కుదుర్చుకోవడానికి అమెరికా దగ్గర అవుతోందని సోమవారం డోనాల్డ్ ట్రంప్ చెప్పిన విషయం తెలిసిందే. 'ఇప్పుడు మేం యునైటెడ్ కింగ్‌డంతో ఒక ఒప్పందాన్ని కుదుర్చుకున్నాం. చైనాతో కూడా ఒప్పందం కుదుర్చుకున్నాం. భారత్‌తో కూడా ఒప్పందం కుదుర్చుకునేందుకు దగ్గరగా ఉన్నాం. ఇతరులను కూడా మేం కలిసినా వారితో మేం ఒక ఒప్పందం కుదుర్చుకోబోతున్నాం అని మేం అనుకోవడం లేదు. మేం కేవలం వారికి ఒక లేఖను మాత్రమే పంపించాం. మీరు ఒక వేళ బంతితో ఆట ఆడాలనుకుంటే మీరు చేయాల్సింది ఇదే' అని ట్రంప్ సోమవారం చెప్పారు. మే 10నుంచి ట్రంప్ అనేక సార్లు భారతదేశంపాకిస్థాన్ మధ్య ఉద్రిక్తతలను పరిష్కరించుకునేందుకు వారికి తానే సహాయపడ్డానని పదేపదే చెబుతూ వచ్చారని జైరామ్ రమేశ్ గుర్తుచేశారు.



# జనరల్
STATE & REGIONAL NEWS

## జిల్లాకో నవోదయపై వివరణ ఇవ్వండి

**ప్రజాపక్షం / హైదరాబాద్ :** రాష్ట్రంలో కొత్తగా ఏర్పాటు చేసిన జిల్లాల్లో జవహర్ నవోదయ పాఠశాల ఏర్పాటు చేయాలంటూ దాఖలైన పిటిషన్‌లో కౌంటర్ దాఖలు చేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు హైకోర్టు నోటీసులు జారీ చేసింది. రాష్ట్రంలోని 23 జిల్లాల్లో ప్రతి జిల్లాకు ఒక నవోదయ పాఠశాలలను ఏర్పాటుచేసేలా ఆదేశాలు జారీ చేయాలని కోరుతూ బిఆర్‌ఎస్ మాజీ ఎంపీ వినోద్‌కుమార్ వేసిన పిల్‌ను యాక్టింగ్ చీఫ్ జస్టిస్ సుజయ్‌పాల్, జస్టిస్ యారా రేణుకలతో కూడిన బెంచ్ మంగళవారం విచారించింది. తెలంగాణలో తొమ్మిదే నవోదయ పాఠశాలలు ఉన్నాయని, మరో 7 పాఠశాలల ఏర్పాటుకు కేంద్రం అంగీకారం చెప్పినా అమలు కాలేదని పిటిషనర్ వాదన. నోయిడాలోని నవోదయా విద్యాలయ సమితి అడ్మిషన్ల ప్రక్రియ కోసం ఇచ్చిన నోటిఫికేషన్‌లో తెలంగాణలో పాత 9 పాఠశాలలు ఉన్నాయన్నారు. 500 మందికి పైగా అడ్మిషన్లు రాకుండాపోతాయన్నారు. విచారణ వారం రోజులకు వాయిదా పడింది.

## దాడి హేయమైన చర్య

### దేవాదాయ ఉద్యోగుల జెఎసి

**ప్రజాపక్షం/హైదరాబాద్:** భద్రాచలం దేవాలయం భూములను రక్షించేందుకు ప్రయత్నించిన ఆలయ ఈవో రమాదేవితో పాటు సిబ్బందిపై జరిగిన దాడిని అర్చక ఉద్యోగుల ఐక్య కార్యాచరణ సమితి ( జెఎసి) తీవ్రంగా ఖండించింది. దాడి జరిపిన వారిపై తగు చర్యలు వెంటనే తీసుకోవాలని జెఎసి అధ్యక్షులు (అర్చక) సిహెచ్ బద్రినాథచార్యులు, కన్వీనర్ రవీంద్రాచార్యులు, ఉద్యోగుల సంఘం అధ్యక్షులు కాందూరు సమాచారం, మీరు ఏమని పెట్టాలి కార్యనిర్వాణా అధికారి గుమ్మడిదల ఉద్యోగుల సంఘం ప్రధాన కార్యదర్శి మిక్కిలినేని సురేష్, సుధాకర్ వర్కింగ్ ప్రెసిడెంట్ జి, చంద్రశేఖర్, రిటైర్డ్ అసిస్టెంట్ కమిషనర్ సురేందర్, సురేష్‌లు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

## సమ్మెకు ప్రభుత్వ ఉద్యోగ సంఘాల జెఎసి మద్దతు

### నేడు గన్‌పార్క్ వద్ద నిరసన కార్యక్రమం

**ప్రజాపక్షం/హైదరాబాద్:** కేంద్ర, రాష్ట్ర ఇతర కార్మిక సంఘాలు బుధవారం తలపెట్టిన దేశ వ్యాప్త సమ్మెకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల, గెజిటెడ్, అధికారుల, ఉద్యోగుల వర్కర్స్, పెన్షనర్ల జాయింట్ యాక్షన్ కమిటీ (టిజిఇజెఎసి) మద్దతు తెలిపింది. హైదరాబాద్, గన్‌పార్‌లోని అమర వీరుల స్తూపం వద్ద బుధవారం మధ్యాహ్నం 1 గంటకు పెద్ద ఎత్తున నిరసన ప్రదర్శన నిర్వహించనున్నట్టు టిజిఇజెఎసి ఛైర్మన్ మారం జగదీశ్వర్, సెక్రటరీ జనరల్ ఏలూరి శ్రీనివాస రావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్య క్రమంలో హైదరాబాద్‌కు చెందిన ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని వారు పిలుపునిచ్చారు

## టూరిజం ఎండికి సమస్యలు విన్నవించుకున్న తాత్కాలిక ఉద్యోగులు



**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణ టూరిజంలో కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ ఎదుర్కొంటున్న పలు సమస్యలను నేతలు టూరిజం ఎండి వల్లూరు క్రాంతిని మంగళవారం కలిసి వివరించారు. ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని, ఉద్యోగుల సమాన పనికి సమాన వేతనం అమలు చెయ్యాలని, అలాగే ఉద్యోగుల రిటైర్డ్‌మెంట్ వయస్సు 61 సంవత్సరాలు పెంచాలని టూరింజం కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ (ఎఐటియుసి) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సబ్బు రాజమౌళి, ఉడుత రమేష్, గోపి, మౌలాలి, శ్రీనివాస్ రెడ్డి, నాజర్ అలీ,సి.ఎస్. రాజయ్య, అజ్మీయా, చంద్రమౌళి, విష్ణులు ఎండిని కోరారు. తమ సమస్యలపై ఎండి క్రాంతి అనుకూలంగా స్పందించారని నేతలు తెలిపారు.

## బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు ఇచ్చాకే

# స్థానిక సంస్థల ఎన్నికలు

### టిపిసిసి బి.మహేష్‌కుమార్ గౌడ్



**ప్రజాపక్షం/హైదరాబాద్:** బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు ఇచ్చాకే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలనేది కాంగ్రెస్ పార్టీ ఆలోచన అని టిపిసిసి బి.మహేష్‌కుమార్ గౌడ్ చెప్పారు. బిసి రిజర్వేషన్లపై న్యాయ నిపుణులతో చర్చలు జరుపుతున్నామని ఆయన వెల్లడించారు. మంత్రి పదవుల అంశం తన పరిధిలో లేదని, రాజకీయాల్లో ఒక్కో సారి జూనియర్‌లకు ముందుగా అవకాశాలు వస్తాయని, సీనియర్ నాయకులను సైతం పార్టీ గుర్తిస్తుందన్నారు. ఆపరేషన్ ఆకర్ష్ లైవ్‌లోనే ఉందన్నారు. గాంధీభవన్‌లో మంగళవారం తనను కలిసిన మీడియా ప్రతినిధులతో ఆయన ఇష్టాగోష్టిగా మాట్లాడుతూ ప్రజల సమస్యలపై మాట్లాడాలంటే అసెంబ్లీ ఉందని, అసెంబ్లీలో ప్రతి పక్షాలకే ప్రభుత్వం ఎక్కువ సమయం ఇస్తున్నదని అన్నారు. తాను స్పందించే అంత స్థాయి బిఆర్‌ఎస్ నేత కెటిఆర్‌ది కాదని పేర్కొన్నారు. యూరియా సరఫరాను పెంచింది కాంగ్రెస్ ప్రభుత్వమని, బిఆర్‌ఎస్ యూరియా కరువు అంటూ అబద్దాలు చెబుతున్నదన్నారు. రాష్ట్రంలో ఎక్కడ ఉప ఎన్నికలు వచ్చినా అందుకు కాంగ్రెస్ పార్టీ సిద్ధంగా ఉందని, జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో కాంగ్రెస్ గెలుస్తుందని, సర్వేల్లో మంచి ఫలితాలు వచ్చాయన్నారు. జూబ్లీహిల్స్ లో పోటీ చేసేందుకు వేరే పార్టీ నుండి ఎందుకు అభ్యర్థిని తీసుకుంటామని,10 మంది సమర్థులైన కాంగ్రెస్ నాయకులు పోటీ చేసేందుకు సిద్ధంగా ఉన్నారని మహేష్‌కుమార్ అన్నారు. అనిరుద్ రెడ్డి అంశంలో మల్లు రవి విచారణ చేస్తున్నారని మహేష్‌కుమా ర్ చెప్పారు. తీన్మార్ మల్లన్న కులగణ పత్రాలు తగులబెట్టారని ఆరోపణలు చేసినందునే చర్యలు తీసుకున్నామని, తీన్మార్ మల్లన్న ఎపిసోడ్ వేరు అనిరుద్ అంశం వేరన్నారు. కాంగ్రెస్ పార్టీలో స్వేచ్ఛ ఎక్కువని, అందుకే నిరసనలు చేస్తున్నారన్నారు.

#### ఈనెల 15వ తేదీలోగా కొత్త డిసిసి కమిటీలు

ఈనెల 15వ తేదీలోగా కొత్త డిసిసి కమిటీలు ఏర్పడుతాయని, డిసిసిల కమిటీ కోసమే సీనియర్ ఇంచార్జిలను నియమించామని, డిసిసిల కమిటీ ప్రక్రియ పూర్తి అనంతరం త్వరలో డిసిసి అధ్యక్షుల నియామకం జరుగుతుందన్నారు. ఎఐసిసి పరిశీలకులు త్వరలో రాష్ట్రానికి వస్తారని, ఈ నెల చివరి వరకు అన్ని కమిటీలు పూర్తి అవుతాయన్నారు.

## సిగాచి పరిశ్రమను అధ్యయనం చేసిన ఎన్‌డిఎంఎ కేంద్ర బృందం



**ప్రజాపక్షం/సంగారెడ్డి ప్రతినిధి :** సిగాచి పరిశ్రమ ప్రమాద స్థలాన్ని నిశితంగా ఎన్‌డిఎంఎ కేంద్ర బృందం అధ్యయనం చేసింది. ఇటీవల భారీ ప్రమాదం జరిగిన పాశమైలారం పారిశ్రామిక వాడలోని సిగాచి ఫార్మా కంపెనీ మంగళవారం జాతీయ విపత్తు నివారణ సంస్థ బృందం సందర్శించింది. ఈ సందర్భంగా ఎన్‌డిఎంఎ కేంద్ర బృందం కమిటీ సభ్యులు సిగాచి పరిశ్రమలో ప్రమాదం జరగడానికి గల కారణాలపై నిశితంగా అధ్యయనం చేశారు. పరిశ్రమలో జరిగిన భారీ ప్రమాదానికి గల కారణాలు అధ్యయనం చేయడంతో పాటు ఇలాంటి సంఘటనలు పరిశ్రమలలో పునరావృతం కాకుండా చేపట్టాల్సిన చర్యలపై కేంద్ర ప్రభుత్వం నిర్వహణ సంస్థ కమిటీ సభ్యులు సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా అధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా సంఘటన జరిగిన తీరును బృందం సభ్యులకు వివరించారు. ప్రమాదం జరిగిన తరువాత చేపట్టిన సహాయక చర్యలను కమిటీ సభ్యులకు వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ పి.ప్రవీణ్య, జిల్లా ఎస్పీ పరితోష్ ఫంకజ్ ,పరిశ్రమల శాఖ అగ్ని మాపక శాఖ కార్మిక శాఖ ,పోలీసు ,రెవెన్యూ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## 'ప్రకాష్ జాతీయ సర్వేక్షణ్' ఫలితాల్లో తెలంగాణ మెరుగైన ప్రతిభ

**ప్రజాపక్షం/హైదరాబాద్:** కేంద్ర ప్రభుత్వం విడుదల చేసి న 'ప్రకాష్ జాతీయ సర్వేక్షణ్( పిఆర్‌ఎస్) 2024 ఫలితాల్లో తెలంగాణ రాష్ట్రం మెరుగైన ప్రతిభను కనబర్చింది. 2021 సంవత్సరఎన్‌ఎఎస్ సర్వేలో (ప్రస్తుత పిఆర్‌ఎస్) సర్వేతో పోలిస్తే పది శాతం మెరుగుపడింది. 3వ తరగతి లో రాష్ట్ర ర్యాంకు 36వ స్థానం నుంచి 26వ స్థానాని రా గా, 6వ తరగతిలో 26వ స్థానం, 9వ తరగతిలో 17వ స్థా నంలో నిలిచింది. 3వ తరగతి ప్రభుత్వ పాఠశాల విద్యార్థు లు,ప్రైవేటు పాఠశాలల విద్యార్థుల కంటే కూడా మంచి ప్రతిభను కనబర్చారు. గత ఏడాదితో పోలిస్తే తెలంగాణ రాష్ట్ర విద్యార్థులు తమ సామర్థ్యాన్ని మరింత మెరుగుపర్చుకున్నట్టు పిఆర్ ఎస్ 2024 సర్వే స్పష్టం చేసింది. కాగా 3వ,6వ,9వ తరగతులలో దేశ వ్యాప్తంగా 50 జిల్లాల్లో జనగామ జిల్లా విద్యార్థులు ప్రతిన కనబర్చారు. 3వ, 6వ, 9వ తరగతులలోని విద్యార్థులకు తెలుగు, గణితం, సైన్స్, సాం ఘిక శాస్త్రం వంటి ప్రధాన విషయాల్లో దేశ వ్యాపితంగా పరీక్షలు నిర్వహించారు. ఈ పరీక్షలో తెలంగాణ రాష్ట్రం నుంచి 33 జిల్లాల్లో 3,342 పాఠశాలలు పాల్గొన్నాయి. 3వ తరగతి (తెలుగు, గణితం),6వ తరగతి (తెలుగు, గణి తం, 'మన చుట్టూ ప్రపంచం') విషయాలలో 2021 సర్వేతో పోలిస్తే 10 శాతం మెరుగుపడింది. విద్యార్థులల్లో గణనీయమైన అభివృద్ధిని సూచిస్తోందని తెలంగాన విద్యాశాఖ అధికారులు అంచనా వేశారు. దేశ వ్యాప్తంగా గ్రేడ్ 3లో అత్యున్నత సామర్థ్యం కనబర్చిన 50 జిల్లాల్లో తెలంగాణ రాష్ట్రం నుంచి జనగామ జిల్లా 16వ స్థానంలో నిలువగా, తక్కువ సామర్థ్యం కనబర్చిన 50 జిల్లాల్లో వనపర్తి జిల్లా 14వ స్థానంలో నిలిచింది. గ్రేడ్ 6లో అత్యున్నత సామర్థ్యం కనబర్చిన 35వ స్థానంలో జనగాం, తక్కువ సామర్థ్యం కనబ్చరిన 50 జిల్లాల్లో భద్రాద్రి కొత్త గూడెం 37వ స్థానం, ములుగు 47వ స్థానంలో ఉన్నది. గ్రేడ్ 9లో అత్యున్నత సామర్థ్యం కనబర్చిన 33వ స్థానంలో జనగాం నిలిచింది.

## టిపిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్‌గౌడ్‌తో ఎంఎల్‌సి కోదండరామ్ భేటీ



**ప్రజాపక్షం/హైదరాబాద్:** కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను,చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని టిపిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్‌గౌడ్ టిజెఎస్ ప్రతినిధులను కోరారు. టిజెఎస్ అధ్యక్షుడు, ఎంఎల్‌సి ప్రొఫెసర్ ఎం. కోదండరామ్ ఆధ్వర్యంలో టిజెఎస్ ప్రతినిధులు హైదరాబాద్‌లోని సిఎల్‌పి కార్యాలయంలో మహేష్ కుమార్ గౌడ్‌తో మంగళవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా తాజా రాజకీయాయలు, ప్రభుత్వ పనితీరు, తదితర అంశాలు వారి మధ్య చర్చకు వచ్చాయి. ఈ సందర్భంగా మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వం ఉద్యమకారులను గౌరవించి ఆదుకుంటుందన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్, టిజెఎస్ కలిసి పనిచేయాలని, ఇరు పార్టీల అభ్యర్థుల గెలుపు కోసం పని చేయాలని సూచించారు. ఈ సమావేశంలో టిజెఎస్ నాయకులు గోపగాని శంకర్ రావు, పల్లె వినయ్ కుమార్,ఆశప్ప, సర్దార్ వినోద్ కుమార్, హనుమంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## నా గోల్డ్ ఇవ్వండి : గాలి

**ప్రజాపక్షం / హైదరాబాద్ :** ఓబుళాపురం అక్రమ మైనింగ్ కేసు దర్యాప్తు సమయంలో తన నుంచి సిబిఐ అధికారులు స్వాధీనం చేసుకుని జప్తు చేసిన 57కుపైగా కిలోల బంగారాన్ని తిరిగి ఇప్పించాలని గాలి జనార్దన్ రెడ్డి హైకోర్టును ఆశ్రయించారు. పిటిషనర్‌కు జైలు శిక్ష విధిస్తూ సిబిఐ కోర్టు మే 6న తీర్పు చెప్పింది. స్వాధీనం చేసుకున్న గోల్డ్ ఇప్పించాలని తాజాగా పిటిషన్ వేశారు. సిబిఐకి నోటీసులు ఇచ్చిన హైకోర్టు విచారణను 23వ తేదీకి వాయిదా వేసింది.

## నిరసనకారులపై కేసు కొట్టేసిన హైకోర్టు

**ప్రజాపక్షం / హైదరాబాద్ :** పోలీసు రిక్రూట్‌మెంట్‌లో అవకతవకలు జరిగాయంటూ పోలీసు కమాండ్ కంట్రోల్ సెంటర్ వద్ద ఆందోళన చేసిన 16 మందిలో కోర్టుకు వచ్చిన పది మందిపై పోలీసు కేసును హైకోర్టు కొట్టేసింది.ఎఫ్‌ఐఆర్‌ను కొట్టివేయాలంటూ కె.మహేష్ సహా పది మంది వేసిన పిటిషన్లను అనుమతిస్తూ జస్టిస్ లక్ష్మణ్ తీర్పు చెప్పారు. నిరసనలో భాగంగానే ట్రాఫిక్ అంతరాయం ఏర్పడిందేగానీ కావాలని ఎవరినీ అడ్డుకోలేదని చెప్పారు.

## రుణాలపై కేసు సివిల్ కోర్టులో తేల్చుకోవాలి

**ప్రజాపక్షం / హైదరాబాద్ :** జనం ఒకరికొకరు ఇచ్చిపుచ్చుకునే రుణాలపై ఏర్పడే వివాదాలను పోలీస్ స్టేషన్లల్లో పరిష్కారం కాబోవని, అవి సివిల్ వివాదాలని హైకోర్టు స్పష్టం చేసింది. రుణ ఎగవేత ఫిర్యాదులను పోలీసులు విచారణ మొదలు పెడితే చివరికి అవి కమీషన్లు తీసుకునే పరిస్థితులు, అలాంటి ఆరోపణలకు ఆస్కారం ఏర్పడుతుందని చెప్పింది. సైనిక్‌పురికి చెందిన పి.దినేష్ రుణంగా డబ్బు తీసుకుని ఎగవేశారంటూ పోలీసులకు ఫిర్యాదు చేస్తే ఫలితం లేదంటూ హైదరాబాద్‌కు చెందిన వి.సతీష్‌కుమార్ వేసిన పిటిషన్‌ను జస్టిస్ వినోద్‌కుమార్ కొట్టేశారు.లాయర్ పిటిషన్‌ను ఉపసంహరణకు అనుమతిస్తూ కొట్టివేశారు.

## బిజెపి ఎమ్మెల్యేకు ఐటి నోటీసు రద్దు

**ప్రజాపక్షం / హైదరాబాద్ :** బిజెపికి చెందిన ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి 2019 ఆదాయపు పన్ను మదింపు వ్యవహారంపై 2021 చట్టం కింద నోటీసులు ఇవ్వడాన్ని హైకోర్టు తప్పుపట్టింది. రాకేష్ రెడ్డి వేసిన పిటిషన్‌ను జస్టిస్ పి.శ్యాంకోశీ, జస్టిస్ ఎన్. నర్సింగ్‌రావులతో కూడిన డివిజన్‌బెంచ్ అనుమతిచ్చింది. ఐటీ శాఖ నోటీసును రద్దు చేసింది.



## 'సిఎం ప్రజావాణి'ని సందర్శించిన మధ్యప్రదేశ్ డిప్యుటీ కలెక్టర్ల బృందం

**ప్రజాపక్షం/హైదరాబాద్:** జ్యోతిబా పూలే ప్రజా భవన్‌లో మంగళవారం నిర్వహించిన 'ముఖ్యమంత్రి ప్రజావాణి, ప్రవాసి ప్రజావాణి'ని మధ్యప్రదేశ్ రాష్ట్ర డిప్యుటీ కలెక్టర్ల బృందం మంగళవారం సందర్శించింది. 'సిఎం ప్రజావాణి, ప్రవాసి ప్రజావాణి' పని తీరు చాలా బాగుందని, ఇటువంటి విధానాన్ని మధ్యప్రదేశ్ రాష్ట్రంలోనూ అమలు చేసేందుకు తమ రాష్ట్ర ఉన్నత అధికారులకు సిఫార్సు చెస్తామని మధ్యప్రదేశ్ డిప్యూటీ కలెక్టర్ల ప్రతినిధి బృందం తెలిపింది. ఈ సందర్భంగా మధ్యప్రదేశ్ డిప్యుటీ కలెక్టర్ల ప్రతినిధి బృందం సిఎం ప్రజావాణి ఇన్‌చార్జ్, రాష్ట్ర ప్రణాళిక సంఘం వైస్ చైర్మన్ డాక్టర్ జి. చిన్నారెడ్డి, స్టేట్ నోడల్ అధికారి దివ్య దేవరాజన్‌లతో భేటీ అయ్యారు. సిఎం ప్రజావాణికి సంబంధించిన వివరాలను వారు అడిగి తెలుసుకున్నారు. సిఎం ప్రజావాణి సమస్యల పరిష్కార వేదిక అని, ఇది ఇతర రాష్ట్రాలకు స్ఫూర్తినిచ్చే కార్యక్రమం అని వారు అభినంధించారు.



హైదరాబాద్‌లో జరుగుతున్న ఎఐఎస్‌ఎఫ్ హిందీ జాతీయ శిక్షణా తరగతులలో క్లాస్ బోధించడానికి వచ్చిన ప్రొఫెసర్ రామేశ్వర్ దాస్‌కు గుండెపోటు రావడంతో హుటాహుటిన కామినేని హాస్పిటల్‌కు తరలించారు. వెంటనే వైద్యం చేసి స్టంట్ వేయడంతో ప్రొఫెసర్ ప్రాణాపాయ స్థితి నుంచి బయటపడ్డారు. హాస్పిటల్‌లో కోలుకుంటున్న వారిని సిపిఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, సిపిఐ జాతీయ సమితి సభ్యులు పల్లా వెంకట్‌రెడ్డి పరామర్శించి, త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

## కల్తీకల్లు తాగి 15 మంది ఆసుపత్రిపాలు

### ఒకరి పరిస్థితి విషమం, కూకట్‌పల్లిలోని హైదర్ నగర్‌లో ఘటన



**హైదరాబాద్ :** కూకట్‌పల్లిలోని హైదర్ నగర్‌లో కల్తీ కల్లు తాగిన పలువురు ఆస్పత్రి పాలయ్యారు. స్థానికంగా ఉన్న కల్లు కాంపౌండ్స్‌లో మంగళవారం కల్లు తాగిన వాళ్లలో నలుగురు మహిళలు సహా 15 మంది తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. విరేచనాలు, లో బిపితో ఇబ్బంది పడిన వారికి ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స అందిస్తున్నారు. ఒకరి పరిస్థితి విషమంగా ఉన్నట్టు వైద్యులు తెలిపారు. సదరు హాస్పిటల్ సిబ్బంది కల్తీ కల్లు బాధితుల గురించి జిహెచ్ఎంసి ఎంహెచ్ఒకు సమాచారం అందించారు. విషయం తెలిసిన వెంటనే అక్కడకు చేరుకున్న బిఆర్ ఎస్ ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు బాధితులను పరామర్శించి, చికిత్స వివరాలను తెలుసుకున్నారు. బాలానగర్ డిసిపి, కూకట్‌పల్లి ఎసిపిలు సైతం బాధితులను నుంచి వివరాలు సేకరించారు.

## బిజెపి డిఎన్‌లోనే బిసి వ్యతిరేకత : కవిత



**ప్రజాపక్షం/హైదరాబాద్:** బిసిలకు 42 శాతం రిజర్వేషన్ బిల్లును ఆమోదించకపోతే తెలంగాణ రాష్ట్రంలోని రెండున్నర కోట్ల బిసిలు బిజెపికి తగిన గుణపాఠం చెబుతారని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎంఎల్‌సి కల్వకుంట్ల కవిత హెచ్చరించారు. బిజెపి డిఎన్‌లోనే బిసి వ్యతిరేకత ఉన్నదన్నారు. ఈ నెల17న జరగనున్న 'రైల్ రోకో' కేవలం ఒక ట్రైలర్ మాత్రమేనని, బిసి బిల్లును ఆమోదించకపోతే భవిష్యత్తులో నిరవధికంగా రైల్ రోకోను నిర్వహిస్తామని హెచ్చరించారు. బిసి రిజర్వేషన్‌ను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 17న చేపట్టనున్న 'రైల్ రోకో'కు మద్దతు ఇవ్వాలని అన్ని రాజకీయ పార్టీలకు లేఖలు రా స్తామన్నారు. స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చి రెండేళ్లు కావస్తున్నప్పటికీ రిజర్వేషన్లను అమలు చేయడంలో విఫలమైందని ఆరోపించారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 243 (డి) ప్రకారం రాష్ట్ర ప్రభుత్వమే జిఒ జారీ చేసి, పెంచిన రిజర్వేషన్లను అమలు చేయవచ్చని ఆమె రాష్ట్ర ప్రభుత్వానికి సూచించారు. ఈ విషయాన్ని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ తెలంగాగణ సిఎం రేవంత్ రెడ్డికి ఒక ఫోన్ చేసి, జివోను జారీ చేయాలని ఎందుకు సూచించలేదని ప్రశ్నించారు. తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీ ఆమోదించిన బి సి బిల్లులను రాష్ట్రపతి ఆమోదించేలా చొరవ తీసుకోవాలని ప్రధాని మోదీకి కవిత విజ్ఞప్తి చేశారు. తమిళనాడు తరహా తెలంగాణ రాష్ట్రంలో కూడా తెలంగాణ బిసి బిల్లును రాజ్యాంగంలోని 9వ షెడ్యూల్‌లో చేర్చాలని ప్రతిపాదించారు.



## శ్రీశైలం నుంచి సాగర్‌కు కృష్ణమ్మ పరుగులు



**హైదరాబాద్ /కాళేశ్వరం:** శ్రీశైలం నుంచి కృష్ణమ్మ పరుగులు మొదలయ్యాయి. ఎగువ నుంచి వారం రోజులుగా వస్తున్న ప్రవాహంతో డ్యాంలో నీటిమట్టం గరిష్ఠస్థాయికి చేరడంతో మంగళవారం నీటి వి డుదల ప్రారంభించారు. మధ్యాహ్నం ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కృష్ణమ్మకు జలహారతి ఇచ్చి రైతులతో కలిసి ప్రాజెక్టు గేట్లు ఎత్తారు. 6, 7, 8, 11 నెంబర్ గేట్ల ద్వారా విడుదలైన నీరు బిరబిరా ప్రవహిస్తూ నాగార్జున సాగర్ వైపు పరుగులు తీస్తోం ది. ఎగువ నుంచి శ్రీశైలం జలాశయానికి భారీగా వరదనీరు చేరుతోంది. జూరాల, సుంకేశుల నుం చి శ్రీశైలానికి 1,72,795 క్యూసెక్కుల వరదనీరు వస్తోందని అధికారులు తెలిపారు. అటు ఎగువన వర్షాలు, వరదతో నాగార్జున సాగర్‌కు ఇన్ ఫ్లో పెరిగింది. ఎగువ నుంచి 1,14,146 క్యూసెక్కు నీరు వస్తుంది. మధ్యాహ్నం శ్రీశైలం గేట్లు ఎత్తడంతో రాత్రికి ఇన్ ఫ్లో ఇంకా పెరిగే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. ప్రస్తుతం జలాశయంలో 171.8 టీఎంసీల నీరు ఉంది. ప్రాజెక్ట్ మొత్తం కెపాసిటీ 312 టీఎంసీలు. రెండు కాలువలకు 4590 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు.

#### కాళేశ్వరం వద్ద గోదావరి పరవళ్ళు

జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని కాళేశ్వరం త్రివేణి సంగమం వద్ద మంగళవారం గోదావరి పరవళ్ళు తొక్కుతోంది. మహారాష్ట్ర ప్రాంతాల్లో గత కొన్ని రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు ఎగువలోని ప్రాణహిత నదికి వరద ఉధృతి పోటెత్తి కాళేశ్వరం వద్ద గోదావరిలో చేరుతుండటంతో గోదావరి ఉధృత రూపం దాల్చింది. త్రివేణి సంగమం పుష్కర ఘాట్ వద్ద నీటిమట్టం స్నాన ఘట్టాలను తాకి వరద ప్రవాహం అంతకంతకు పెరుగుతుండటంతో గోదావరి జలకళ సంతరించుకుంది. కాళేశ్వరం వద్ద గోదావరిలో వరద ఉధృతి భారీగా చేరి దిగువలోని మేడిగడ్డ బ్యారేజి వైపు 1,33,830 క్యూసెక్కుల వరద నీటి ప్రవాహం కొనసాగుతోంది.

# బిఆర్‌ఎస్‌తోనే నిరుపేదలకు న్యాయం

మాజీ జడ్పీటీసీ పట్నం అవినాష్ రెడ్డి

**ప్రజాపక్షం/షాబాద్ :** బిఆర్‌ఎస్ పార్టీతోనే నిరు పేద ప్రజలకు న్యాయం జరుగుతుందని మాజీ జడ్పీటీసీ పట్నం అవినాష్ రెడ్డి అన్నారు. మంగళవారం షాబాద్ మండల కేంద్రం నుండి నగరంలోని తెలంగాణ భవన్‌కు మాజీ మంత్రి కెటిఆర్‌కు మద్దతుగా పెద్ద ఎత్తున తరలివెళ్లారు. బిఆర్‌ఎస్ నాయకులతో బయలుదేరి కెటిఆర్‌ను కలిసి సింఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా మాజీ జడ్పీటీసీ పట్నం అవినాష్ రెడ్డి మాట్లాడుతూ గత పదేళ్ల బిఆర్‌ఎస్ పాలనలో రైతులకు చేసిన మేలు గురించి సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో బహిరంగ చర్చకు వెళ్లిన కెటిఆర్‌కు తెలంగాణ రైతులు అండగా నిలుస్తున్నారని పేర్కొన్నారు. గత పాలనలో చేసిన అభివృద్ధిని, నేడు కాంగ్రెస్ పాలనలో అభివృద్ధిపై చర్చ పేడతామంటే కాంగ్రెస్ రాకపోవడం, ప్రజలపై వారికున్న వ్యతిరేకతకు గుర్తుచేస్తుందన్నారు. కార్యక్రమంలో బిఆర్‌ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు గూడూర్ నర్సింగ్ రావు, పార్టీ నాయకులు, వివిధ గ్రామాల మాజీ సర్పంచులు, మాజీ ఎంపిటిసిలు, పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# శంషాబాద్‌లో చిన్నారి కిడ్నాప్ కలకలం



**ప్రజాపక్షం/శంషాబాద్ :** శంషాబాద్‌లో ఓ చిన్నారి కిడ్నాప్ కలకలం సృష్టించింది. తల్లి వద్ద కూర్చుని ఉన్న చిన్నారిని మాటల్లో పెట్టి ఓ గుర్తుతెలియని మహిళ కిడ్నాప్ చేసిన సంఘటన మంగళవారం చోటు చేసుకుంది. శంషాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని కంత్రమోని లక్ష్మమ్మ అనే మహిళ తన ఇద్దరు పిల్లలను తీసుకుని శంషాబాద్ కల్లు కంపౌండ్‌లో కల్లు తాగుతుంది. అయితే అదే కల్లు కాంపౌండ్‌లోకి వచ్చిన గుర్తుతెలియని మహిళ లక్ష్మమ్మ కూతురు కీర్తన(6)ను ఎత్తుకెళ్లింది. తన కూతురును ఎవరో గుర్తుతెలియని మహిళ మాటల్లో పెట్టి ఎత్తుకెళ్లిద్దంటూ పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేసింది. ఈ మేరకు శంషాబాద్ ఆర్‌జిఐ పోలీసులు కేసు నమోదు చేసుకుని నిందితురాలు కోసం గాలింపు చర్యలు చేపట్టారు.

## మహిళలు అన్నిరంగాల్లో రాణించాలి

**ప్రజాపక్షం/కొందుర్గు:** మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని కొందుర్గు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఎ.కృష్ణారెడ్డి కోరారు. మంగళవారం మండల కేంద్రంలోని మహిళా సమాఖ్యలో ఇందిరా మహిళా శక్తి సంబరాలను నిర్వహించారు. కార్యక్రమంలో ఎపిఎం జయమాలిని, మహిళా సమాఖ్య అధ్యక్షురాలు ఎం.భారతమ్మ, కార్యదర్శి ఆగిర్యాల భారతమ్మ, కోశాధికారి లక్ష్మీనర్సమ్మ, సీసీలు సరళాదేవి, జంగయ్య, నర్సింలు, లక్ష్మీ, బుక్ కీపర్లు కె సుధాకర్, నాగలింగం, మహేశ్వరి, జ్యోతి, సంతోష, శ్రీనివాస్, సాయిలు, సరస్వతి, ప్రమీల తదితరులు పాల్గొన్నారు.

## రాజేంద్రనగర్ పార్క్‌స్థలంలో మట్టి దిబ్బలు తొలగించిన హైడ్రా

**ప్రజాపక్షం/గండిపేట:** పార్కు స్థలాన్ని ఆక్రమించారని ఆ స్థలంలో వెలిసిన మట్టి దిబ్బలను హైడ్రా అధికారులు తొలగించారు. అడ్డుకున్న స్థానికులను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని నలంద నగర్‌లో మంగళవారం పార్కు స్థలం అంటూ జెసిబితో అక్కడ ఉన్న మట్టి దిబ్బలను తొలగించేందుకు హైడ్రా అధికారులు ప్రయత్నించారు. స్థానికులు పెద్ద ఎత్తున అక్కడికి చేరుకొని ఆ స్థలం తమదే అని హైడ్రా అధికారులను అడ్డుకునేందుకు ప్రయత్నం చేశారు. హైడ్రాధికారులు పోలీసుల సహకారంతో వారిని బలవంతంగా పోలీస్ కారులో ఎక్కించి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అనంతరం అక్కడ ఉన్న మట్టి దిబ్బలను తొలగించారు. కాలనీవాసుల ఇచ్చిన ఫిర్యాదు స్థలాన్ని పరిశీలించడం జరిగిందని హైడ్రాధికారులు తెలిపారు. కొంతమేర పార్కు స్థలం గుర్తించామన్నారు. ప్రభుత్వ స్థలాలను కాపాడడం తమ బాధ్యత అని అధికారులు తెలిపారు.

## రిజర్వేషన్లు కల్పించేందుకు కృషి



**ప్రజాపక్షం/కొత్తూరు:** రానున్న స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వం బిసిలకు 42శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని బిసిసేన షాద్‌నగర్ తాలుకా అధ్యక్షుడు కత్తి చంద్రశేఖర్ అప్ప కోరారు. మంగళవారం పట్టణంలోని 4వ వార్డులో బీసీసేన వార్డు కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ వార్డులో మహిళా కమిటీలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మహిళా కమిటీ అధ్యక్షురాలిగా కమ్మరి అనసూయ, ఉపాధ్యక్షురాలుగా రామదాసు కళ, ప్రధాన కార్యదర్శిగా మాధవి ముదిరాజ్, కార్యదర్శిగా చాకలి ప్రభ, కోశాధికారిగా పావనిలను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో పట్టణ బిసిసేన అధ్యక్షురాలు కాటం భాగ్యలక్ష్మీ గౌడ్, 15వ వార్డు అధ్యక్షురాలు సింధూర, పట్టణ కార్యదర్శి కమ్మరి సరస్వతి పాల్గొన్నారు.

## మహిళలు ఆర్థికంగా అభివృద్ధి సాధించేందుకు కృషి చేయాలి



**ప్రజాపక్షం/ఫరూఖ్‌నగర్:** మహిళలు ఆర్థికంగా అభివృద్ధి సాధించేందుకు కృషి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని కేశంపేట ఎంపిడిఒ కిష్టయ్య అన్నారు. మంగళవారం కేశంపేట మండల కేంద్రంలోని మహిళా సమాఖ్య కార్యాలయంలో ఇందిరా మహిళా శక్తి సంబరాల సమావేశానికి ఎంపిడిఒ కిష్టయ్య హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మహిళలను ఆర్థికంగా అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంటుందని వివరించారు. కార్యక్రమంలో మహిళా సమాఖ్య అధ్యక్షురాలు భాగ్యలక్ష్మీ, కార్యదర్శి సుగుణమ్మ, కోశాధికారి గీత, మండల ఎపిఎం భగవంతు, సిసిలు రామచంద్రయ్య, మల్లేష్, యాదయ్య, నర్సింహా, సమాఖ్య అకౌంటెంట్ కవితతోపాటు వివిధ గ్రామాల మహిళా సమాఖ్య సభ్యులు పాల్గొన్నారు.

## వైద్య శిబిరాలు సద్వినియోగం

కార్పొరేటర్ మహేశ్వర్‌రెడ్డి



**ప్రజాపక్షం/సరూర్‌నగర్ :** ఉచిత వైద్యశిబిరాలను ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని గడ్డిఅన్నారం డివిజన్ కార్పొరేటర్ బద్దం ప్రేమ్ మహేశ్వర్‌రెడ్డి అన్నారు. మంగళవారం డివిజన్ పరిధిలోని పిఅండ్‌టికాలనీ కమ్యూనిటీ ఓజోన్ ఆసుపత్రి, లయన్స్ క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాన్ని కార్పొరేటర్ బద్దం ప్రేమ్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. శిభిరంలో వందలాది మంది పాల్గొని క్యాన్సర్ స్కానింగ్, షుగర్, బీపి, ఇసిజి, కార్డియాలజీ, జనరల్ వైద్య పరిక్షలు చేయించుకున్నారని తెలిపారు. ఇలాంటి ఉచిత వైద్య సేవలు అందుబాటులో ఉంచిన ఓజోన్ ఆసుపత్రి యాజమాన్యానికి, లయన్స్‌క్లబ్ బృందానికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షులు అశోక్, సతీష్, ఒంకార్, శ్రీకాంత్, శివరామ్, రత్నం తదితరులు పాల్గొన్నారు.

## నేటినుంచి దిల్‌సుఖ్‌నగర్ సాయిబాబా దేవాలయంలో గురుపౌర్ణమి వేడుకలు



**ప్రజాపక్షం/సరూర్‌నగర్ :** దిల్‌సుఖ్‌నగర్ షిర్డీ సంస్థాన్ ట్రస్ట్ సాయిబాబా దేవాలయంలో గురుపౌర్ణమి వేడుకలకు ఘనంగా ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆయన ట్రస్ట్ కమిటీ చైర్మన్ బి.వి.శ్యామ్‌కుమార్ తెలిపారు. మంగళవారం దిల్‌సుఖ్‌నగర్ సాయిబాబా సంస్థాన్ కార్యాలయంలో గురుపౌర్ణమి వేడుకల సందర్భంగా కరపత్రాలను అవిష్కరించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత 36 సంవత్సరాలుగా ఆలయంలో గురు పౌర్ణమి వేడుకలను నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ నెల 9వ తేది నుండి 11 తేదీ వరకు జరగబోయే మహోత్సవాలకు హాజరయ్యే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చేస్తున్నట్టు వివరించారు. కార్యక్రమంలో మాజీ చైర్మన్ గుండా మల్లయ్య, కోశాధికారి ఊర నర్సింహ గుప్త, వనం యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

# హైడ్రా అన్ని రాష్ట్రాలకూ అవసరం

### కర్ణాటక ఇంజనీర్ల బృందం సూచన చెరువుల సందర్శన



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** నగరంలో హైడ్రా పనితీరును బెంగళూరు లేక్స్ డిపార్ట్మెంట్ ఇంజనీర్ల బృందం మంగళవారం పరిశీలించింది. చెరువుల పరిరక్షణ, పునరుద్ధరణ, అభివృద్ధిని క్షేత్ర స్థాయిలో వీక్షించింది. పాతబస్తీలో బమృక్నుద్దౌలా చెరువుతో పాటు.. అంబర్‌పేటలోని బతుకమ్మకుంటను సందర్శించింది. చెరువుల పునరుద్ధరణ, అభివృద్ధి పనులు చేపట్టక ముందు, తాజా పరిస్థితులను గమనించింది. చెరువుల్లో ఆక్రమణలను తొలగించిన తీరును తెలుసుకుంది. నీటి జాడ లేని చెరువులను అభివృద్ధి చేసిన తీరును అభినందించింది. వరదల నివారణకు చెరువుల ప్రాధాన్యత ఎంతో ఉందని వివరించింది. చెరువులను అనుసంధానం చేసే నాలాలను కూడా పరిరక్షించాల్సిన అవసరం ఎంతో ఉందని అభిప్రాయ పడింది. ఇందుకు హైడ్రా చేపట్టిన చర్యలను పరిశీలించింది.

**చారిత్రక చెరువులపై ఆసక్తి...**అంబర్‌పేటలో ముల్లపొదలతో, పిచ్చి మొక్కలతో పూర్తిగా కప్పేసిన చెరువును పునరుద్ధరించిన తీరు ఆసక్తిగా ఉందని ఇంజనీర్లు అన్నారు. ఆక్రమణలను తొలగించినప్పుడు ఎలాంటి ఇబ్బందులు ఎదురయ్యాయో వాకబు చేశారు. బతుకమ్మ కుంట అని పేరు ఎందుకు వచ్చింది. మరి ఆ చెరువు ఎలా పూడ్చివేశారు ఇలా అనేక విషయాలను తెలుసుకున్నారు. క్షేత్ర స్థాయిలో చెరువు పునరుద్ధరణ, అభివృద్ధిని చూసి ముచ్చట పడ్డారు. పాతబస్తీలోని బమృక్నుద్దౌలా చెరువు గొప్పతనాన్ని తెలుసుకున్నారు. వనమూలికల మొక్కలు, చెట్ల కొమ్మలు వేసిన ఈ చెరువు దిగువున ఊట బావి నీటిని నిజాం నవాబులు తాగునీటిగా వినియోగించిన చరిత్రను తెలుసుకుని ముచ్చట పడ్డారు. ఇలాంటి చరిత్ర ఉన్న చెరువులను పునరుద్ధరించిన హైడ్రాకు అభినందనలు తెలిపారు.

**హైడ్రా అన్ని రాష్ట్రాలకూ అవసరం..**చెరువుల సందర్శన అనంతరం కర్ణాటక రాష్ట్రం నుంచి వచ్చిన చీఫ్ ఇంజనీర్ హరిదాసు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు నిత్య, భూప్రద, మహదేవ్‌లతో పాటు ఆ రాష్ట్ర ప్రతినిధులు హైడ్రా కమిషనర్ ఎవి రంగనాథ్‌తో బేటీ అయ్యారు. హైడ్రా గురించి విన్నాం.. పత్రికల్లో చదివాం.. ఇక్కడ ప్రత్యక్షంగా చూ స్తున్నాం. నగరంలో పూర్తిగా కనుమరుగైన, కాలుష్యం భారిన పడిన చెరువులను అభివృద్ధి చేస్తున్న తీరు బాగుందన్నారు. చెరువులు, నాలాలు, పార్కుల ఆక్రమణలతోపాటు.. ప్రభుత్వ భూములు, ప్రజావసరాలకు ఉద్దేశించిన స్థలాలను పరిరక్షించడం కత్తిమీద సాములాంటిదని.. అనతి కాలంలోనే చెరువుల ఎఫ్‌టిఎల్, బఫర్ అంటే ఏంటో ప్రజలు తెలుసుకునేలా చేశారంటూ ప్రశంసించా రు. హైడ్రా వంటి సంస్థ అన్ని రాష్ట్రాలకూ అవసరమని వారు అన్నారు. బెంగళూరులో చెరువుల పరిరక్షణకు తీసుకుంటున్న చర్యలను వివరించారు. 2006 నుంచి చెరువుల హద్దులను నిర్ధారించి ఫెన్సింగ్ వేయడం ద్వారా కబ్జా కాకుండా చూస్తున్నామన్నారు. కాలువలు కబ్జాకు గురి అవ్వడంతోనే వరదలు వస్తున్నాయని.. త్వరలోనే ఈ సమస్యకు కర్ణాటక ప్రభుత్వం పరిష్కారం చూపడానికి చర్యలు తీసుకుంటోందన్నారు. బెంగళూరులో చెరువులను హైడ్రా కమిషనర్ సందర్శించినప్పటి చిత్రాలతో కూడిన ఫొటో ఫ్రేంను రంగనాథ్‌కు ఇంజనీర్ల బృందం అందించారు.

# ట్రస్ట్ బ్యాంక్ ప్రతిపాదన విరమించుకోవాలి

సిఎంకు ఎంపి కృష్ణయ్య లేఖ

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్ర ప్రభుత్వం వెంటనే కాలేజీ కోర్సుల్లో బిసి ఎస్‌సిఎస్‌టి విద్యార్థుల మూడు సంవత్సరాల ఫీజు బకాయిలు చెల్లించాలని ట్రస్ట్ బ్యాంక్ ప్రతిపాదన విరమించుకోవాలని జాతీయ బిసి సంక్షేమ సంఘం అధ్యక్షుడు రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్య హెచ్చరించారు. ఈ మేరకు తెలంగాణ ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డికి మంగళవారం లేఖ రాశారు. ఫీజుల రీయింబర్స్‌మెంట్ స్కీం ఎత్తివేయాలని కుట్రలో భాగంగా టెస్ట్ బ్యాంక్ నిధి అనే సరికొత్త ప్రతిపాదన కాలేజీ యజమాన్యాల ద్వారా తెలుస్తుందని లేఖలో పేర్కొన్నారు. దీని ఎట్టి పరిస్థితుల్లో అంగీకరించేది లేదని, తెగించి పోరాడుతామని, స్కీమును రక్షించుకుంటామని కృష్ణయ్య హెచ్చరించారు. బిసి, ఎస్‌సి, ఎస్‌టిలు ఉన్నత వృత్తి విద్య కోర్సులు చదువుతుంటే ఈ ప్రభుత్వం ఓర్వలేక పోతుందని అన్నారు. ఈ స్కీము ఎత్తి వేసి చదువుకోకుండా చెయ్యాలని కుట్రలు చేస్తుందని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారానికి వచ్చి 20 నెలలు గడిచిన, ఫీజులు, స్కాలర్‌షిప్‌ల కోసం 20 రూపాయలు కూడా కేటాయించలేదన్నారు. ఈ 20 నెలల కాలంలో రూ.4 లక్షల కోట్లు ఆదాయం వచ్చింది.. రెండు లక్షల కోట్ల అప్పులు తెచ్చారు.. కానీ 15 లక్షల మంది విద్యార్థుల ఫీజుల బకాయిలు 4 వేల కోట్ల చెల్లించడానికి చేతులు రాలేదు, మనసు కనికరించలేదన్నారు. బలహీన వర్గాలపై ఇంత వ్యతిరేకత దేనికని ఆయన ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. బిసిలు మిమ్మల్ని సిఎం చేశారు, మంత్రులను చేశారు, కానీ మేము చదువుకోకూడదా అని సిఎంను ప్రశ్నించారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ స్కీంపై ప్రభుత్వం ఎటువంటి ప్రతిపాదనలు మార్పులు వద్దు యదాతదంగా అమలు చేయాలి అని ఆయన డిమాండ్ చేశారు. ఫీజు బకాయిలు రెండు దశలుగా చెల్లిందాలని విజ్ఞప్తి చేస్తున్నాం, లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన జరుగుతాయని హెచ్చరిస్తున్నాం అని లేఖలో పేర్కొన్నారు.

## ఆగస్టు 19న బిసిల సింహగర్జన

బిసి సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఎర్ర సత్యనారాయణ

**ప్రజాపక్షం/ఖైరతాబాద్ :** కామారెడ్డి డిక్లేషన్ హామీ ప్రకారం ఒబిసిలకు 42శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఆగస్టు 19న కామారెడ్డిలో లక్ష మందితో బిసిల సింహగర్జన నిర్వహించనున్నట్టు తెలంగాణ బిసి సంక్షేమ సంఘం అధ్యక్షులు ఎర్ర సత్యనారాయణ తెలిపారు. మంగళవారం హైదరాబాద్ బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్‌లో ఆయన మాట్లాడుతూ బిసి రిజర్వేషన్ల అంశంపై ఎలాంటి స్పష్టత ఇవ్వకుండా హైకోర్టు ఇచ్చిన ప్రకారం స్థానిక ఎన్నికలు నిర్వహిస్తామని ప్రభుత్వం ప్రకటించడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. బిసిల ఓట్లతో గద్దెనెక్కిన కాంగ్రెస్ ప్రభుత్వం 42 శాతం రిజర్వేషన్ల అమలుకు రాజ్యాంగపరమైన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. బిసిలకు స్థానిక ఎన్నికలో రిజర్వేషన్లు రాకుండా కాంగ్రెస్ ప్రభుత్వం అడ్డుకుంటుందని సత్యనారాయణ ఆరోపించారు. సమావేశంలో బిసి సంఘం నేతలు సుధాకర్ ముదిరాజ్, పాండు యాదవ్, గోపి, జనార్దన్, నందగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

# సిఎంను దూషిస్తే ప్రజలు తిరుగబడతారు

కెటిఆర్‌కు కాంగ్రెస్ నేతల హెచ్చరిక

పసుపు నీళ్లతో సోమాజిగూడ ప్రెస్‌క్లబ్ శుద్ధి




**ప్రజాపక్షం/ఖైరతాబాద్ :** కాంగ్రెస్ ప్రభుత్వంపై దుష్ప్రచారం చేస్తూ, సిఎం రేవంత్‌రెడ్డి దూషిస్తూ రాజకీయం చేస్తే ప్రజలు తిరుగబడతారని కాంగ్రెస్ నేతలు బోయ నరేశ్, నలికల్ల నరేశ్, శ్రీకాంత్ యాదవ్‌లు బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్‌ను హెచ్చరించారు. సిఎం రేవంత్‌రెడ్డి ఢిల్లీకి పోయిన సంగతి తెలిసి కూడా చర్చకు సిద్ధం అంటూ సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌కు వచ్చి రచ్చ చేయడం దేనికి సంకేతమని వారు ప్రశ్నించారు. ప్రజలను అయోమయానికి గురిచేసే రాజకీయాలు మానుకోవాలని హితవు పలికారు. మంగళవారం కెటిఆర్ రాకతో సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌ను కాంగ్రెస్ నేతలు పసుపు నీళ్ల చల్లి శుద్ధి చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉచిత బస్సు, రైతు భరోసా, బిసిలకు 42శాతం రిజర్వేషన్లు ఇస్తున్నందుకు సిఎం రేవంత్‌రెడ్డి ముక్కు నేలకు రాయాలా? అని ప్రశ్నించారు. అసెంబ్లీలో చర్చకు రమ్మంటే రాకుండా, ఫాంహౌస్‌లో ఉన్న చరిత్ర మీదంటూ విమర్శించారు. గత పదేళ్ల బిఆర్‌ఎస్ ప్రభుత్వంలో రైతులు వివక్షకు గురయ్యారని మండిపడ్డారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నేతలు జగన్ యాదవ్, ఖదీర్, పరమేశ్ యాదవ్, సన్ని, కె.రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజాసంక్షేమానికి కట్టుబడి ప్రభుత్వం పనిచేస్తుంది

ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి



**ప్రజాపక్షం/యాచారం :** కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సంక్షేమం కోసం కట్టుబడి పనిచేస్తుందని ఇబ్రహింపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. మంగళవారం యాచారం మండల పరిధిలోని కొత్తపల్లి, తక్కళ్ళపల్లి, నందివనపర్తి,నజ్దిక్ సింగారం, అయ్యవారి గూడ, యాచారం గ్రామాల్లో పలు అభివృద్ధి పనులకు శంఖుస్థానలు ప్రారంభోత్సవాలు చేశారు. ఈ సంధర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను యుద్ధ ప్రాతిపాధికన అమలు చేయడానికి కృషి చేస్తున్నామన్నారు. గ్రామాల అభివృద్ధికి తమ ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తుందన్నారు. ఇందిరమ్మ ఇండ్లు అర్హులైన వారికి ఇస్తున్నామన్నారు. అర్హులైనా వారందరికీ రేషన్ కార్డులు ఇస్తున్నామని తెలిపారు. భూ సమస్యలను పరిష్కరించడానికి కృషి చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు మస్కు నర్సింహ్మా, రాచర్ల వెంకటేశ్వర్లు, బిలకంటి శేఖర్‌రెడ్డి, కంబాలపల్లి ఉదయశ్రీ, ఎంపిడిఒ రాధారాణి, ఇబ్రహింపట్నం మార్కెట్ కమిటీ డైరెక్టర్లు మస్కు నర్సింహ్మా, గులాం అక్బర్, వుప్పల భాస్కరు గుప్త, గడల మల్లేశ్, విజయ్, మహేంధర్, పోలమోని రామకృష్ణ, ఎండి ఘని, పాశం జగన్ పాల్గొన్నారు.

## సిపిఐ బలోపేతానికి కృషి

పార్టీ శేరిలింగంపల్లి మండల కార్యదర్శి రామకృష్ణ, సహాయ కార్యదర్శి చందు యాదవ్





**ప్రజాపక్షం/శేరిలింగంపల్లి :** మాదాపూర్‌లోని ఇజ్జత్ నగర్‌లో గల సిపిఐ కార్యాలయంలో సోమవారం జరిగిన సిపిఐ నాలుగో మహాసభలో శేరిలింగంపల్లి మండల నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సిపిఐ కార్యదర్శిగా రామకృష్ణ, సహాయకార్యదర్శిగా చందుయాదవ్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా మంగళవారం వారు మహాసభ వివరాలు వెల్లడించారు. తమకు మరోసారి పార్టీ నాయకత్వ బాధ్యతలు అందించేందుకు కృషి చేసిన రంగారెడ్డి జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య, రాష్ట్ర సమితి సభ్యులు పానుగంటి పర్వతాలు, శేరిలింగంపల్లి కౌన్సిల్‌కు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ నిభందనలకు కట్టుబడి, శేరిలింగంపల్లిలో సిపిఐ పార్టీ బలోపేతానికి కృషి చేస్తామన్నారు. బడుగు, బలహీన వర్గాల అభివృద్ధికి తోడ్పడుతూ ప్రజ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తూ అందరికి అందుబాటులో ఉంటామని వారు తెలిపారు.

# సార్వత్రిక సమ్మెలో పాల్గొనండి

కార్మికులకు సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఆందోజు రవీంద్రచారి పిలుపు

**ప్రజాపక్షం/ఎల్‌బినగర్ :** దేశవ్యాప్తంగా బుధవారం నిర్వహించే సార్వత్రిక సమ్మెలో కార్మికులు, కర్షకులు అధికసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆందోజు రవీంద్రచారి పిలుపునిచ్చారు. మంగళవారం హయత్ నగర్ మండల కేంద్రంలో సమ్మె విజయవంతం చేయాలని ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా రవీంద్రచారి, ఎఐటియుసి రంగారెడ్డి జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ సామిడి శేఖర్‌రెడ్డి, బికెఎంయు రంగారెడ్డి జిల్లా కార్యదర్శి దాసరి ప్రసాద్‌లు మాట్లాడుతూ దేశంలో కార్మికుల కొరకు, రైతుల కొరకు, సామాన్య ప్రజల కొరకు జరగబోయే దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మె కార్మిక శక్తులు భారీగా పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మందుల కృష్ణ, మర్రి శోభన్, ఎఐటియుసి కార్యదర్శి నాగరాజు, బికెఎంయు మండల అధ్యక్షులు చెంది వెంకట్, బొడ్డు శ్రీను, పాల్వాయి సురేందర్, నరింజన్, సుధాకర్, మారయ్య, మాతంగి సైదమ్మ, రేణుక, స్వరూప తదితరులు పాల్గొన్నారు.




**తుర్కయంజాల్ :** నేడు జరుగు దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మెలో పెద్ద ఎత్తున పాల్గొనాలని ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి ఓరుగంటి యాదయ్య కార్మికులకు పిలుపునిచ్చారు. మంగళవారం స్థానికంగా ఆయన మాట్లాడుతూ కార్మిక చట్టాలను అమలు చేయని యాజమాన్యాలపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సమ్మె ద్వారా కార్మికుల డిమాండ్ చేయబోతున్నారన్నారు.

# పేద ప్రజల గుండెల్లో చిరస్మరణీయుడు వైఎస్‌ఆర్

షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్







**ప్రజాపక్షం/షాద్‌నగర్ :** పేద ప్రజల గుండెల్లో చిర స్మరణీయుడు వైఎస్ రాజశేఖర్‌రెడ్డి అని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. మంగళవారం పట్టణంలోని ముఖ్యకూడలిలో వైఎస్‌ఆర్ 76వ జయంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్ళు అర్పించారు. పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కొంకళ్ళ చెన్నయ్య, మైనార్టీ నేత మహ్మద్ ఇబ్రహీంల ఆధ్వర్యంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు, బ్రెడ్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ బడుగు, బలహీనవర్గాల అభ్యున్నతికి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి అనేక పథకాలను అందుబాటులోకి తీసుకువచ్చారని వివరించారు. ఉచిత విద్యుత్ తోపాటు ఇందిరమ్మ ఇళ్లు ఇచ్చిన ఘనత వైఎస్ రాజశేఖరరెడ్డికే దక్కిందన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బాబర్‌ఖాన్, మున్సిపల్ మాజీ చైర్మన్ విశ్వం, నేతలు బాల్‌రాజ్ గౌడ్, రఘునాయక్, చెంది తిరుపతిరెడ్డి, యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అందె మోహన్, మార్కెట్ డైరెక్టర్ కరుణాకర్, కృష్ణవేణి, శ్రీనివాస్ యాదవ్, వర్ష, బీసీసేన అసెంబ్లీ అధ్యక్షుడు కత్తి చంద్రశేఖర్‌రెడ్డి, కొప్పునూరి ప్రవీణ్, దిలీప్, లింగారెడ్డిగూడ అశోక్, సీతారాములు, గంగనమోని సత్తయ్య, శేఖర్‌లు పాల్గొన్నారు.

**సరూర్‌నగర్ :** ప్రజా సేవకు తన రాజకీయ జీవితాన్ని అంకితం చేసిన మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి చిరస్మరణీయుడని టిపిసిసి సభ్యులు, మహేశ్వరం నియోజకవర్గం సీనియర్ నాయకులు దేప భాస్కర్‌రెడ్డి కొనియాడారు. మంగళవారం ఆర్‌కెపురం డివిజన్‌లో స్థానిక కాంగ్రెస్ పార్టీ నేతల ఆధ్వర్యంలో చిత్రలేఅవుట్ కాలనీలో వైఎస్‌ఆర్ జయంతి వేడుకలు నిర్వహించారు. కార్యక్రమానికి దేప భాస్కర్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై వైఎస్‌ఆర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో చిలుక ఉపేందర్‌రెడ్డి, పున్న గణేష్‌నేత, బండి మదుసూదన్, సురేష్, అంజిరెడ్డి, లింగస్వామిగౌడ్, ఎల్లయ్య, శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

**ఎల్‌బి నగర్ :** వైఎస్ రాజశేఖర్‌రెడ్డి సేవలు మరువలేమని హస్తినాపురం డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు దెంది శశిధర్‌రెడ్డి అన్నారు. మంగళవారం డివిజన్‌లోని జడ్పీ రోడ్డులో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో నర్సింహాగౌడ్, శ్రీకాంత్‌రెడ్డి, బ్రహ్మరెడ్డి, శేఖర్‌రెడ్డి, శ్రీను నాయక్, లత గౌడ్, సాయి రామ్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, విష్ణు, అరవింద్ పాల్గొన్నారు.

## వైఎస్సార్ సంక్షేమ పథకాలు ఆదర్శం



ప్రజాపక్షం/మల్కాజిగిరి : ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రిగా వైఎస్ రాజశేఖరరెడ్డి పేదల అభివృద్ధి కోసం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు అందరికీ ఆదర్శంగా నిలిచాయని కాంగ్రెస్ నాయకులు కొనియాడారు. తెలుగు రాష్ట్రాల ప్రజలు వైఎస్సార్‌ను ఎప్పటికీ మరచిపోరన్నారు. దివంగత వైఎస్ రాజశేఖరరెడ్డి 76వ జయంతి సందర్భంగా మల్కాజిగిరి నియోజకవర్గంలోని నేరేడ్‌మెట్ చౌరాస్తాలో మాజీ కౌన్సిలర్లు ఎస్సార్ ప్రసాద్, ఇందిరా చంద్రశేఖర్‌ల ఆధ్వర్యంలో వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించి కేక్ కట్ చేసారు.

ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ శ్రేణులు చంద్రశేఖర్, కుట్టి శీను, రాఘవన్, ప్రభ, రాజలింగం, ప్రవీణ్, నర్సింగరావు, కోటేశ్వరి, తదితరులుపాల్గొన్నారు.

## నాయకులతో అదనపు కలెక్టర్ సమావేశం



ప్రజాపక్షం /కొడంగల్ : రాజకీయ నాయకులు, పోలీంగ్ బూత్‌ల వారీగా బిఎల్‌ఏలను నియమించుకొవాలని జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ అన్నారు. మంగళవారం తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్ విజయ్‌కుమార్ సమక్షంలో ఆయా పార్టీల నాయకులతో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారితో అదనపు కలెక్టర్ మాట్లాడుతు బూత్ లెవల్ అసిస్టెంట్స్‌ను నియమించుకోవాలని తెలిపారు. 18 సం.లు నిండిన వారికి ఓటు హక్కు కల్పించే విధంగా నాయకులు ప్రజల్లో అవగాహన చేపట్టాలన్నారు. సమావేశంలో ఎలక్షన్ డిటి, ఆయా పార్టీల నాయకులు, తదితరులున్నారు.

## భూభారతి దరఖాస్తుల ప్రక్రియ వేగంగా పూర్తి

### కలెక్టర్ విజయేందర్‌రెడ్డి ఆదేశం

ప్రజాపక్షం/మేడ్చల్ ప్రతినిధి: రెవెన్యూ సదస్సులతో పాటు ఆన్‌లైన్ ద్వారా భూభారతిలో వచ్చిన ధరఖాస్తులన్నిటిని క్షేత్ర స్థాయిలో పరిశీలించి త్వరగా పరిష్కరించాలని జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి తహసీల్దార్లను ఆదేశించారు. మంగళవారం మేడ్చల్ తహసీల్దార్ కార్యాలయంలో భూభారతి, రెవెన్యూ సదస్సులు, మీసేవా సర్టిఫికెట్ల జారీ తదితర అంశాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన



మాట్లాడుతూ ఇప్పటి వరకు భూభారతికి సంబంధించి వచ్చిన ధరఖాస్తుల్లో ఏ మేరకు పరిష్కరించారన్న విషయాన్ని అడిగి తెల్సుకొన్నారు. క్షేత్ర స్థాయిలోఎదురవుతున్న సమస్యలేవైనా ఉన్నాయా అంటూ ప్రశ్నించి మీసేవ ద్వారా జారీచేసే సర్టిఫికెట్లను ఎలాంటి జాప్యానికి తావివ్వకుండా ఎప్పటికప్పుడు అప్‌లోడ్ చేస్తుండాలన్నారు. మేడ్చల్ తహసీల్దార్ భూపాల్, ఎంఆర్వో కార్యాలయ సిబ్బంది ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.



## కార్పొరేట్ సంస్థలకు ఊడిగం చేస్తున్న ఎన్‌డిఎ ప్రభుత్వం

### సమ్మె విజయవంతం చేయాలని పిలుపు

ప్రజాపక్షం/మేడ్చల్ ప్రతినిధి : కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా బుధవారం జరుగనున్న దేశవ్యాప్త సారస్వత సమ్మెను విజయవంతం చేయాలని తెలంగాణా రాష్ట్ర రైతు సంఘం మేడ్చల్ జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రధాన కార్యదర్శి నిమ్మల నర్సింలు, ఎఐటియుసి మండల అధ్యక్షులు ఏ.ఎల్లయ్యలు పిలుపిచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత 11 ఏళ్లుగా ఎన్డీ ప్రభుత్వం కార్మిక కర్షక క్షేమాన్ని విస్మరించి కార్పొరేట్ సంస్థలకు ఊడిగం చేస్తోందని విమర్శించారు. అనేక కార్మిక సంక్షేమ చట్టాలను రద్దు చేసి నాలుగు లేబర్ కోడ్‌లు తీసుకొని వచ్చి కార్మికులకు తీరని అన్యాయం చేస్తోందన్నారు. రైతులు పండించిన పంటలకు కనీస మద్దతు ధర ఇవ్వకుండా స్మామినాథన్ కమిషన్ సిఫారసులను సైతం అమలు చేయటం లేదన్నారు. రైతు సంఘ నాయకులు పి.నరసింహ, మహేష్, యాదగిరి, వెంకటయ్య, అశోక్, తదితరులు వారితో పాటు పాల్గొన్నారు.

## ఆరోగ్య తెలంగాణే ప్రభుత్వ లక్ష్యం

### హైదరాబాద్‌ను శుభ్రంగా మార్చడం లో జిహెచ్‌ఎంసి కార్మికులదే కీలకమైన పాత్ర

### మంత్రి పొన్నం ప్రభాకర్



ప్రజాపక్షం/హైదరాబాద్ : ఆరోగ్య తెలంగాణే ప్రభుత్వ లక్ష్యమని హైదరాబాద్ జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. బంజారా హిల్స్ కొమురం భీం భవన్‌లో జిహెచ్‌ఎంసి పారిశుద్ధ్య సిబ్బందికి ఏర్పాటు చేసిన ఆరోగ్య శిబిరాన్ని మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రత్యేక హెల్త్ క్యాంప్‌లో మంత్రి ఆరోగ్య పరీక్షలు చేయించుకున్నారు. ఆరోగ్య పరీక్షలు చేసే శిబిరంలో ఆధునాతన యంత్రాలు, సిబ్బందికి ఇచ్చే మందులను మంత్రి పరిశీలించారు. అనంతరం పారిశుద్ధ్య సిబ్బందికి వ్యక్తిగత పరికరాల కిట్స్ మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, జిహెచ్‌ఎంసి కమిషనర్ ఆర్.వి. కర్ణన్, హైదరాబాద్ కలెక్టర్ దాసరి హరిచందనలతో కలిసి మంత్రి పొన్నం ప్రభాకర్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ హైదరాబాద్ మహానగరాన్ని జిహెచ్‌ఎంసి కార్మికులు ప్రతిరోజు పరిశుభ్రంగా మారుస్తున్నారన్నారు. జిహెచ్‌ఎంసిలో పనిచేస్తున్న ప్రతి పారిశుద్ధ్య కార్మికునికీ ఆరోగ్య పరీక్షలు చేస్తూ, నెలవారి మందులు ఇచ్చే కార్యక్రమం ప్రారంభమైందన్నారు. మీ ఆరోగ్యాన్ని కాపాడటానికి తీసుకున్న నిర్ణయంలో భాగంగా మీ అందరి జీతాలు పెంచాలనే ఆలోచన ప్రభుత్వంలో ఉందన్నారు. ఈ విషయం ముఖ్యమంత్రి దృష్టికి తీసుకు పోతామన్నారు. ఆర్థిక ఇబ్బందులు ఉన్న మీ పట్ల సానుకూలంగా ఉన్నట్లు మంత్రి చెప్పారు. ఆర్థిక పరిస్థితి మెరుగుపడితే ముఖ్యమంత్రి దృష్టికి తీసుక పోతామన్నారు. అన్ని గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్లు వచ్చాయని, హైదరాబాద్‌లో స్థలం ఉన్న వారికి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేస్తామన్నారు. కొన్ని మురికివాడలను అభివృద్ధి చేస్తూ, అక్కడ నిర్మాణాలు చేపట్టి మీకు ఇవ్వాలని ప్రణాళికలు చేయనున్నట్లు చెప్పారు. హైదరాబాద్‌కి పెట్టుబడులు వస్తున్నాయంటే పారిశుద్ధ్య కార్మికులు అద్దం మాదిరిగా హైదరాబాద్‌ను ప్రపంచానికి చూపెడుతున్నారన్నారు. మీ పిల్లలు చదువుకోవడానికి గురుకులాల్లో మెస్ చార్జీలు పెంచామ ని, రాష్ట్రంలో అర్హులకు సన్న బియ్యం పంపిణీ చేస్తున్నామని, 200 యూనిట్ల ఉచిత విద్యుత్ సరఫరా చేస్తున్నట్లు మంత్రి వివరించారు. మీ పిల్లలకు చదువుల ఇబ్బంది ఉంటే అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. గురుకులాల్లో సీట్లు ఇచ్చి చదివించే బాధ్యత తమదని పారిశుద్ధ్య కార్మికులకు మంత్రి భరోసా ఇచ్చారు.

**కార్మికుల ఆరోగ్య పరిరక్షణకు ప్రాధాన్యం : మేయర్ గద్వాల్ విజయలక్ష్మి**

నగర మేయర్ గద్వాల్ విజయలక్ష్మి మాట్లాడుతూ పారిశుద్ధ్య సిబ్బంది తరచుగా అనారోగ్య సమస్యలకు గురి కాకుండా జాగ్రత్తలు పాటిస్తూ ప్రభుత్వం అందచేసిన కిట్స్‌ను తప్పక సద్వినియోగం చేసుకోవాలన్నారు. వర్షాకాలం కావడంతో వ్యాధులు ప్రబలకుండా ముందునుండే జాగ్రత్తలు పాటించాలని సూచించారు. కార్మికుల ఆరోగ్య పరిరక్షణతో పాటుగా కార్మికులు అకాల మరణం పొందిన దృష్ట్యా పని చేయలేక పోయిన వారి కుటుంబ సభ్యులకి తిరిగి ఉపాధి కల్పించేందుకు జిహెచ్‌ఎంసి నిర్ణయం తీసుకున్నట్లు మేయర్ చెప్పారు.

**వర్షాకాలంలో నిరంతర వైద్య పరీక్షలు చేయించుకోవాలి : కమిషనర్ కర్ణన్**

కమిషనర్ ఆర్.వి.కర్ణన్ మాట్లాడుతూ వర్షాకాలం కావడంతో పారిశుద్ధ్య సిబ్బంది నిరంతరం ఆరోగ్య పరీక్షలు చేయించుకుంటూ, తమ ఆరోగ్యం కాపాడుకోవాలని సూచించారు. జిహెచ్‌ఎంసి పరిధిలో మొదటిసారిగా బంజారాహిల్స్ పరిధిలోని 450మంది పారిశుద్ధ్య సిబ్బంది జిహెచ్‌ఎంసి ఫ్రంట్ లైన్ వర్కర్లు భావించి, వారి ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకొని ఖర్చుకు వెనుకాడకుండా ఆరోగ్య రక్షణకు ప్రాధాన్యత ఇచ్చామన్నారు. సిబ్బంది ఆరోగ్య పరిరక్షణ ధ్యేయంగా క్యాంపులు నిర్వహించడం జరుగుతుందన్నారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాల్లో కంటి, పంటి, ఆర్థో, టి.బి, లెప్రసి, బి.పి, షుగర్, గైనిక్, బ్రెస్ట్ క్యాన్సర్ వంటి టెస్టులు కార్మికులకు సేవలను అందిస్తున్నామని జిల్లా కలెక్టర్ హరి చందన దాసరి చెప్పారు. ఈ కార్యక్రమంలో జోనల్ కమిషనర్ అనురాగ్ జయంతి, జిహెచ్‌ఎంసి అదనపు కమిషనర్ సి.ఎన్.రఘు ప్రసాద్, చీఫ్ మెడికల్ అధికారి డాక్టర్ పద్మజ, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వెంకటి, టిబి నివారణ అధికారి చల్లా దేవి, అదనపు డిఎం అండ్ హెచ్‌ఒలు డాక్టర్ విజయనిర్మల, డాక్టర్ మురళీధర్, లెప్రసీ అధికారి డాక్టర్ రాధా కిషన్, తహసీల్దార్ పాల్గొన్నారు.



## ప్రజాసేవే నా లక్ష్యం

### స్పీకర్ ప్రసాద్‌కుమార్

ప్రజాపక్షం/వికారాబాద్ ప్రతినిధి:వికారాబాద్ నియోజకవర్గంలోని మర్పల్లి, బంట్వారం మండల కేంద్రాలలోని ఎంపిడిఒ కార్యాలయాల్లో మంగళవారం ప్రజా సమస్యల పరిష్కారంకోసం ప్రత్యేక సమావేశాల్లో పాల్గొన్న స్పీకర్ ప్రసాద్‌కుమార్ ఈ సందర్భంగా మర్పల్లిలో ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలను లబ్దిదారులకు పంపిణీ చేశారు. వనమహోత్సవంలో భాగంగా మర్పల్లి, బంట్వారంలలో మొక్కలను నాటి, ఇందిరా మహిళా శక్తి సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్పీకర్ మాట్లాడుతూ వికారాబాద్ నియోజకవర్గంలోని ప్రజలకు సేవ చేయడమే నా ఆశయం, లక్ష్యం అని అన్నారు. ప్రజలు తమ సమస్యలను చెప్పడానికి హైదరాబాద్, వికారాబాద్ వచ్చి ఇబ్బందులు పడకుండా ఆయనే వారి వద్దకు వచ్చి క్షేత్రస్థాయిలో ప్రజల సమస్యలను తెలుసుకుని అక్కడికక్కడే పరిష్కరించడానికి ఈ రోజు మర్పల్లి, బంట్వారం మండలాల ప్రజలతో ముఖాముఖి సమావేశం ఏర్పాటు చేశారు. ప్రజల సమస్యలను తెలుసుకుని వెంటనే పరిష్కారించాలని సంబంధిత శాఖల అధికారులకు ఆదేశించారు. ఇలాంటి కార్యక్రమాల ద్వారా ప్రజా సమస్యలు తక్షణం పరిష్కారం అవ్వడంతో పాటుగా ప్రజలకు రవాణా ఖర్చు లు, సమయం వృధా కాదు అని తెలిపారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయడానికి కృషి చేస్తానని అన్నారు. రాష్ట్ర అభివృద్ధికి పనిచేస్తూ సంక్షేమ పథకాలను సమర్థవంతంగా అమలు చేస్తున్న రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అందరూ అండగా ఉండాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధికారులు, మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## తెలంగాణా స్టూడెంట్ యునైటెడ్ ఫర్ నేషన్, బహుజన్ సమాజ్ పార్టీలు తొలగింపు

ప్రజాపక్షం/మేడ్చల్ ప్రతినిధి: రాజకీయ పార్టీలుగా నమోదు చేసుకొని రిజస్టర్ అయిన తెలంగాణా స్టూడెంట్ యునైటెడ్ ఫర్ నేషన్, బహుజన్ సమాజ్ పార్టీ (అంబేడ్కర్ పూలే)లు గత ఆరేళ్లుగా ఎలాంటి కార్యకలాపాలు లేకపోవటం, లోకసభ, శాసనసభా ఎన్నికల్లో ఏ ఒక్క స్థానంలోనూ పోటీ చేయకపోవటం కారణంగా ఆ రెండు పార్టీలను తొలగించనున్నామని మేడ్చల్ జిల్లా కలెక్టర్ మను చౌదరి తెలిపారు. కార్యకలాపాలు లేకపోవటానికి సరైన కారణాలు సహాయక పత్రాలతో పాటు అఫిడవిట్ ద్వారా ఈ నెల 11లోగా సమర్పించి 15న తెలంగాణా ముఖ్య ఎన్నికల అధికారిని ఆయా పార్టీ నిర్వాహకులు స్వయంగా హాజరై వివరణ ఇచ్చేఅవకాశం ఉందని కలెక్టర్ పేర్కొన్నారు.

## మాజీ ముఖ్యమంత్రిని కలిసిన మాజీ మంత్రి ఎమ్మెల్యే సబిత, ఆనంద్

ప్రజాపక్షం/వికారాబాద్‌ప్రతినిధి:హైదరాబాద్‌లోనినంది నగర్ గల తన నివాసంలో తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కెసిఆర్‌ను మాజీ మంత్రి ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి, మాజీ ఎమ్మెల్యే వికారాబాద్ బిఆర్‌ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షులు ఆనంద్ మర్యాదపూర్వకంగా కలిసి ఆరోగ్య పరిస్థితి, రాజకీయ విషయాలు చర్చించడం జరిగిందని ప్రకటనలో తెలిపారు.



## నేడు పలు ప్రాంతాల్లో విద్యుత్ అంతరాయం

ప్రజాపక్షం/కాప్రా : మల్లాపూర్, నాచారం సబ్ స్టేషన్ల నిర్వహణ పనుల దృష్ట్యా వీటి పరిధిలో ప్రాంతాల్లో బుధవారం ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ నాగరాజు తెలిపారు. అశోక్‌నగర్ ఫీడర్ పరిధిలోని నెహ్రూనగర్, అశోక్‌నగర్, హెచ్‌సిఎల్ కేబుల్స్, మర్రిగూడ, అన్నపూర్ణ కాలనీ ఫీడర్ పరిధిలోని జనప్రియ టవర్స్, సాయి టవర్స్, ఎపి కాలనీ, లింగయ్య కాలని, చందమ్మ ఫీడర్ పరిధిలోని ఐడిఏ నాచారం ప్రాంతాల్లో విద్యుత్ అంతరాయం ఉంటుందన్నారు.

## ఉచిత వైద్య శిబిరాలు సద్వినియోగం చేసుకోవాలి : తాదుల వేణు

ప్రజాపక్షం/కుత్బుల్లాపూర్ : ఉచిత వైద్య శిబిరాలను ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని కైసర్ నగర్ డబల్ బెడ్ రూమ్ సొసైటీ అధ్యక్షుడు తాదుల వేణు, జనరల్ సెక్రటరీ ఎస్కే వలి అన్నారు. కూకట్ పల్లి మెడివిజన్ హాస్పిటల్ సౌజన్యంతో మంగళవారం కైసర్ నగర్ డబల్ బెడ్ రూమ్ సొసైటీలో ఉచిత కంటి శిబిరాన్ని డాక్టర్ రీనాతో కలసి సొసైటీ అధ్యక్షుడు తాదుల వేణు, జనరల్ సెక్రటరీ ఎస్కే వలి ప్రారంభించారు. ఉచిత కంటి వైద్య శిబిరంలో కళ్ళ యొక్క క్లినికల్ పరీక్ష, కంటి రక్షణకు సలహా, కంటి వ్యాధుల నివారణ, కంటి చూపు తనిఖీ వంటి పరీక్షలు నిర్వహించారు. దాదాపు 200మంది కంటి పరీక్షలు నిర్వహించుకున్నారు.



ఈ సందర్భంగా డాక్టర్ రీనా మాట్లాడుతూ, ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా మూడు నెలలకోసా రి వైద్య పరీక్షలు చేయించుకొని ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని తెలిపారు. వైద్యుల సూచనల మేరకు తగిన మందులు వాడాలనీ పోషక విలువలున్న ఆహారం తీసుకోవాలని అన్నారు. అనంతరం కైసర్ నగర్ డబల్ బెడ్ రూమ్ సొసైటీ అధ్యక్షుడు తాదుల వేణు, జనరల్ సెక్రటరీ ఎస్కే వలి మాట్లాడుతూ, నిరుపేదలు నివసించే ప్రాంతాలలో ఇలా వైద్య శిబిరాలు ఏర్పాటు చేయడం వల్ల ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందనీ, తమ ఆరోగ్యం పట్ల అవగాహన కలిగి సరైన సమయంలో వైద్య పరీక్షలు చేయించుకుని డాక్టర్ సలహామేరకు సరైన మందులు వాడితే ఆరోగ్యకరమైన జీవితాన్ని గడపవచ్చని వారు తెలిపారు.

## కార్పొరేషన్ పరిధిలో గృహిణి అదృశ్యం

### పిఎస్‌లో ఫిర్యాదు చేసిన భర్త



ప్రజాపక్షం/జవహర్‌నగర్: కార్పొరేషన్ పరిధిలో గృహిణి అదృశ్యమైన సంఘటన జవహర్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్‌హెచ్‌ఓ సైదయ్య తెలిపిన వివరాల ప్రకారం జవహర్ నగర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని సంతోష్ నగర్ కాలనీలో కొండం భగవాన్ రెడ్డి రేణుక దంపతులు నివసిస్తున్నారు. ఈ నెల ఏడవ తేదీన సాయంత్రం ఏడు గంటలకు రేణుక (30) తన సోదరి నిశ్చితార్థం కోసమని చెప్పి పొరుగువారి వద్ద నల్లపూసల గొలుసు తీసుకుంది. రేణుక సాయంత్రం నాలుగు గంటలకు తన పిల్లలతో కలిసి ఆధార్ కేంద్రానికి వెళుతున్నానని చెప్పి ఇంటినుండి బయలుదేరి వెళ్ళింది. సాయంత్రం వరకు తిరిగి రాకపోయేసరికి భర్త ఫోన్ చేసినా స్విచాఫ్ వచ్చింది. ఈ మేరకు చుట్టుపక్కల వెతికినా బంధువుల వద్ద వెతికి నా తెలిసిన వారివద్ద వెతికినా సమాచారం లభించలేదు. అవసరమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ జవహర్ నగర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. మిస్సింగ్ కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.



## కాంట్రాక్ట్ కార్మికులకు కనీసవేతనం అమలుకు దేశవ్యాప్త సమ్మె

ప్రజాపక్షం/కుత్బుల్లాపూర్ :మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా జగద్గిరిగుట్ట పరిధిలోని భవననిర్మాణ లేబర్ అడ్డాలో 9వ తేదీన దేశవ్యాప్తంగా జరిగే సార్వత్రిక సమ్మెలో నిర్మాణ కార్మికులు పాల్గొనాలని మాట్లాడుతూ, భవన నిర్మాణ సంక్షేమ బోర్డును నిర్వీర్యం చేస్తూ ప్రైవేట్ ఇన్సూరెన్స్ కంపెనీలకు కట్టబెట్టడానికి ప్రభుత్వం టెండర్లు ప్రయత్నం చేస్తున్నారని, పోరాడి సాధించుకున్న 44 కార్మిక చట్టాలలోని 29 చట్టాలను కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం పూర్తిగా తొలగించి 4 కోడ్స్‌గా విభజించి అమలు జరపాలని చూస్తున్నారని, కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగ్ కార్మికులకు కనీసవేతనం రూ.26,000 లు నిర్ణయించి అమలుపరచాలని, సంఘటిత, అసంఘటిత కార్మికులకు నెలకు 9వేల రూపాయలు పింఛన్ ఇవ్వాలని తదితర డిమాండ్లతో ఎఐటియుసి కార్మిక సంఘం పిలుపునివ్వడం జరిగింది. ఈ కార్యక్రమములో ఎఐటియుసి రాష్ట్ర మున్సిపల్ సంఘం కార్యదర్శి యేసురత్నం, మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా కార్యదర్శి వంగాల శ్రీనివాసులు, భవననిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు హరినాథ్ రావు, జగద్గిరిగుట్ట లేబర్ అడ్డా నాయకులు రాములు, సామ్యూల్, ముసలయ్య, యాదగిరి, ఆస్బెస్టాస్ కాలని అడ్డా నాయకులు బాలాజీ, అడ్డా కార్మికులు పెద్ద ఎత్తున్న పాల్గొన్నారు.

## తన ఆట పాటల ద్వారా ప్రజల్లో చైతన్యం తీసుకువచ్చిన మహమ్మద్ నిస్సార్

### తెలంగాణ ప్రజానాట్యమండలి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పల్లె నరసింహ్మ

ప్రజాపక్షం/హైదరాబాద్/కుత్బుల్లాపూర్: ప్రజాకవి, రచయిత, గాయకు డు, తెలంగాణ ప్రజానాట్యమండలి సీనియర్ నాయకులు మహమ్మద్ నిస్సార్ తన ఆట పాటల ద్వారా ప్రజల్లో చైతన్యం తీసుకువచ్చారని తెలంగాణ ప్రజానాట్యమండలి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పల్లె నరసింహ గుర్తు చేసారు. హిమాయత్ నగర్‌లోని సత్యనారాయణ రెడ్డి భవన్‌లో మంగళవారం నిస్సార్ 5వ వర్ధంతి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పల్లె నరసింహతోపాటు తెలంగాణ రాష్ట్ర ప్రజానాట్యమండలి అధ్యక్షులు కె.శ్రీనివాస్, రాష్ట్ర అధ్యక్షులు కె.శ్రీనివాస్, కన్నా లక్ష్మి నారాయణ, కె. ఉప్పలయ్య, కిన్నెర బారీములు, పి.సైదులు, అ.ర.సం. నాయకులు వేల్పుల నారాయణ, పల్లేరు వీరస్వామి, రాపోలు సుదర్శన్, కెవిఎల్, ఔదేశి రాణి, చంద్రమోహన్ గౌడ్ నిక్కత్, సుమిత్రా దేవి, నిధి, బిక్షపతి, నారాయణరెడ్డి తదితరులు నిస్సార్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా పల్లె నరసింహ మాట్లాడుతూ ''పందూ వెన్నెల్లలోన.. పాడేటి ఆటలేమాయె.. మన పల్లెటూరిలోనా ఆడేటి ఆటలేమాయె'' వంటి పాటలు ఆయనకు గొప్ప పేరు తెచ్చాయని, ''సుట్టూ పక్కల ఎక్కడ సూశిన పొట్టాలల్లో ఆకలి మంటలు.. సుట్టుకపోయిన పేగులన్నీ తట్టిలేపుతున్నయి.. బుసగొట్టలేవమన్నయ్'' అనే పాట కరవుపై పాటలు రాసాడని తెలిపారు.



కె. శ్రీనివాస్ మాట్లాడుతూ సిపిఐ నాయకునిగా, ప్రజానాట్యమండలి కళాకారునిగా తన పదునైన కంచుకంఠంతో పడిన పాటలు తెలంగాణ ఉద్యమంలో సమాజాన్ని మేల్కోల్పారని తెలిపారు.

**నిసార్‌ను స్మరించుకుందాం.. భావితరాలకు స్ఫూర్తిగా నిలుద్దాం : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సాంస్కృతిక శాఖ సలహా మండలి సభ్యులు**

ప్రజా కవి, వాగ్గేయకారుడు, మహమ్మద్ నిసార్ సమాజ సేవను ప్రముఖ కవులు, కళాకారులు పేరుపేరునా కొనియాడారు. ఈ రోజు స్థానిక షాపూర్ నగర్ ఎఐటియుసి కార్యాలయంలో తెలంగాణ ప్రజానాట్యమండలి మేడ్చల్ జిల్లా అధ్యక్షులు ప్రవీణ్ అధ్యక్షతన జరిగిన నిసార్ యాది సభలో పాల్గొన్న కవులు కళాకారులు మాట్లాడుతూ, నిసార్ ఒక ప్రజా కళాకారుడిగా సమాజ శ్రేయస్సుకోరి చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన రాష్ట్ర ప్రభుత్వ సాంస్కృతిక శాఖ సలహా మండలి సభ్యులు దరువు అంజన్న, పసునూరి రవీందర్, పల్లె నర్సింహ, మాట్లాడుతూ ప్రజా కళాకారునిగా నిసార్ తెలంగాణ ప్రజానాట్యమండలిలో క్రియాశీలక పాత్ర వహించారని, తెలంగాణ ఉద్యమంలో చురుకైన పాత్ర వహించారని ఎటువంటి స్వార్థం లేనివాడు నిసార్ అని అన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ప్రముఖ కవి మోహన్ బైరాగి మాట్లాడుతూ నేటి కవులు కళాకారులు నిసార్‌ను ఆదర్శంగా తీసుకోవాలని ఆయనతో పయనం చేయడం గర్వంగా ఉందని అన్నారు. శాంతి సంఘం నాయకులు కిషన్ రావు మాట్లాడుతూ నేటి యువత పెడదార్లు పడుతున్న ఈ తరుణంలో నిస్సార్ రాసినటువంటి పాటలను నేటికీ ప్రదర్శించే అవకాశం ఉందని వాటిని ప్రజానాట్యమండలి ఉపయోగించాలని హితవు పలికారు.

కుల నిర్మూలన సంఘం నాయకులు రవుఫ్ మాట్లాడుతూ, సమసమాజ స్థాపన కోసం నిస్సార్ చేసిన సేవలను గుర్తు చేశారు, ప్రజానాట్య మండలి రాష్ట్ర అధ్యక్షులు శ్రీనివాస్ మాట్లాడుతూ, వాస్తవానికి నిస్సార్ లేనిలోటు పూడ్చడం చాలా కష్టమని నిస్సార్‌ను ప్రజానాట్యమండలి కోల్పోవడం తీరని లోటని ఆయన అన్నారు.



ఈ కార్యక్రమంలో సిపిఐ మేడ్చల్ జిల్లా కార్యదర్శి మహేష్, హరినాథ్ రావు, స్వామీ, సహదేవ్ రెడ్డి, సదానందం, సాయిలు, ప్రజానాట్యమండలి మండల అధ్యక్షులు బాబు, కార్యదర్శి భాస్కర్, జర్నలిస్టు డప్పు రామస్వామి, తొండ వెంకట్, మల్లేష్, దుర్గయ్య, ప్రజానాట్య మండలి జిల్లా కార్యదర్శి ప్రమీల, రాజేశ్వర్ రావు, కళాకారుడు బాలు, మహమ్మద్ నిసార్ కుమారులు రిజ్వాన్, వారి మనవళ్లు. మహిళా సంఘం నాయకులు ఈ సందర్భంగా క్రాంతి కళాబృందం రాష్ట్ర అధ్యక్షులు వెంకటాచారి పాడిన పాటలు సభికులను ఆలోచింపజేశాయి.



## ఘనంగా దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్‌ఆర్ జయంతి వేడుకలు

ప్రజాపక్షం/నిజాంపేట్:దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి జయంతి వేడుకలను పురస్కరించుకుని కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున వేడుకలు నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ నాయకులు కూన శ్రీశైలం గౌడ్ ఆధ్వర్యంలో షాపూర్ నగర్ చౌరస్తాలో డాక్టర్ రాజశేఖర్ రెడ్డి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలతో కలిసి షాపూర్ నగర్ చౌరస్తా వరకు పాదయాత్రతో వెళ్లి రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వర్గీయ ముఖ్యమంత్రి రాజశేఖర్ రెడ్డి రాష్ట్ర ప్రజలకు చేసిన సేవలు చిరస్మరణీయమని, విద్యార్థులకు ఫీజు రీయంబర్స్‌మెంట్, ఆరోగ్యశ్రీ, 108, 104 లాంటి పథకాలు బడుగు బలహీన వర్గాల ప్రజలకు వరంగా మారయన్నారు. రైతులకు ఉచిత విద్యుత్, ఇందిరమ్మ ఇండ్లు, మహిళా సంఘాలకు పావలా వడ్డీ రుణం లాంటి పథకాలు చిరస్థాయిగా నిలిచిపోతాయన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, మహిళా సంఘాల నాయకులు, యువజన సంఘాల నాయకులు, ఎన్ఎస్‌యుఐ నాయకులు, కాంగ్రెస్ కార్యకర్తలు, రాజశేఖర్ రెడ్డి అభిమానులు పాల్గొన్నారు.

**కుత్బుల్లాపూర్‌లో** : కుత్బుల్లాపూర్ నియోజకవర్గం డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి జయంతి సందర్భంగా ప్రగతి నగర్ లో వైయస్‌ఆర్ విగ్రహానికి పూలమాలవేసి, కేక్ కట్టింగ్ చేసి కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి ఘన నివాళులర్పించారు.



**కూకట్‌పల్లిలో** : కే.పీ.హెచ్.బీ కాలనీ టెంపుల్ బస్టాప్ నందు కూకట్‌పల్లి వై.ఎస్.ఆర్ అభిమాన సంఘం సభ్యులు శేరి సతీష్ రెడ్డి, బండి మధుసూదన్ రెడ్డి, శివారెడ్డి, ఉపేందర్ రెడ్డి, జి.ఎల్.రెడ్డి, అరవింద్ రెడ్డి తదితరుల ఆధ్వర్యంలో ఘనంగా నివాళులు అర్పించి అన్నదాన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిధులుగా మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సింగిరెడ్డి హరివర్ధన్ రెడ్డి కూకట్‌పల్లి నియోజికవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి టిపిసిసి వైస్ ప్రెసిడెంట్, బండి రమేష్, టీపీసిసి అధికార ప్రతినిధి సత్యం శ్రీరంగం, కాంగ్రెస్ నాయకులు,తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

ప్రజాపక్షం/వికారాబాద్ ప్రతినిధి :వికారాబాద్ పట్టణంలోని కలెక్టర్ కార్యాలయంకు వెళ్లే రోడ్డులో ,లారీల అడ్డా దగ్గర సోమవారం రాత్రి రోడ్డు ప్రమాదం .జరిగి మద్గుల్ చిట్టంపల్లి గ్రామానికి చెందిన తల్వార్ యాదయ్య అనే యువకుడు బైక్‌పై వెళ్తుండగా ,ఎదురుగా ఉన్న లారీని బలంగా ఢీకొన్నాడు . ఈ ఘనటలె యువకుడు తీవ్రంగా గాయపడగా ,స్థానికులు వెంటనే ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ యాదయ్య మృతి చెందాడు ,అతడి మృతి పట్ల కుటుంబసభ్యులు ,సేహితులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నాట్లు తెలిపారు



# క్రీడ

## వింబుల్డన్‌లో ఒత్తిడి.. భారత్–పాక్ మ్యాచ్ లాంటిది



విరాట్ కోహ్లీ

క్రికెట్‌తో పోలిస్తే వింబుల్డన్ సెంటర్ కోర్టులోనే ఒత్తిడి ఎక్కువగా ఉంటుందని టీమిండియా క్రికెటర్ విరాట్ కోహ్లీ అన్నారు. వింబుల్డన్ టెన్నిస్ టోర్నీలో భాగంగా జరిగిన జకోవిచ్ వర్సెస్ అలెక్స్ డీ మినార్ మ్యాచ్‌ను కోహ్లీ తిలకించాడు. అయితే ఆ సమయంలో మాజీ టెన్నిస్ ప్లేయర్, కామెంటేటర్ విజయ్ అమృత్‌రాజ్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో కోహ్లీ మాట్లాడారు. కిక్కిరిసిన స్టేడియంలో క్రికెట్ ఆడడం కన్నా.. వింబుల్డన్‌లోని సెంటర్ కోర్టులో టెన్నిస్ మ్యాచ్ ఆడడమే తీవ్ర వత్తిడిని కలిగిస్తుందని కోహ్లీ అభిప్రాయపడ్డాడు. కేవలం ఇండియా, పాకిస్థాన్ క్రికెట్ మ్యాచ్‌లో ఉండే వత్తిడి మాత్రమే వింబుల్డన్ మ్యాచ్‌లతో పోల్చవచ్చు అన్నారు. ప్రేక్షులతో నిండిపోయిన స్టేడియంలో ఆడడం వత్తిడితో కూడుకున్నదే అని, కానీ వింబుల్డన్ సెంటర్ కోర్టులో ఆడితే ఆ వత్తిడి మరోలా ఉంటుందని కోహ్లీ చెప్పాడు. ఎందుకంటే టెన్నిస్ కోర్టులో ప్రేక్షకులు మరీ దగ్గరగా కూర్చుకుంటారని చెప్పారు. క్రికెట్‌లో మేం బ్యాటింగ్ చేస్తున్నప్పుడు ప్రేక్షకులు చాలా దూరంగా ఉంటారని, వాళ్ల కామెంట్లు మనకు వినబడవు. కేవలం బౌండరీ వద్ద ఫీల్డింగ్ చేస్తున్నప్పుడు మాత్రమే ప్రేక్షకుల అరుపులు వినిపిస్తాయన్నారు. అక్కడ వ్యక్తిగత స్కిల్‌తో పెద్ద ఆటపై ప్రభావం ఏమీ ఉండదన్నారు. కానీ టెన్నిస్‌లో మాత్రం టెన్షన్ అంతా లైన్ మీదే ఆధారపడి ఉంటుందని కోహ్లీ అన్నాడు. బేస్ లైన్‌కు కాస్త అటు ఇటు పడినా ఫలితం మరోలా ఉంటుందన్నారు. టెన్నిస్‌లో ఆటగాళ్లకు వత్తిడి ఎక్కువగా ఉంటుందన్నాడు. ఇక సెంటర్ కోర్టులో ఆడే మ్యాచ్‌లకు ఆ ప్రెజర్ మరీ అధికంగా ఉంటుందన్నారు. ఆ అంశంలో టెన్నిస్ ఆటగాళ్ల పట్ల అమితమైన గౌరవం ఉందన్నాడు. వరల్డ్‌కప్‌లోని ఇండోపాక్ మ్యాచ్‌లు, లేదా సెమీస్, ఫైనల్ మ్యాచుల్లో మాత్రమే తీవ్ర వత్తిడి ఉంటుందని, కానీ టెన్నిస్‌లో క్వార్టర్స్ నుంచే ఆ ఫీల్ ఉంటుందన్నారు.



## వన్డే స్క్వాడ్‌లో నంబర్ 1 బౌలర్

### కెప్టెన్ బ్రంట్ ఫిట్..

స్వదేశంలో భారత మహిళ జట్టుతో జరుగుతున్న టీ20 సిరీస్‌లో వెనకబడిన ఇంగ్లాండ్ వన్డే సిరీస్‌పై గురి పెట్టింది. గాయంతో పొట్టి సిరీస్ చివరి మూడు మ్యాచ్‌లకు దూరమైన కెప్టెన్ నాట్ సీవర్ బ్రంట్ కెప్టెన్‌గా కోలుకోవడంతో వన్డే ఫైట్‌కు సిద్ధమవుతోంది ఆతిథ్య జట్టు. భారత జట్టుతో జరుగబోయే మూడు వన్డేల కోసం సెలెక్టర్లు మంగళవారం బలమైన స్క్వాడ్‌ను ప్రకటించారు. 15మందితో కూడిన బృందంలో నంబర్ 1 బౌలర్ ఎకిల్‌స్టోన్, బౌచర్ చోటు దక్కించుకున్నారు. పొట్టి సిరీస్ తదుపరి మ్యాచ్‌లకు దూరమైన నాట్ సీవర్ బ్రంట్ కోలుకొని ఫిట్‌నెస్ సాధించింది. ఆమె వన్డే సిరీస్‌లో అన్ని మ్యాచ్‌లు ఆడుతుందని ఆశిస్తున్నాం. టీ20లో భారత జట్టు అద్భుతంగా ఆడి మమ్మల్ని ఓడించింది. ఈ సిరీస్‌లో జట్టుగా మేము చాలా విషయాలు నేర్చుకున్నాం. వన్డే సిరీస్‌లో నిలకడగా ఆడడంపై మేము దృష్టి సారిస్తున్నాం అని ఇంగ్లాండ్ కోచ్ చార్లొట్టె ఎడ్వర్డ్స్ వెల్లడించింది.

టీమిండియా, ఇంగ్లాండ్‌ల మధ్య మూడు వన్డేల సిరీస్ సౌంథాంప్టన్ వేదికగా జూలై 16న మొదలవ్వనుంది. 19న లార్డ్స్, 22న చెస్టర్ లీ స్ట్రీట్‌లో తదుపరి రెండు మ్యాచ్‌లు నిర్వహించనున్నారు. ఐదు టీ20ల సిరీస్‌లో భారత్ రెండు మ్యాచుల్లో జయభేరి మోగించింది. నిర్ణయాత్మక మూడో మ్యాచ్‌లో ఇంగ్లాండ్ 5 వికెట్లతో గెలుపొంది సిరీస్‌లో నిలిచింది. నాలుగో టీ20 మాంచెస్టర్‌లోని ఓల్డ్ ట్రఫోర్డ్‌లో జూలై 9న, ఐదోది బర్మింగ్‌హామ్‌లో జూలై 12న జరుగనుంది.

**ఇంగ్లాండ్ వన్డే స్క్వాడ్ :** నాట్ సీవర్ బ్రంట్(కెప్టెన్), ఎమ్ అర్లాట్ సోఫియా డంక్లే, ఎమ్మా లాంబ్, టమ్మీ బ్యూమంట్(వికెట్ కీపర్), అమీ జోన్స్(వికెట్ కీపర్), ఎమ్మా క్రాస్, అలిసే దేవిడ్‌సన్ రిచర్డ్స్, చార్లీ డీన్ సోఫీ ఎకిల్‌స్టన్ లారెన్ ఫైలెర్ మియా బౌచియర్, అలిసే క్యాప్సే, కేట్ లిన్సే స్మిత్, లారెన్ బెల్.

## 'రూట్' వికెట్‌పై వివాదం.. నో బాల్ ప్రచారాన్ని తిప్పికొట్టిన ఎంసిసి



బర్మింగ్‌హమ్ టెస్టులో టీమిండియా చిరస్మరణీయ విజయంతో సిరీస్ సమం చేసింది. ఆద్యంతం ఇంగ్లాండ్‌పై పైచేయి సాధిస్తూ వచ్చిన టీమిండియాకు ఆకాశ్ దీప్ గెలుపు గుర్రమయ్యాడు. ఇన్‌స్వింగర్‌తో డేంజరస్ జో రూట్‌ను ఆకాశ్ బౌల్డ్ చేయడం మ్యాచ్‌కే హైలైట్. అతడి వికెట్‌తో ఇంగ్లాండ్ కోలుకోలేకపోయింది. అయితే.. రూట్ వికెట్‌పై మీడియాలో రాద్ధాంతం మొదలైంది. ఆకాశ్ నో బాల్ వేశాడని, అసలు రూట్ ఔటే కాదనే చర్చ ఊపందుకుంది. ఇంగ్లాండ్ మాజీ ఆటగాళ్లు కూడా అవునంటూ గొంతుకలిపారు. సోషల్ మీడియాలో ముదురుతున్న ఈ వివాదంలో అర్థం లేదని పేర్కొన్న మెరిలెబొనే క్రికెట్ క్లబ్.. ఆకాశ్ వేసిన బంతి సరైనదేనని స్పష్టం చేసింది. అసలేం జరిగిందంటే.. ఐదో రోజు తొలి సెషన్ పదో ఓవర్లో ఆకాశ్ సంధించిన రెండో బంతిని అడ్డుకోలేక రూట్ క్లీన్ బౌల్డయ్యాడు. ఇన్‌స్వింగ్ అయిన బాల్ వికెట్లను గిరాటేయడంతో అతడు నిరాశగా పెవిలియన్ చేరాడు. కానీ, ఆ తర్వాత ఫుటేజ్‌లో ఆకాశ్ కాలు క్రీజులోని వెనక గీతకు అవతల ఉన్నట్టు కనిపించింది. దాంతో, అది బ్యాక్ ఫుట్ నో బాల్ అని, అంపైర్ గుర్తించకపోవడం వల్ల రూట్ బలయ్యాడని వార్తలు వైరలయ్యాయి. ఈ విషయంపై ఎంసీసీ స్పందిస్తూ ఆకాశ్ సరైన బంతినే వేశాడని అంది.

# మహిళ

## ఫోకస్



## ఆరోగ్య సమస్యలు ఎన్నో!

మహిళలు ఎదుర్కొనే ఆరోగ్య సమస్యలు ఎన్నో... వీటిలో కొన్ని స్వయంకృతాలు కూడా. ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేయడం... బాధ్యతల పేరుతో పట్టించుకోకపోవడం... వైద్య నిపుణులను సంప్రదించకపోవడం.... తాత్కాలిక ఉపశమనం కోసం సొంత వైద్యం.. ఇలా ఎన్నో కారణాలు మహిళల ఆరోగ్యాన్ని మరింత దిగజారుస్తున్నాయి. మహిళలు సమాజ నిర్మాణంలో కీలక పాత్ర పోషిస్తున్నా, వారి ఆరోగ్యం మాత్రం చాలాసార్లు నిర్లక్ష్యం చేయబడుతోంది. కుటుంబ బాధ్యతలు, సామాజిక ఆంక్షలు, ఆర్థిక పరిమితులు, శారీరకమానసిక ఒత్తిళ్లు, ఆరోగ్యంపై అవగాహన లోపం వంటి అనేక కారణాల వల్ల మహిళలు అనేక ఆరోగ్య సమస్యలను ఎదుర్కొంటున్నారు. అమ్మాయి రజస్వల అయింది మొదలు సమస్యలు పెరగడం తరచు చూస్తునే ఉన్నాం. మెనోపాజ్ వరకు అనేక గైనకాలజికల్ సమస్యలు తప్పడం లేదు. వీటిలో డిస్మెనోరియా (తీవ్రమైన బలహీనత, పొట్ట నొప్పి, వాంతులు), మెనోరేజియా (ఎక్కువగా, ఎక్కువ రోజులు రక్తస్రావం) వంటి సమస్యలు సాధారణంగా కనిపిస్తాయి. ఎక్కువగా యువతుల్లో కనిపించే సమస్య పాలిసిస్టిక్ ఓవరీ సిండ్రోమ్ (పిసిఒ). ఇందులో హార్మోన్ల అసమతుల్యత, మెన్స్ తారుమారవడం, మొటిమలు, శరీరబరువు పెరగడం మొదలైనవన్నీ ఉంటాయి. వీటికితోడు గర్భధారణ సంబంధిత సమస్యలు కూడా వెంటాడుతుంటాయి. గర్భధారణ జరగకపోవడం, ఆలస్యం కావడం తదితర సమస్యలు చుట్టుముడతాయి. గర్భధారణ సమయంలో రక్తపోటు, డయబెటిస్, టైఫాయిడ్, న్యూట్రీషన్ లోపం వంటివి తల్లికి, శిశువుకి హానికరమవుతాయి. ప్రసవానంతర కాలంలో శరీర బలహీనత, నిద్రలేమి, డిప్రెషన్ మొదలైనవన్నీ అత్యంత ముఖ్యమైన సమస్యలు. రుతుస్రావం పూర్తిగా ఆగిపోయే దశ (మెనోపాజ్)లో హార్మోనల్ మార్పులు, ఎముకల బలహీనత, మానసిక అస్థిరత, యూరినరీ ఇన్‌ఫెక్షన్లు వంటి సమస్యలు తలెత్తుతాయి. ఇంతేకాదు, మహిళలు తరచూ మానసిక ఒత్తిడికి గురవుతారు. గృహ హింస, లైంగిక వేధింపులు, పిల్లల భవిష్యత్తుపై భయాలు, ఉద్యోగ ఒత్తిడి లాంటివి కారణాలుగా ఉంటాయి. పుట్టిన పిల్లవాడిని చూసుకోవడంలో వచ్చే ఒత్తిడి, నిద్రలేమి, హార్మోనల్ మార్పులు వల్ల తల్లులు తీవ్ర మానసిక సమస్యలను ఎదుర్కొంటారు. తల్లి, భార్య, ఉద్యోగి, కుమార్తె వంటి అన్ని పాత్రలనూ సమతుల్యత నెరపాలని ప్రయత్నిస్తూ శారీరకమానసిక ఆరోగ్యం దెబ్బతింటుంది. ఒక్క మాటలో చెప్పాలంటే, అమ్మాయిగా పుట్టింది మొదలు, చివరి శ్వాస విడిచేవరకూ ఏదో ఒకరమైన ఆరోగ్య సమస్య వెంటాడుతునే ఉంటుంది. అనేకానేక కారణాలతో చాలా మంది తమ ఆరోగ్య సమస్యలను వెల్లడించకపోవడం కష్టాలను పెంచుతున్నది. సిగ్గు, మొహమాటం, సామాజిక కట్టుబాట్లు, స్వయం ప్రకటిత నియమాలు.. ఇలా లెక్కలేనని సంకెళ్లు తగిలించుకున్న మహిళ స్వేచ్ఛగా ముందుకొచ్చి, సమస్యలను వివరించి, చర్చించి, తగిన వైద్య సేవలు పొందడం ఒక్కటే ఏకైక పరిష్కారం.

## జస్టిస్ అమరేశ్వరి



(జులై 10న జయంతి)

భారత దేశంలో తొలి మహిళా న్యాయమూర్తి జస్టిస్ కోనమనేని అమరేశ్వరి (జులై 10, 1928–జులై 25, 2009) యావత్ మహిళాలోకానికి మార్గదర్శకురాలు. ఆమెను స్ఫూర్తిగా తీసుకొని ఎంతో మంది మహిళల న్యాయవాదులుగా, న్యాయమూర్తులుగా ఎదుగుతున్నారు. సుప్రీం కోర్టు తొలి మహిళా ప్రధాన న్యాయమూర్తిగా 2027లో జస్టిస్ బివి నాగరత్న పదవీ స్వీకారం చేయనున్నారంటే, అందుకు మార్గాన్ని నిర్దేశించిన ఘనత జస్టిస్ అమరేశ్వరికే దక్కుతుంది. ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరు జిల్లా అప్పికట్ల గ్రామములో ఒక వ్యవసాయ కుటుంబములో 1928, జులై 10వ తేదీన జన్మించిన అమరేశ్వరికి 14వ ఏటనే వివాహం జరిగింది. అయినప్పటికీ, చదువుకోవాలన్న ఆమె పట్టుదలకు, భర్త ప్రోత్సాహం కూడా లభించడంతో విద్యాభ్యాసాన్ని కొనసాగించారు. ఆంధ్ర విశ్వ కళాపరిషత్తు నుండి రాజకీయ శాస్త్రం, చరిత్రలో 1948 సంవత్సరములో ఎంఎ పట్టా పొందారు. అనంతరం న్యాయశాస్త్రంలోనూ పట్టా తీసుకొని, మద్రాసు ఉన్నత న్యాయస్థానములో న్యాయవాదిగా పనిచేశారు. 1960–1961లో బార్ కౌన్సిల్ సభ్యురాలిగా వ్యవహరించారు. 1978, ఏప్రిల్ 29ద ఆంధ్ర ప్రదేశ్ ఉన్నత న్యాయస్థానంలో న్యాయమూర్తిగా నియమితులై, దేశంలోనే తొలి మహిళా న్యాయమూర్తిగా పేరొందారు. పదమూడున్నర సంవత్సరాలు న్యాయమూర్తిగా పనిచేసి 1990లో పదవీ విరమణ చేశారు. భారత మహిళా న్యాయవాదుల సంఘానికి ఉపాధ్యక్షురాలిగా, ఆంధ్ర ఉన్నత న్యాయస్థానంలోని న్యాయవాదుల సంఘానికి ఉపాధ్యక్షురాలిగా సేవలు అందించారు. ఆమె జీవితం మహిళలకు స్ఫూర్తిదాయకం.

## సామాన్య లక్షణం 'అనీమియా'



మహిళల్లో చాలా ఎక్కువగా కనిపించే లక్ష్యణం రక్తహీనత లేదా అనీమియా. ఇనుము, విటమిన్ బి12 లోపంతో ఈ సమస్య ఎదురవుతుంది. ఇది ముఖ్యంగా పేద మహిళలలో ఎక్కువగా ఉంటుంది. అలసట, శ్వాసకోశ సమస్యలు, మూర్ఛ వంటి లక్షణాలు కనిపిస్తే అనీమియాగా అనుమానించి, తగిన వైద్య సేవలు పొందాలి. కాగా, మహిళల శరీరం గర్భధారణ, బాల్యం పోషణలో కాల్షియాన్ని ఎక్కువగా వినియోగిస్తుంది. ఫలితంగా కల్షియం శరీరంలో తగు పాళ్లలో లేకపోవడం వల్ల ఎముకల బలహీనత, కీళ్ల నొప్పులు వస్తాయి. ప్రోటీన్, మైక్రోన్యూట్రియంట్ల లోపం కూడా మహిళల్లో ఎక్కువ. విటమిన్ 'డి', ఐరన్, ఫోలిక్ యాసిడ్ వంటి పోషకాల లోపం వల్ల శరీరం బలహీనపడుతుంది. కాగా, మారుతున్న జీవన శైలిలో భాగంగా ఊబకాయం సాధారణ సమస్యగా మారింది. హార్మోనల్ అసమతుల్యత, అధిక ఫాస్ట్ ఫుడ్ వినియోగం, శారీరక శ్రమ లేకపోవడం కారణంగా ఊబకాయం పెరుగుతోంది. ఇది ఇతర అనారోగ్యాలకు ద్వారమవుతోంది. టైప్ 2 డయాబెటిస్, రక్తపోటు సమస్యలు 35 ఏళ్ల తరువాత బాగా కనిపిస్తాయి. హైపోథైరాయిడిజమ్, హైపెర్‌థైరాయిడిజమ్ అనే రెండు రకాల థైరాయిడ్ సమస్యల వల్ల మహిళల్లో బరువు పెరగడం, చర్మం పొడిబారడం, మానసిక ఒత్తిడి వంటి లక్షణాలు కనిపిస్తాయి. అవగాహన లోపం వల్ల గర్భస్రావం, గర్భాశయ ఇన్ఫెక్షన్లు పెరుగుతున్నాయి. నిత్యం ఏదో ఒక రీతిలో ఎదురవుతున్న లైంగిక హింస మహిళల మానసిక ఆరోగ్యంపై దీర్ఘకాలిక ప్రభావాలు చూపుతున్నది. అనధికార గర్భస్రావాల వల్ల ఎంతో మంది మహిళలు ప్రాణాలను కోల్పోతున్నారు. పేద మహిళలకు సురక్షితమైన ప్రసవ, గర్భనిరోధక పద్ధతులపై అవగాహన లేదు. మహిళలలో గుండె పోటు లక్షణాలు పురుషులకంటే భిన్నంగా ఉంటాయి. ఈ లక్షణాలను గుర్తిండం కష్టం. శరీరంలో నీరసం, శ్వాసతీవ్రత, ఛాతీ గడ్డలు ఉంటే, ముందు జాగ్రత్తలు తీసుకోవాలి. కాగా, బ్రెస్ట్ కేన్సర్ ఎక్కువగా మధ్యవయసు దాటిన వారిలో కనిపిస్తుంది. రెగ్యులర్ స్క్రీనింగ్, సెల్ఫ్ ఎగ్జామినేషన్ ద్వారా ముందుగా గుర్తించడం ముఖ్యం.

## పేదల సమస్యలే ఎజెండా

### ఎర్ర జెండా స్ఫూర్తితో భవిష్యత్తు పోరాటాలకు సిద్ధం కావాలి

### సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు



**ప్రజాపక్షం/కారేపల్లి :** పేద ప్రజల సమస్యలే కమ్యూనిస్టు పార్టీ ప్రధాన ఎజెండా అని, శత వసంతాల జరుపుకుంటున్న ఎర్రజెండా స్ఫూర్తితో పోరాటాలకు సిద్ధం కావాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. సిపిఐ కారేపల్లి మండల 17వ మహాసభ మంగళవారం మాదారం గ్రామంలో తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట యోధుడు పాపినేని వెంకయ్య కప్పెర వేదాద్రి ప్రాంగణంలో ఘనంగా జరిగింది. మహాసభ సందర్భంగా సిపిఐ శ్రేణులు భారీ ప్రదర్శన నిర్వహించారు. మహాసభకు ముఖ్య అతిథిగా హాజరై కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ పేద ప్రజల పోరాటాలకు నాయకత్వం వహించేదే కమ్యూనిస్టు పార్టీలేనన్నారు. అటువంటి కమ్యూనిస్టు పార్టీలను లేకుండా చేయాలని కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ఆలోచన చేస్తుందన్నారు. అమాయక ఆదివాసీలను ఆపరేషన్ కాగార్ పేరుతో ఎన్‌కౌంటర్‌లు చేయడం దారుణమన్నారు. తక్షణమే మావోయిస్టులతో చర్చలు జరపాలని కేంద్రాన్ని డిమాండ్ చేశారు. కమ్యూనిస్టు పార్టీలను లేకుండా చేయటం ఎవరి తరం కాదన్నారు. సమస్యల పరిష్కారానికి ప్రజలు ఐక్యంగా ఎర్రజెండా నాయకత్వంలో పోరాటాలకు సిద్ధం కావాల్సిన అవసరం ఉందన్నారు. అమెరికా కనుసైగల్లో మోదీ తన ప్రభుత్వం నడిపే విధానాన్ని వ్యతిరేకించాలని కూనంనేని సాంబశివరావు పిలుపునిచ్చారు. మహాసభలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు భాగం హేమంతరావు మాట్లాడతూ హిందుత్వ ముసుగులో దేశం అభివృద్ధికి దూరమవుతుందన్నారు. రైతు కార్మిక వ్యతిరేక చట్టాలు తీసుకువచ్చి ఆ వర్గాలను విచ్ఛిన్నం చేసే కుట్ర జరుగుతుందన్నారు. ఇప్పటికే దేశంలో నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకుని వచ్చి వాటిని అమలు చేసే ప్రయత్నం జరుగుతుందని, దీంతో కార్మిక వర్గం వారి కనీస హక్కులు కోల్పోయే ప్రమాదం ఉందని, అందుకు వ్యతిరేకంగా జరిగే దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మెలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. అనంతరం 47 మందితో సిపిఐ కారేపల్లి మండల నూతన కౌన్సిల్‌ను ఎన్నుకున్నారు. 17మందితో నూతన కార్యవర్గం ఎన్నికైంది. సిపిఐ మండల అధ్యక్షుడిగా పాపినేని సత్యనారాయణ, సహాయ కార్యదర్శులుగా బానోత్ దళ్‌సింగ్, చెన్నంశెట్టి బూసయ్య ఎన్నికయ్యారు. మహాసభలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు రావి శివరామకృష్ణ, సిహెచ్ సీతామాలక్ష్మి, సమితి సభ్యులు ఉంగరాల సుధాకర్, ఎఐటియుసి డోలమైన్స్ ప్రధాన కార్యదర్శి ఈరు నాయక్, గౌరవ అధ్యక్షుడు కొల్లి వీరయ్య, పార్టీ ప్రజాసంఘాల నాయకులు పాపినేని సత్యనారాయణ, చెన్నంశెట్టి భూషయ్య, బట్టు సంగయ్య, తాత వెంకటేశ్వర్లు, బొమ్మల కృష్ణ, మేదరమట్ల ప్రేమ్‌చంద్, పోతనబోయిన రవి, గోవింద్, తదితరులు పాల్గొన్నారు.

## సార్వత్రిక సమ్మెకు సంపూర్ణ మద్దతు

### సిపిఐ జాతీయ సమితి సభ్యుడు పల్లా వెంకటరెడ్డి

### 15న దేవరకొండలో సిపిఐ జిల్లా మహాసభ : జిల్లా కార్యదర్శి సత్యం



**ప్రజాపక్షం/నల్లగొండ ప్రతినిధి :** కేంద్రంలో మోదీ ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈ నెల 9న పది కేంద్ర కార్మిక సంఘాలు 17డిమాండ్స్‌తో చేపట్టిన దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో అన్ని వర్గాల ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని సిపిఐ జాతీయ సమితి సభ్యుడు పల్లా వెంకటరెడ్డి పిలుపునిచ్చారు. దేశవ్యాప్త సమ్మెకు సిపిఐ సంపూర్ణ మద్దతును ప్రకటిస్తుందన్నారు. సిపిఐ నల్లగొండ జిల్లా కార్యవర్గ సమావేశం స్థానిక మగ్దూమ్ భవనంలో మంగళవారం జరిగింది. ఈ సమావేశానికి పల్లా వెంకటరెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి ప్రభుత్వం మూడవసారి అధికారంలోకి వచ్చిన తర్వాత కార్మికులు, రైతులపైన దాడి తీవ్రతరం చేసిందన్నారు. కార్మికులు ఎన్నో పోరాటాలు చేసి సాధించుకున్న కార్మిక చట్టాలను రద్దుచేసి నాలుగు లేబర్ కోడ్‌లుగా తీసుకువచ్చి పెట్టుబడిదారులకు కొమ్ము కాస్తూ కార్మిక వర్గానికి తీవ్రమైన అన్యాయానికి గురి చేస్తుందని ఆరోపించారు. కార్మికులు చేపట్టిన సార్వత్రిక సమ్మెతోనైనా కేంద్ర ప్రభుత్వం దిగివచ్చి నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని పల్లా వెంకటరెడ్డి డిమాండ్ చేశారు. సమావేశంలో సిపిఐ జిల్లా కార్యదర్శి, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం మాట్లాడుతూ నల్లగొండ జిల్లాలో సిపిఐ గ్రామ, మండల మహాసభలు విజయవంతంగా పూర్తి చేసుకొని ఈనెల 15వ తేదీన దేవరకొండ పట్టణంలో నల్లగొండ 23వ జిల్లా మహాసభ జరుపుకోవడం జరుగుతుందని తెలిపారు. ఈ మహాసభలో జిల్లా సమగ్ర అభివృద్ధి, సంస్థాగతంగా పార్టీని బలోపేతం చేసుకోవడంతోపాటు ప్రజా ఉద్యమాలపై సుదీర్ఘంగా చర్చించి భవిష్యత్ కార్యాచరణ రూపొందించుకోవడం జరుగుతుందని ఆయన తెలిపారు. జిల్లాలో పెండింగ్‌లో ఉన్న సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేయాలని సిపిఐ అనేక దఫాలుగా ఉద్యమాలు, పోరాటాలు నిర్వహించడం జరిగిందన్నారు. గత పాలకులు చేసిన నిర్లక్ష్యం వల్లనే జిల్లాలో సాగునీటి ప్రాజెక్టులు పూర్తి కాలేదన్నారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తి చేయడం కోసం పనులు ప్రారంభించిందని, అట్టి పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని ఆయన కోరారు. రాష్ట్రంలో రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో సిపిఐ అభ్యర్థులు అధిక స్థానాలు గెలుపొందేందుకు పార్టీ నాయకులు కార్యకర్తలు కృషి చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పల్లా నరసింహారెడ్డి, జిల్లా సహాయ కార్యదర్శులు పల్లా దేవేందర్‌రెడ్డి, లోడింగి శ్రవణ్‌కుమార్, కార్యవర్గ సభ్యులు పబ్బు వీరస్వామి, ఆర్.అంజాచారి, బొడ్డుపల్లి వెంకటరమణ, బంటు వెంకటేశ్వర్లు, బొల్గురి నరసింహ, గురిజ రామచంద్రం, నల్పరాజు రామలింగయ్య, టి.వెంకటేశ్వర్లు, ఉజ్జిని యాదగిరిరావు తదితరులు పాల్గొన్నారు.

## చేవెళ్ల డిక్లరేషన్ అమలెప్పుడు?



### అంబేద్కర్ అభయహస్తం కోసం విధి విధానాలు విడుదల చేయాలి

### డిహెచ్‌పిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అనిల్ కుమార్ డిమాండ్

**ప్రజాపక్షం/వరంగల్ ప్రతినిధి :** కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి 18నెలలు పూర్తవుతున్న చేవెళ్ల ఎస్‌సి, ఎస్‌టి డిక్లరేషన్ ఎందుకు అమలుకు నోచుకోవడం లేదని డిహెచ్‌పిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారుపాక అనిల్‌కుమార్ రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. అంబేద్కర్ అభయ హస్తం కోసం విధివిధానాలు తక్షణమే రూపొందించాలని. ఆయన డిమాండ్ చేశారు. డిహెచ్‌పిఎస్ 3వ మహాసభలు శివనగర్‌లో సంఘీ ఎలేందర్, తాళ్లపల్లి జాన్ పాల్ అధ్యక్షతన మంగళవారం నిర్వహించారు. సమావేశంలో అనిల్‌కుమార్ మాట్లాడుతూ ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ దళితల కోసం చేవెళ్ల ఎస్‌సి, ఎస్‌టి డిక్లరేషన్ హామీ ఇచ్చారని హామీ అమలులో నిర్లక్ష్యం చేస్తురన్నారు. ప్రభుత్వం అంబేద్కర్ అభయహస్తం కోసం రూ.2000 కోట్ల రూపాయలు బడ్జెట్‌లో ప్రకటించారని, కానీ పథకం అమలుకు మార్గదర్శకాలు రూపొందించలేదన్నారు. ఎస్‌సి, ఎస్‌టి కేసులలో బాధితులకు నష్టపరిహారం అందించకుండా ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తుందన్నారు. ఎస్‌సి కార్పోరేషన్ రుణాలు తక్షణమే వాటిని విడుదల చేయాలని కోరారు. రాష్ట్రంలో దళితులు సాగు చేసుకుంటున్న ప్రభుత్వ భూములకు పట్టాలు ఇవ్వాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సమావేశంలో సిపిఐ జిల్లా కార్యదర్శి మేకల రవి, జిల్లా సహాయ కార్యదర్శి షేక్ బాషి మియా, పనస ప్రసాద్, డిహెచ్‌పి ఎస్ వివిధ మండలాల అధ్యక్ష, కార్యదర్శులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## భూదాన్ భూములు కాపాడండి

### సిపిఐ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య డిమాండ్

**ప్రజాపక్షం/షాద్‌నగర్:** అన్యాక్రాంతమైన భూదాన్, అసైన్డ్ భూములను కబ్జా కోరుల నుంచి రక్షించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని సిపిఐ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య డిమాండ్ చేశారు. మంగళవారం షాద్‌నగర్‌లో సిపిఐ ఫరూఖ్‌నగర్ మండల 6వ మహాసభను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జంగయ్య మాట్లాడుతూ రంగారెడ్డి జిల్లాలో భూదాన్, అసైన్డ్, గైరాన్ వంటి ప్రభుత్వ భూములు వేల ఎకరాలు ఉన్నాయని, వాటిని కాపాడాలని ప్రభుత్వాన్ని కోరారు. సిపిఐ వంద ఏళ్ల శత జయంతి ఉత్సవాలను రంగారెడ్డి జిల్లా వ్యాప్తంగా, గ్రామ, పట్టణ కేంద్రాల్లో ఘనంగా నిర్వహించాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. సిపిఐ రాష్ట్ర సమితి సభ్యుడు పానుగంటి పర్వతాలు మాట్లాడుతూ రానున్న కాలంలో జిల్లా వ్యాప్తంగా భూపోరాటాలు నిర్వహించి ఇండ్ల స్థలాలు లేని నిరుపేదలకు గుడిసెలు వేయించి భూ పోరాటం చేస్తామన్నారు. సభలో ఫరూఖ్‌నగర్ మండల సిపిఐ నూతన కార్యవర్గం ఎన్నిక జరిగింది. కార్యదర్శిగా లింగం నాయక్, సహాయ కార్యదర్శిగా పవన్ చౌహాన్, రమేష్‌తోపాటు 9మంది కార్యవర్గ సభ్యులుగా, 21మంది కౌన్సిల్ సభ్యులను ఎన్నుకున్నట్టు జంగయ్య తెలిపారు. మహాసభలో మండల నిర్మాణ బాధ్యులు, జిల్లా కార్యవర్గ సభ్యులు శ్రీను, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బుద్దుల జంగయ్య, ప్రజాసంఘాల నాయకులు చంద్రబాబు, గోవింద్ నాయక్, రమేష్, రాజు, శంకర్ తదితరులు పాల్గొన్నారు.



## ప్రజల పక్షాన నిలిచేది కమ్యూనిస్టులే





### సిపిఐ భద్రాద్రి జిల్లా కార్యదర్శి సాబీర్ పాషా

**ప్రజాపక్షం/కరకగూడెం :** ప్రజల పక్షాన నిలిచేది కమ్యూనిస్టులేనని సిపిఐ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి సాబీర్‌పాషా అన్నారు. కరకగూడెం మండలం కేంద్రంలో మంగళవారం సిపిఐ మండల సమావేశాన్ని నిర్వహించారు. సమావేశానికి సాబీర్‌పాషా, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అయోధ్య హాజరయ్యారు. ఈసందర్భంగా సాబీర్ పాషా మాట్లాడుతూ వందేళ్ళ చరిత్ర కలిగిన ఏకైక పార్టీ సిపిఐ అన్నారు. గ్రామస్థాయి నుంచి పార్టీ బలోపేతానికి కృషి చేయాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. గ్రామాలలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి ఉద్యమాలు చేయాలన్నారు. స్థానిక సంస్థల్లో మన ప్రాతినిధ్యం ఉండే విధంగా కార్యచరణ రూపొందించుకోవాలని పార్టీ నాయకులను కోరారు. కేంద్ర ప్రభుత్వం 12 గంటల పని విధానాన్ని తీసుకొచ్చి కార్మికుల నడ్డి విరుస్తుందని, దానికి వ్యతిరేకంగా సార్వత్రిక సమ్మెకు సిపిఐ సంపూర్ణ మద్దతు తెలుపుతుందన్నారు. గిరిజన నాయకులు గిరిజనులను నిర్ల క్ష్యం చేస్తూ వారికి అభివృద్ధి ఫలాలు అందకుండా చేస్తున్నారన్నారు. ఆదివాసి గ్రామాలలో అభివృద్ధికి ఎర్రజెండా అండగా ఉంటుందన్నారు. అనంతరం మహాసభలో 12 మంది తో సిపిఐ మండల నూతన కమిటీని ఎన్నుకున్నారు. కరకగూడెం మండల కార్యదర్శిగా వంగరి సతీష్, సహాయ కార్యదర్శిలుగా బోడ ముత్తయ్య, బుడుగం సతీష్, కమిటీ సభ్యులుగా 12 మందిని ఎన్నుకున్నారు. మూడోసారి మండల కార్యదర్శి ఎన్నికైన వంగరి సతీష్ ను జిల్లా నాయకులు రాష్ట్ర నాయకులు అభినందించారు. సమావేశంలో ఉన్న లక్ష్మి కుమారి, సరేందర్‌రెడ్డి పుల్లారెడ్డి, మండలంలోని వలస ఆదివాసీలు నాయకులు, వివిధ గ్రామాల నాయకులు పాల్గొన్నారు.



# స్థానికం REGIONAL NEWS

నల్లగొండ, సూర్యాపేట యాదాద్రి, గద్వాల

## ముఖ్యమంత్రి సభ స్థలాన్ని పరిశీలించిన జిల్లా కలెక్టర్, ఎస్‌పి



**ప్రజాపక్షం/సూర్యాపేట:** ఈనెల 14న నూతన రేషన్‌కార్డుల పంపిణీ కార్య క్రమానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తిరుమలగిరికి వస్తున్న సందర్భంగా సభ స్థలాన్ని, ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ తేజస్‌నందలాల్ పవార్ మంగళ వారం పరిశీలించారు. ఆయన వెంట ఎస్‌పి కె.నర్సింహ, తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేలు, జిల్లా అదనపు కలెక్టర్ రాంబాబు, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు చెవిటి వెంకన్నయాదవ్ పాల్గొన్నారు.



## అర్హులైన వారిని ఓటరుగా నమోదు

సబ్ కలెక్టర్ నారాయణ్‌అమిత్

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** మిర్యాలగూడ పట్టణ, మండల పరిధిలో అర్హులైన వారిని ఓటరుగా నమోదు చేయాలని సబ్ కలెక్టర్ నారాయణ్‌అమిత్ అన్నారు. మంగళవారం స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో బీఎల్‌వో యాప్ తదితర అంశాలపై బీఎల్‌వోలకు, సూపర్‌వైజర్లకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. జాతీయ ఎన్నికల సంఘం నియమావళి ప్రకారం 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరిని ఓటరుగా నమోదు చేయాలన్నారు. ప్రతి బీఎల్‌వో తమ ప్రాంతంలోని అన్ని విషయాలపై సమగ్రమైన అవగాహన కలిగి ఉండి ఫామ్ 6,7,8లకు సంబందించిన ఓటర్ల నమోదుపై అవగాహన ఏర్పరుచుకోని క్షేత్రస్థాయిలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా తప్పులు లేని పరిపూర్ణమైన ఓటర్ల జాబితాను నమోదు చేయాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ శర్మ, ఎన్నికల డీటీ ప్రవీణ్, మాస్టర్ ట్రైనర్స్ గుడిపాటి కోటయ్య, పోలెబోయిన జనార్ధన్, అంబటి శ్రీను, గోవర్ధన్‌రెడ్డి, సైదిరెడ్డి, ఉస్మాన్, సిబ్బంది సత్యనారాయణ, రామకృష్ణ, రవీందర్‌రెడ్డి, సూపర్‌వైజర్లు, బీఎల్‌వోలు పాల్గొన్నారు.

## విశాఖ ఎక్స్‌ప్రెస్ రైలులో మంటలు



**ప్రజాపక్షం/చిట్యాల :** సికింద్రాబాద్ నుండి విశాఖ మీదుగా భువనేశ్వర్‌కు వెలుతున్న విశాఖ ఎక్స్‌ప్రెస్‌కు మంగళవారం పెనుప్రమాదం తప్పింది. సికింద్రాబాద్ నుండి సాయంత్రం 4.55 గంటలకు బయలుదేరిన రైలు చిట్యాల రైల్వేస్టేషన్ సమీపంలోకి చేరుకునే సమయంలో రైలు ఇంజన్ వెనుక బోగి క్రింది భాగంలో ఆకస్మాత్తుగా మంటలు చెలరేగి పొగలు వ్యాపించాయి. ఇది గమనించిన లోకో పైలట్ రైలును వెంటనే నిలిపివేసి అందుబాటులో ఉన్న టెక్నీషియన్‌ల సహాయంతో మంటలు వచ్చిన ప్రదేశాన్ని తనిఖీ చేశారు. రైలులో ఉన్న మంటలను ఆర్పే సిలిండర్‌లను ఉపయోగించి మంటలను ఆర్పేశారు. మంటలు ఇతర ప్రాంతాలకు వ్యాప్తి చెందకుండా చర్యలు తీసుకున్నారు. రైలును పూర్తిగా తనిఖీ చేశాక స్థానిక రైల్వే స్టేషన్‌కు రైలు చేరుకుంది. అనంతరం మరో మారు రైలును తనిఖీ చేసి ఎలాంటి ప్రమాదం లేదని టెక్నీషియన్లు నిర్ధారించుకున్న తరువాత రైలుకు పచ్చ జెండాను ఊపారు. సుమారు గంట సేపు రైలు నిలిచిపోవడంతో ప్రయాణీకులు ఏమి జరుగుతుందోనని భయాందోళనకు గురయ్యారు.

## ప్రాణహాని ఉంది రక్షణ కల్పించాలి

మావోయిస్టు మాజీ నేత కావలి యాదయ్య

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** బిజెపి నాయకులు గుండగోని మైసయ్యగౌడ్ హత్యకేసులో హత్య నేరం మోపబడిన తనపై భౌతిక దాడి చేసేందుకు బిజెపి,ఏబీవీపీ కి చెందిన కొంతమంది ప్రయత్నాలు చేస్తూ భయాందోళనకు గురి చేశారని వారి నుండి ప్రాణహాని ఉన్నందున తనకు ప్రాణ రక్షణ కల్పించాలని మావోయిస్టు మాజీ నేత కావలి యాదయ్య జిల్లా ఎస్‌పి శరత్ చంద్ర పవర్‌కు ఫిర్యాదు చేశారు. మైసయ్య గౌడ్ హత్య కేసులో తన ప్రమేయం లేకున ఆనాడు పోలీసులు అక్రమంగా కేసు నమోదు చేసి జైల్లో పెట్టడం జరిగిందని అటి కేసులో జిల్లా కోర్టు నుండి బెయిల్ తీసుకొని కోర్టు ఇచ్చిన వాయిదాల ప్రకారం కోర్టుకు హాజరు కావడం జరుగుతుందని తెలిపారు. కేసు విచారణ సమయంలో సాక్షాలను ప్రవేశపెట్టే క్రమంలో సోమవారం రోజు కోర్టుకు హాజరు కావడం జరిగింది అన్నారు. అయితే కోర్టుకు హాజరైన సమయంలో బిజెపి,ఏబీవీపీకి చెందిన నాయకులు కోర్టు ఆవరణలోనే తనపై భౌతిక దాడి చేయాలని ప్రయత్నం చేస్తూ వారి వారి సెల్‌ఫోన్‌ల ద్వారా తన ఫోటోలు,వీడియోలు తీయడం జరిగిందని ఆరోపించారు. మైసయ్య హత్య కేసులో తనకు ఎలాంటి సంబంధం లేదని వారి కుటుంబ సభ్యులు గ్రహించాలని కోరారు. అదేవిధంగా తనకు సంబంధం లేని కేసు వారి కుటుంబ సభ్యుల నుండి ప్రాణహాని ఉన్నందున తనకు రక్షణ రక్షణ కల్పించాలని కోరారు

## రక్తహీనతతో బాధపడుతున్న మహిళలు పౌష్టికాహారం తీసుకోవాలి

నల్లగొండ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి

**ప్రజాపక్షం/ నాంపల్లి:** రక్తహీనతతో బాధపడుతున్న మహిళలు పౌష్టికాహారం తీసుకునే విధంగా అవగాహన కల్పిస్తుండడం పట్ల నాంపల్లి ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిని డాక్టర్ భవానిని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి అభినందించారు. అంతేకాక రోగులకు వారి సహాయకులకు, బంధువులకు ఆరోగ్య అంశాలపై అవగాహన కల్పిస్తుండడం పట్ల కూడా ఆమె అభినందించారు.మండల పరిధిలోని వివిధ ప్రభుత్వ కార్యాలయాలను జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిని డాక్టర్ భవాని తో ఆమె మాట్లాడి గత నెల ఎన్ని కాన్పులు చేశారని అడితెలుసుకున్నారు. ఆసుపత్రి ద్వారా పేద ప్రజలకు అందించాలని గ్రామాల్లో ఎక్కువగా ప్రజలు ప్రభుత్వ ఆసుపత్రులపై ఆధారపడతారని దానిని దృష్టిలో ఉంచుకొని ఆస్పత్రికి సిబ్బంది అంతా అందుబాటులో ఉండేలా చూడాలని అన్నారు. కేజీబీవీలో విద్యార్థులకు అందిస్తున్న విద్య, భోజనం, తదితర సౌకర్యాలు, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అంతేగాక తరగతి గదిలోకి వెళ్లి విద్యార్థులతో మాట్లాడారు. కాగా టాయిలెట్ సమస్యను, ఇతర సమస్యలను జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకురాగా వాటిపై నివేదిక పంపించాలని ఎంపీడీవో రామకృష్ణ శర్మను ఆదేశించారు.తహసిల్దార్ కార్యాలయాన్ని సందర్శించి భూ భారతి దరఖాస్తులన్నింటిని ఆగస్ 14 లోగా పరిష్కరించాలని తహసిల్దార్ జి. దేవ సింగ్ ను ఆదేశించారు. చందూర్ ఆర్‌డిఓ శ్రీదేవి, ఎం పి ఓ ఝాన్సీ, ఆర్ఐ



# 4లేబర్ కోడ్‌ల రద్దుకు పోరాటం

నేటి దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయండి

ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి ఇమ్రాన్

**ప్రజాపక్షం/చౌటుప్పల్ :** తెలంగాణ రాష్ట్రంలో పనిగంటల పరిమితిని 8 గంటల నుండి 10 గంటలకు పెంచుతూ జారీ చేసిన జిఓ 282 ఉత్తర్వులను వెంటనే విరమించుకోవాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండీ ఇమ్రాన్, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బచ్చనగోని గాలయ్య డిమాండ్ చేశారు. చౌటుప్పల్ పట్టణ కేంద్రంలోని సిపిఐ కార్యాలయంలో మంగళవారం ఎఐటియుసి ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎఐటియుసి జిల్లా ప్రధానకార్యదర్శి ఇమ్రాన్ పాల్గొని మాట్లాడారు. బ్రిటిష్ కాలం నాటి నుండి పోరాడి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను కేంద్ర ప్రభుత్వం మార్చి 4న లేబర్ కోడ్‌లను తీసుకువచ్చిందని. కార్మికుల శ్రమను కారుచౌకగా మరింత దోపిడీ చేసేందుకు రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం 8 నుండి 10 పని గంటలను పెంచి తీరని అన్యాయం చేసిందని విమర్శించారు. నేటి సార్వత్రిక సమ్మెలో జిల్లాలోని కార్మికవర్గం పెద్దఎత్తున కదిలి జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. సిపిఐ మండల కార్యదర్శి పల్లె శేఖర్ రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు పిల్లి శంకర్, మండల అధ్యక్షులు టంగుటూరి రాములు, సివిల్ సప్లై హమాలీ యూనియన్ అధ్యక్షులు పాపగళ్ల శంకరయ్య, ఆటో ట్రాలీ యూనియన్ అధ్యక్షులు బెండద రమేష్, శ్యామల రమేష్, సంగెం సురేష్, పరమేష్, లింగస్వామి, స్వామి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.



## భువనగిరిలో సిపిఐ ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ

**ప్రజాపక్షం/భువనగిరి రూరల్ :** జూలై 9వ తేదీన దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ ఆధ్వర్యంలో మంగళవారం భువనగిరి పట్టణంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. ముందుగా పార్టీ కార్యాలయం నుండి ప్రారంభమై గంజు పాత బస్టాండ్ మీదుగా అంబేద్కర్ విగ్రహం వరకు ర్యాలీ కొనసాగింది. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఏశాల అశోక్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా దేశవ్యాప్తంగా జరిగే సార్వత్రిక సమ్మెను అన్ని వర్గాల ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ బైక్ ర్యాలీలో సిపిఐ భువనగిరి మండల పట్టణ కార్యదర్శులు దాసరి లక్ష్మయ్య, పుట్ట రమేష్, సిపిఐ నాయకులు చింతల పెంటయ్య, కోట శంకర్, బద్దం వెంకటరెడ్డి చొప్పరి సత్తయ్య, అబ్బులు, సత్యనారాయణ, రెడ్యా నాయక్ పాల్గొన్నారు.

## కార్మికుల హక్కులను హరించే 4 లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలి

**ప్రజాపక్షం/ఆత్మకూర్ (యం):** సంఘటిత, అసంఘటిత రంగ కార్మికుల హక్కులను హరించే విధంగా కేంద్ర ప్రభుత్వం తీసుకోవచ్చిన 4 లేబర్ కోడ్లను వెంటనే ఉపసంహరించుకోవాలని కోరారు. మంగళవారం మండల కేంద్రంలో జరిగిన సిపిఐ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం 8 గంటల పని దినాన్ని 10 గంటలకు మారుస్తూ జీవో నెంబర్ 282ను తీసుకువచ్చి కార్మికులను బానిసలుగా మార్చే ప్రయత్నం చేస్తుందని, వాటిని కార్మికులు ఐక్యంగా పోరాడి తిప్పి కొట్టాలని అయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి మారుపాక వెంకటేష్, జక్క దయాకర్ రెడ్డి, సుల్తాన్ పురుషోత్తం, యాస బుచ్చి రెడ్డి, జల్ది రాములు, కసరబోయిన సత్తయ్య, బొబ్బల లాల్ రెడ్డి, మజ్జిగ నర్సయ్య, గుర్రం రాజమణి పాల్గొన్నారు.







## పేదలందరికీ ఇందిరమ్మ ఇండ్లు

ఎమ్మెల్యే బాలునాయక్

**ప్రజాపక్షం/దేవరకొండ:** పేదవాడి ఇంటి కల నెరవేర్చే దిశగా బడ్జెట్‌లో రూ. 22,500కోట్లు కేటాయించిన ఏకైక ప్రభుత్వం కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం అని దేవరకొండ ఎంఎల్‌ఏ నేనావత్ బాలునాయక్ అన్నారు. మంగళవారం మండలంలోని తెలుగుపల్లి గ్రామంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులకు భూమి పూజ చేశారు. అనంతరం తెలుగుపల్లి గ్రామంలో నూతనగా ఏర్పాటు చేసిన ఆర్‌ఓ వాటర్ ప్లాంట్‌ను ప్రారంభించి, గ్రామ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఏ బాలునాయక్ మాట్లాడుతూ గత పాలకులు పేదల ఇంటి కలను నిర్లక్ష్యం చేసినప్పటికి ప్రజల ఆకాంక్షలను గుర్తించి, ఈ రోజు ప్రజా ప్రభుత్వం ఆకలను సాకారం చేస్తోందని పేర్కొన్నారు. రాష్ట్రంలోని కోటి పది లక్షల కుటుంబాలలో 93 లక్షల కుటుంబాలకు సంక్షేమ పథకాలను అందించగలగడం గర్వకారణం అని, ఇందిరమ్మ ఇళ్ల కోసం కేవలం మొదటి ఏడాదిలోనే రూ. 22,500కోట్లు ఖర్చు చేయడం దేశంలోనే ఓ రికార్డు సృష్టించామని అన్నారు. ప్రతి పేద కుటుంబానికి ఇంటి కల నెరవేర్చేలా మొదటి దశలోనే నాలుగు లక్షల ఇళ్ల నిర్మాణం ప్రారంభించామని అన్నారు. ఈకార్యక్రమంలో మండల నాయకులు, ప్రజా ప్రతినిధులు, వివిధ అనుబంద సంఘాల నాయకులు, మాజీ సర్పంచ్‌లు, మాజీ జెడ్పిటిసిలు తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి మహిళా ఆర్థికంగా బలోపేతం కావాలి

స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కరరావు

**ప్రజాపక్షం/బీబీనగర్ :** ప్రతి మహిళ ఆర్థికంగా బలోపేతం కావాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర రావు అన్నారు. మంగళవారం బీబీనగర్ మండలంలోని మండల సమాఖ్య కార్యాలయంలో ఇందిరా మహిళ శక్తి సంబరాల్లో భాగంగా అదనపు కలెక్టర్ హాజరై పాల్గొన్నారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ మహిళ సమాఖ్య సభ్యులందరు ప్రతి గ్రామంలో ప్రభుత్వ పాఠశాలలో ప్రభుత్వం అందిస్తున్న అన్ని సదుపాయాలను, విద్యా బోధన గురించి తల్లిదండ్రులకు వివరించి పిల్లలు ప్రభుత్వ పాఠశాలలో చేరే విధంగా చూడాలన్నారు. అలాగే అంగన్వాడీ సెంటర్‌లలో పిల్లలకు మంచి పౌష్టిక ఆహారం , ఎగ్ బిర్యానీ ఇస్తున్నారా లేదా చూడాలని తెలిపారు. స్కూల్ యూనిఫామ్స్ కుట్టడం పూర్తి అయిందా లేదా అని అడిగి తెలుసుకున్నారు. అనంతరం బీబీనగర్ మండలంలోని పీహెచ్‌సిని స్థానిక సంస్థల అదనప కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. డాక్టర్, సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉంటూ సమయానికి వైద్యం అందించాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు అన్నారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ సిబ్బంది అందరు ఖచ్చితంగా సమయానికి విధులకు హాజరై ప్రజలకు నాణ్యమైన వైద్యం అందించాలన్నారు. సిబ్బంది యొక్క




హాజరు రిజిస్టర్ పరిశీలించి సమయానికి రాని వారికి సాధారణ సెలవు (సి ఎల్) వేయాలని సంబంధిత డాక్టర్‌కు చెప్పారు. పిహెచ్‌సిలో మెడిసిన్ సరిగా సరిపడా ఉన్నాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో వైస్ శ్రీనివాసరెడ్డి, వైద్యాధికారి మౌనిక, ఏపీఎం శ్రీనివాస్, మహిళా సమాఖ్య అధ్యక్షురాలు ప్రజావాణి తదితరులు పాల్గొన్నారు.

# బిఆర్‌ఎస్ నాయకుల బిహార్ రౌడీయిజం



టిపిసిసి ప్రధాన కార్యదర్శి, తెలంగాణ టూరిజం కార్పొరేషన్ చైర్మన్ పటేల్ రమేష్‌రెడ్డి

**ప్రజాపక్షం/సూర్యాపేట:** తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలంగాణకు పెట్టుబడులు తెచ్చే విధంగా కృషి చేస్తే, బిఆర్‌ఎస్ నాయకులు మాత్రం తెలంగాణ రాష్ట్ర ఇమేజ్‌ను దెబ్బతీసే విధంగా కుట్రలు చేస్తున్నారని టిపిసిసి ప్రధాన కార్యదర్శి, తెలంగాణ టూరిజం కార్పోరేషన్ చైర్మన్ పటేల్ రమేష్‌రెడ్డి అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని ఆయన నివాసంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర టూరిజం కార్పోరేషన్ చైర్మన్ బాధ్యతలు తీసుకొని సంవత్సరం పూర్తయిన సందర్భంగా కేక్ కట్‌చేసి సంబురాలు జరుపుకున్నారు. అనంతరం డాక్టర్ వైఎస్ రాజశేఖర్ జయంతిని ఘనంగా నిర్వహించారు. అనంతరం ఆయన చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ బిఆర్‌ఎస్ నాయకులు బిహర్ రౌడియిజాన్ని తెలంగాణలో అమలు చేస్తున్నారని, త్వరలో జైలుకు వెళ్లేందుకు సిద్ధంగా ఉండాలని అన్నారు. ఎందుకంటే కాళేశ్వరం ప్రాజెక్టులో అవినీతి, పోన్ ట్యాపింగ్, కాంగ్రెస్ ప్రభుత్వంపై ఇష్టం వచ్చినట్లు మాట్లాడితే తగిన గుణపాఠం ప్రజలు చెబుతారని అన్నారు. బిఆర్‌ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు కాంగ్రెస్ నాయకులని టివిలలో ఐదు నిమిషాలు కూడా వార్తలు రానిచ్చే వారు కాదని అన్నారు. కెటిఆర్ ఇటీవల కాలంలో సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌కు పోయి చర్చకు రా అంటున్నాడు. ముఖ్యమంత్రి స్థాయి కెటిఆర్‌తో చర్చించే స్థాయి కాదని దమ్ముంటే అసెంబ్లీకి వచ్చి అభివృద్ధి పనులపై చర్చకు రావాలని సవాల్ విసిరారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటి వైస్ చైర్మన్ గట్టు శ్రీనివాస్, డాక్టర్ ఊర రామ్మూర్తియాదవ్, మాజీ కౌన్సిలర్లు వెలుగు వెంకన్న, పిసిసి అధికార ప్రతినిధి ధారావత్ వెంకన్ననాయక్, ముదిరెడ్డి రమణారెడ్డి, పిల్లల రమేష్‌నాయుడు, కుంచం అంజయ్య, వల్దాస్ దేవేందర్, నిమ్మల వెంకన్న పాల్గొన్నారు.



## శ్రీశైలం నుండి సాగర్ కు భారీ వరద

పెరుగుతున్న సాగర్ రిజర్వాయర్ నీటిమట్టం

**ప్రజాపక్షం/నందికొండ:** జూరాల, సుంకిసాల నుంచి శ్రీశైలం కు భారీగా వరద వచ్చి చేరుతూ ఉండటంతో శ్రీశైలం రిజర్వాయర్ నిండుకుండను తలపిస్తూ గరిష్టమటానికి చేరుకుంది దీనితోమంగళవారం మధ్యాహ్నం శ్రీశైలం ప్రాజెక్టు నాలుగేట్లను పైకి లేపి 114146 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేయటంతో సాగర్ వైపు కృష్ణమ్మ పరుగులు పెడుతుంది. 25 సంవత్సరాల తర్వాత జూలై నెలలో శ్రీశైలం రిజర్వాయర్ గేట్లను ఎత్తడం ఇదే తొలి సారి కావడం దీనితో నాగర్జున సాగర్ రిజర్వాయర్ నీటిమట్టం క్రమంగా పెరుగసాగింది. వరద ఉధృతి ఇదేవిధంగా కొనసాగితే మరో వారం రోజుల్లో సాగర్ ప్రాజెక్టు కూడా నిండుకుండలా మారి జల కలను సంతరించుకోనుంది. ప్రస్తుతం నాగార్జున సాగర్ రిజర్వాయర్ గరిష్ట నీటిమట్టం 590 అడుగులు కాగా, నీటి నిల్వ సామర్థం 312.0450 టిఎంసిలకు గాను మంగళవారం సాయంత్రానికి 531.90 అడుగులకు 171.8788 టిఎంసిల నీటి నిల్వ తో ఉంది. అయితే శ్రీశైలం ప్రాజెక్టునుంచి నాగార్జునసాగర్ కు ఇన్ ఫ్లో గా 114146 కుల నీరు ఇన్ ఫ్లో గా వచ్చి చేరుతూ ఉండగా, ఎడమ కాలువ ద్వారా 3090 ఎస్ ఎల్ బి సి ఏ ఎన్ ఆర్ పి ద్వారా 1500క్యూసెక్కుల నీటిని అవుట్ ఫ్లోగా విడుదల చేస్తున్నారు.

## సాగర్‌ను సందర్శించిన 24 దేశాల ప్రతినిధులు



ప్రజాపక్షం/నందికొండ: నాగార్జునసాగర్ ను మంగళవారం ఆసియా, ఆఫ్రికా, ఆస్ట్రేలియా ఖండాలలోని 24 దేశాలకు చెందిన ప్రతినిధులు సందర్శించారు. హైదరాబాద్ గచ్చిబౌలిలోని ఎన్విరాన్మెంట్ ప్రొటెక్షన్ అండ్ ట్రైనింగ్ రీసెర్చ్ ఇన్స్టిట్యూ ట్ లో రెండు వారాలపాటు అంతర్జాతీయ శిక్షణ నిమిత్తం వచ్చిన వీరు అత్యాధునికపర్యావరణ పరిశోధన కన్సల్టెన్సీ సేవలపై స్థిరత్వం, అదేవిధంగా పర్యావరణ పరిరక్షణ పద్ధతులపై అవగాహనను పెంచుకోవడంలో శిక్షణ పొందుతున్నారు. అందుకు క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా వీరు ప్రపంచ పర్యాటక కేంద్రమైన నాగార్జునసాగర్ ను సందర్శించి నాగార్జునసాగర్ ప్రాజెక్టు, పవర్ హౌస్ విశేషాలను తెలుసుకున్నారు వీరికి ప్రాజెక్టు ఏఈ కృష్ణయ్య వాటి విశేషాలను తెలియజేశారు. ప్రాజెక్టు సందర్శనతో తాము ఎన్నో అంశాలు నేర్చుకున్నామని 24దేశాలకు చెందిన ప్రతినిధులు తెలిపారు.

# ప్రజల భాగస్వామ్యంతో గ్రామపంచాయతీల అభివృద్ధి

**ప్రజాపక్షం/జోగులాంబ గద్వాల ప్రతినిధి:** పంచాయతీ కార్యదర్శులు శిక్షణలో నేర్చుకున్న అంశాలను గ్రామస్థాయిలో పూర్తిగా అమలు చేసి, ప్రజల భాగస్వామ్యంతో అభివృద్ధి సాధించాలని జిల్లా అదనపు కలెక్టర్ నర్సింగరావు అన్నారు. మంగళవారం కలెక్టరేట్లోని కాన్ఫరెన్సు హాల్ నందు భారత ప్రభుత్వం పరిపాలన సంస్కరణలు, ప్రజా ఫిర్యాదుల విభాగం, సిబ్బంది, పెన్షన్ల మంత్రిత్వశాఖ సహకారంతో మర్రి చెన్నా రెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థ పంచాయితీ రాజ్ గ్రామీణాభివృద్ధి సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో సమాచార హక్కు చట్టం, గ్రామసభలపై ప్రతి మండల నుంచి ఇద్దరు చొప్పున పంచా



యితీ కార్యదర్శులకు శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ గ్రామాభివృద్ధిలో పంచాయితీ కార్యదర్శుల పాత్ర అత్యంత ముఖ్యమైందని తెలిపారు. గ్రామాన్ని అభివృద్ధి దిశగా నడిపించాలంటే కార్యదర్శి ప్రజలతో బలమైన అనుబంధాన్ని నెలకొల్పి, వారి సమస్యలు, అభిప్రాయాలు తెలుసుకుంటూ నడుచుకోవాల్సిన అవసరం ఉందన్నారు. తెలంగాణ పంచాయితీ రాజ్ చట్టం 2018 ప్రకారం గ్రామ స్థాయిలో జరుగుతున్న ప్రతి కార్యక్రమం, ప్రజలకు అందాల్సిన సేవలు, అభివృద్ధి పనులు గ్రామసభల ద్వారానే చర్చించబడాలని అవి పారదర్శకంగా జరగాలని సూచించారు. ప్రభుత్వ పథకాలను అర్హుల వరకు చేరేలా చూడాలని సూచించారు. సమాచార హక్కు చట్టం ప్రతి పౌరుడికి ముఖ్యమైన సాధనం అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డీపీఓ నాగేంద్రం, మాస్టర్ ట్రైనర్ రిటైర్డ్ డీపీఓ కృష్ణ, శిక్షణ రీజినల్ మేనేజర్ డా.హన్మంతు, పంచాయితీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు న్యాయ విజ్ఞాన సదస్సు

**ప్రజాపక్షం/యాదాద్రి :** జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ అధ్యక్షులు , జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎ. జయరాజు వారి సూచనల మేరకు సంస్థ కార్యదర్శి వి.మాధవిలత గూడూరులోని బిర్లా ఓపెన్ మైండ్స్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో విద్యార్థిని, విద్యార్థులకు న్యాయ విజ్ఞాన సదస్సును నిర్వహించారు. ఈ కార్యక్రమంలో న్యాయమూర్తి కళాశాల విద్యార్థులకు ర్యాగింగ్ నిషేధ చట్టాలు, ఫోక్సో చట్టాలు, విద్యా హక్కు చట్టం, మాదకద్రవ్య నిషేధ చట్టము దాని వలన కలిగే దుష్ఫలితాలు, సైబర్ నేరాలు శిక్షలు మరియు పర్యావరణ పరిరక్షణ చట్టం, న్యాయ సేవ అధికార సంస్థ చట్టం, న్యాయ సహాయము, కావాల్సిన అర్హతలు, టోల్ ఫ్రీ నెంబర్ 1098, 15100 అంశాలపై అవగాహన కల్పించారు. బాల సంరక్షణ సమితి అధ్యక్షురాలు బండారు జయశ్రీ జువెనైల్ జస్టిస్ చట్టం, బాలల సంరక్షణకై సమితి అందిస్తున్న సేవలు అంశాలపై వివరించారు.



# స్థానికం
REGIONAL NEWS
మహబూబ్‌నగర్, నారాయణపేట, వనపర్తి, నాగర్‌కర్నూల్

## మహాధర్నాను విజయవంతం చేయాలి

**ప్రజాపక్షం/వనపర్తి టౌన్ :** తమ డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ రాష్ట్ర ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల జేఏసి జూలై 12న హైదరాబాద్ ఇందిరా పార్క్ వద్ద నిర్వహించిన తలపెట్టిన మహాధర్నాను విజయవంతం చేయాలని జిల్లా ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల జేఏసి జిల్లా అధ్యక్షులు భరత్, ప్రధాన కార్యదర్శి వినోద్ అన్నారు. ఈ మేరకు మంగళవారం జిల్లా కేంద్రంలోని పాలిటెక్నిక్ కళాశాల మైదానంలో మహాధర్నాకు సంబంధించిన గోడ పత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జేఏసి నాయకులు మాట్లాడుతూ తమ డిమాండ్లను తక్షణమే పరిష్కరించాలని, ఏజెన్సీ విధానాన్ని రద్దు చేసి కార్పొరేషన్ వ్యవస్థను తీసుకురావాలని డిమాండ్ చేశారు. ఇంకా పలు శాఖల్లో రెన్యువల్ చేయని ఉద్యోగులను వెంటనే రెన్యువల్ చేస్తూ జీఓలు జారీ చేయాలన్న చాలీచాలని జీతాలతో జీవితాన్ని గడుపుతున్న ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు సకాలంలో జీతాలు అందజేసి ప్రభుత్వం వారిని ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఔట్‌సోర్సింగ్ జేఏసి జిల్లా అధ్యక్షులు భరత్, ప్రధాన కార్యదర్శి గుంటి వినోద్, ఆర్గనైజర్ సెక్రటరీ సూగురు సుభాష్, సహాయ కార్యదర్శి రవి సాగర్ , మహేందర్ , శ్రీహరి, ధర్మ, శ్రవణ్ ,రఘు, మూర్తి పాల్గొన్నారు.

## నేడు దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె




**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్‌ప్రతినిధి :** నేడు దేశవ్యాప్తంగా జరుగుతున్న సార్వత్రిక సమ్మెలో కార్మికవర్గం పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని ఎఐటియూసి జిల్లాప్రధాన కార్యదర్శి శివశంకర్ కార్మికవర్గానికి పిలుపునిచ్చారు. ఐఎంపిఎల్ కార్మికులు, లోడింగ్, అన్‌లోడింగ్ హమాలీకార్మికులు సమావేశంలో పాల్గొని నాలుగు లేబర్‌కోడ్స్ రద్దు, కనీస వేతనాల అమలు ఉద్యోగభద్రతకై పోరాటం చేయాలన్నారు. కేంద్రప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్రతి ఒక్కరూ పాల్గొని సమ్మెను విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో ఎఐటియూసి, ఐఎంపిఎల్ కార్మికులు లక్ష్మణ్, కృష్ణ, అరవింద్, యాదయ్య, రమేష్, నాగరాజు, రాజు, తిమ్మాజిపేట సిపిఐ మండల కార్యదర్శి ఎస్‌కె ఖాజామనుద్దిన్, లోడింగ్ అన్‌లోడింగ్ హమాలీలు పాల్గొన్నారు.

## ప్రభుత్వ ఆస్పత్రి ఆకస్మిక తనిఖీ



**ప్రజాపక్షం/కల్వకుర్తిరూరల్ :** కల్వకుర్తి ప్రభుత్వ ఆస్పత్రిని నాగర్‌కర్నూల్ ఇంచార్జ్ డిసిహెచ్‌ఎస్ డాక్టర్ రామకృష్ణ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆయన ఆస్పత్రి సూపరిండెంట్ డాక్టర్ శివరాం, వైద్యులు, నర్సింగ్ సూపరిండెంట్, సీనియర్ నర్సింగ్ ఆఫీసర్స్‌తోకలిసి అన్ని విభాగాల వార్డులు పరిశీలించిన అనంతరం సమీక్ష సమావేశం ఏర్పాటుచేసి అందరూ సకాలంలో విధులకు హాజరుకావాలని, ఆస్పత్రికి వచ్చే రోగులకు ఎలాంటి ఇబ్బందులుకలగకుండా చూసుకోవాలని ఆదేశించారు. రాష్ట్రంలో వైద్యసేవలలో ముందంజలో ఉన్న కల్వకుర్తి సామాజిక ఆరోగ్య కేంద్రంపేరును అదేవిధంగా కొనసాగించే విధంగా ప్రతి ఒక్కరు కృషిచేయాలని కోరారు. కార్యక్రమంలో వైద్యులు యశోద, వసంతదేవి, విజయకుమార్, షకీల్, పాండురంగ, ఉదయ్, స్వప్న, శిరీష, నర్సింగ్ సూపరిండెంట్ శిరోమణి, సీనియర్ నర్సింగ్ ఆఫీసర్స్ బాలమణి, జయమెర్సి, సునీత పాల్గొన్నారు.

## ఎల్‌ఒసి అందజేత



**ప్రజాపక్షం/బిజినేపల్లి :** మండలంలోని శాయిన్‌పల్లి గ్రామానికి చెందిన మంగమ్మ భర్త వెంకటయ్య కుటుంబానికి మంగళవారం నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మంగమ్మకు రూ.2లక్షల ఎల్‌ఓసి లెటర్‌ను ఎమ్మెల్సీ కూచుకుళ్ల దామోదర్‌రెడ్డి అందజేశారు. కార్యక్రమంలో గ్రామానికి చెందిన మార్కెట్ కమిటీ డైరెక్టర్ వాల్యానాయక్, కాంగ్రెస్‌పార్టీ సీనియర్ నాయకులు దస్తగిరి, మన్యంకొండ, కృష్ణ పాల్గొన్నారు.

**మానవత్వం చాటుకున్న మాజీసర్పంచ్ :**
మండల పరిధిలోని గుడ్లనర్వ గ్రామానికి చెందిన లేట్ల కృష్ణయ్య భార్య మైసమ్మ గతకొన్ని రోజులనుండి తీవ్ర అనారోగ్యంతో బాధపడుతూ ఉండటంతో విషయం తెలుసుకున్న మాజీసర్పంచ్ మాలిక్ వారి కుటుంబానికి తనవంతు ఆర్థికసాయంగా రూ.5వేలు అందజేసి మానవత్వాన్ని చాటుకున్నారు. కార్యక్రమంలో బాలలక్ష్మయ్య, అతినారపు బాల్‌లక్ష్మయ్య, సాగర్, అశోక్, బాలనారాయణగౌడ్, ఉదయ్ పాల్గొన్నారు.

## కంటి సమస్యలను నిర్లక్ష్యం చేయొద్దు



**ప్రజాపక్షం/కల్వకుర్తి :** కంటి సమస్యలను నిర్లక్ష్యం చేయవద్దని, ఉచిత కంటి వైద్య శిబిరంసేవలను సద్వినియోగం చేసుకోవాలని ఐక్యతఫౌండేషన్‌చైర్మన్, టాస్కుసిఓఓ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి అన్నారు. మంగళవారం సికెఆర్ ఫంక్షన్‌హాల్లో ఐక్యతఫౌండేషన్, శంకరనేత్రాలయ సంయుక్త ఆధ్వర్యంలో కొనసాగుతున్న ఉచిత కంటివైద్యశిబిరం 4వరోజులో భాగంగా 800మంది కంటి శిబిరాన్ని సందర్శించగా 550కిపైగా కంటిపరీక్షలు, 350కిపైగా ఉచిత కంటి అద్దాలను పంపిణీ చేశారు. 30మంది రోగులకు కంటిశుక్లా సర్జరీకి ఎంపిక కావడం జరిగిందని నిర్వాహకులు తెలిపారు. శిబిరాన్ని సందర్శించిన సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి మాట్లాడుతూ మనిషి శరీరంలో కళ్లుచాలా ముఖ్యమైన అంశమన్నారు. ఆదివారం వరకు కొనసాగనున్న ఉచిత కంటి శిబిరం సేవలను అందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఐక్యత ఫౌండేషన్ సభ్యులు నరేందర్‌గౌడ్, యూసఫ్‌బాబా, గణేష్, యాదయ్య, రమేష్‌నాయక్, శేఖర్, రాఘవేందర్, శ్రీపతి,శ్రీను, నాగిళ్లశివ, కల్యాణ్ పాల్గొన్నారు.

## అభ్యర్థుల గెలుపునకు కృషి



**ప్రజాపక్షం/వీపనగండ్ల :** వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థుల గెలుపుకు కృషి చేయాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి అన్నారు. మండల పరిధిలోని కల్వరాలలో గ్రామంలో బీఆర్‌ఎస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు సర్దార్ అధ్యక్షతన జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి పాల్గొని వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో అభ్యర్థుల గెలుపుకై కార్యర్తలకు మార్గ నిర్దేశం చేశారు. త్వరలో జరిగే జడ్‌పిటీసీ, ఎంపిటిసి, సర్పంచ్ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థులను గెలిపించుకోవాలని సూచించారు. సీనియర్ నాయకులు మాజీ సర్పంచ్ రఘునాథ్ రెడ్డి, వెంకటేష్, నర్సింహారెడ్డి, గఫార్, రాముడు, భాస్కర్ రెడ్డి, రమేష్ , గోవర్ధన్ రెడ్డి, యాదగిరి గౌడ్, బొజ్జన్న పాల్గొన్నారు.

# గతప్రభుత్వ నిర్లక్ష్యంతో రైతులకు తీవ్ర ఇబ్బందులు

### కల్వకుర్తి లిఫ్టు నుండి నీటిని విడుదల చేసిన మంత్రి జూపల్లి కృష్ణారావు



**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్ ప్రతినిధి/పాన్‌గల్ :** గతప్రభుత్వం నిర్లక్ష్యంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడ్డారని పర్యాటక, సాంస్కృతిక, ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. మంగళవారం నాగర్‌కర్నూల్ జిల్లాలో ఎల్లూరు గ్రామంలో రేగుమాన్ గడ్డ వద్ద మహాత్మాగాంధీ కల్వకుర్తి లిఫ్టు ఇరిగేషన్ ప్రాజెక్టులోభాగంగా చేపట్టిన ఎల్లూరు పంపుహౌస్‌లో మోటార్‌ను స్విచ్ ఆన్‌చేసి నీటిని విడుదల చేశారు. ఎంజిఎల్‌ఐ ప్రాజెక్టులో భాగంగా ప్యాకేజి 28, 29, 30 కింద ఉన్న ఎల్లూరు, సింగోటం, జొన్నలబొగుడ, గుడిపల్లిగట్టు జలాశాయాలను నింపి ఆయకట్టు అవసరాలకు అనుగుణంగా సాగునీటిని విడుదల చేయనున్నారు. ఈసందర్భంగా మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ గత బిఆర్‌ఎస్ ప్రభుత్వం రూ.8లక్షల కోట్ల అప్పులు చేసి కూడా ప్రాజెక్టులను పూర్తి చేయలేకపోయిందన్నారు. పాలమూరు–రంగారెడ్డి మహాత్మాగాంధీ కల్వకుర్తి లిఫ్టు ఇరిగేషన్ ప్రాజెక్టుతో ఉమ్మడి పాలమూరు జిల్లాలోని ఏప్రాజెక్టులను గత బిఆర్‌ఎస్ ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. కాగితాలపై జిల్లా ఆయకట్టును 4.60లక్షల ఎకరాలకు పెంచారు తప్ప నీటి విడుదలకు అవసరమైన పనులు చేపట్టలేదని తెలిపారు. కాల్వల్లో నీటి ప్రవాహా సామర్థ్యం పెంచలేదని, మోటార్ల ఏర్పాటు చేయలేదని, 5 మోటార్లలో 2మోటార్లు కాలిపోయిన పట్టించుకోలేదని ధ్వజమెత్తారు. ఈజిల్లా ప్రాజెక్టులను పూర్తిచేసేందుకు చర్యలు తీసుకోవాలని అప్పటి సిఎం కెసిఆర్, మాజీ నీటిపారుదలశాఖ మంత్రి హరీష్‌రావుకు ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోలేదని చెప్పారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు కసిరెడ్డి నారాయణరెడ్డి, డాక్టర్ రాజేష్ రెడ్డి, మేఘారెడ్డి, సిఈ విజయభాస్కర్‌రెడ్డి, ఎస్ఈ సత్యనారాయణరెడ్డి, ఈఈలు శ్రీనివాస్‌రెడ్డి, మాణిక్‌ప్రభు, చంద్రశేఖర్, మురళి పాల్గొన్నారు.

**ఇందిరమ్మ ఇండ్ల మంజూరు పత్రాలను పంపిణీ చేసిన మంత్రి**
సీఎం రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో అనేక అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను ఏడాదిన్నర లోపు అమలు చేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిది అని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. మంగళవారం పాన్‌గల్ మండల పరిధిలోని దావూద్ ఖాన్‌పల్లి, శాగపూర్ గ్రామాలలో ఇందిరమ్మ ఇండ్ల మంజూరు పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి జూపల్లి మాట్లాడుతూ అర్హులైన వారందరికి ప్రభుత్వ సంక్షేమ పథకాలను అందించడం జరుగుతుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం మాటల ప్రభుత్వం కాదని, చేతల ప్రభుత్వమని స్పష్టం చేశారు. స్వల్ప కాలంలోనే ఇచ్చిన హామీలను ఒక్కొక్కటి అమలు చేస్తున్నామని తెలిపారు. అనేక పథకాలను అమలు చేస్తూ ఇచ్చిన హామీలను నిలబెట్టుకుంటున్నామని అన్నారు. అంతకు ముందు మండల కేంద్రంలో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించి రైతు వేదిక ఆవరణలో మొక్కలు నాటారు. అనంతరం మైనార్టీ కార్పొరేట్ నుండి మంజూరైన 32 కుట్టు మిషన్లను ముస్లిం మైనార్టీలకు మంత్రి జూపల్లి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ గోవర్ధన్ సాగర్, మాజీ ఎంపీపీ వెంకటేష్ నాయుడు, మాజీ జడ్పీటీసీ రవికుమార్, సింగిల్ విండో మాజీ వైస్ చైర్మన్ భాస్కర్ యాదవ్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మధుసూదన్ రెడ్డి, యూత్ అధ్యక్షులు గిరి, వివిధ గ్రామాల మాజీ ప్రజా ప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

# విద్యార్థులలో ఆత్మస్థైర్యాన్ని నింపిన కలెక్టర్

### టీచర్‌గా మారిన కలెక్టర్ విజయేందిర బోయి



**ప్రజాపక్షం/జడ్చర్ల :** జడ్చర్లలోని డా.బూర్గుల రామకృష్ణ రావు ప్రభుత్వ డిగ్రీ కళాశాలను మంగళవారం జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి సందర్శించారు. వీరికి కళాశాల ఇంచార్జి ప్రిన్సిపల్ డా.నర్మద స్వాగతం పలికారు. కళాశాల సెమినార్ హాల్‌లో నిర్వహిస్తున్న డిఎల్‌ఓ ట్రైనింగ్‌ను సందర్శించిన కలెక్టర్ అనంతరం డిగ్రీ తృతీయ సంవత్సరం బిజడ్‌సి తరగతి గదిలోకి ప్రవేశించి కాసేపు అధ్యాపకురాలిగా మారారు. విద్యార్థులను పలు అంశాలపై ప్రశ్నలడిగి సమాధానాలు రాబట్టారు. అనంతరం విద్యార్థులకు స్వీయ క్రమశిక్షణ, స్వయం ఉపాధి, అనుకున్న విజయాలను ఎలా చేరుకోవాలి అనే అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. విద్యార్థులకు అవసరమైన కంప్యూటర్ లాబ్, స్వయం రక్షణ కోసం కరాటే లాంటి విద్యలు, పోటీ పరీక్షలు ముఖ్యంగా సివిల్స్, గ్రూప్స్ ప్రిపరేషన్‌కు కావలసిన వసతులను ఏర్పాటు చేస్తామని అదేవిధంగా విద్యార్థులకు డ్రైవింగ్ నేర్చుకోవడానికి అవకాశం కల్పిస్తామని తెలియజేశారు. అనంతరం కళాశాలలోని తెలంగాణ బొటానికల్ గార్డెన్‌ను సందర్శించారు. మొదటగా గార్డెన్‌కు అనుబంధంగా ఉన్న జీవవైవిధ్య పరిరక్షణ, విద్యాకేంద్రంను సందర్శించారు. కలెక్టర్‌కి గార్డెన్ సమన్వయకర్త డా.సదాశివయ్య మొక్కతో స్వాగతం పలికారు. తరువాత బొటానికల్ గార్డెన్‌లో వివిధ విభాగాలను పరిశీలించి మొక్కను నాటి నీరు పోశారు. గార్డెన్ ఏర్పాటు చేసిన తీరును అభివృద్ధి చేస్తున్న సదాశివయ్యను అభినందించారు. గార్డెన్‌లో దాతల సహకారంతో ఏర్పాటు చేస్తున్న నెట్ హౌస్‌లను, ఆర్కిడ్ హౌస్, కాక్టస్‌హౌస్‌లను చూసి కలెక్టరేట్ ఆవరణలో ఇలాంటివి ఏర్పాటు చేయాలని సదాశివయ్యకు సూచించారు. కలెక్టర్‌కి గార్డెన్‌లో పండిన స్టార్ ఫ్రూట్స్‌ను గార్డెన్ సమన్వయకర్త, ఇంచార్జి ప్రిన్సిపాల్ డా.నర్మద బహుమానంగా అందించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఇంచార్జి ప్రిన్సిపల్ డా.నర్మద, అధ్యాపకులు డా.సదాశివయ్య, రాఘవేందర్ రెడ్డి, సతీష్ రెడ్డి, రాజేశ్వర్, వెంకట్ రెడ్డి, రజని తదితరులు ఉన్నారు.

## "ఎఫ్‌పిఒ" మెంబర్‌పై అవగాహన




**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ ప్రతినిధి:** మహబూబ్‌నగర్ రూరల్ మండలం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కోటకదిరలో "ఎఫ్‌పిఓ" మెంబర్ అవేర్నెస్ ప్రోగ్రాం జిల్లా సహకార శాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహకార అధికారి శంకరా చారి మాట్లాడుతూ జిల్లాలో మొత్తం 7 ఎఫ్‌పిఓ ఎస్ (రైతు ఉత్పత్తి దారుల సంస్థ) ఏర్పాటు చేయడం జరిగింది. రైతులకు వివిధ రకాల వ్యాపారాలు, సదుపాయలు కలిపించడానికి ఒక్క రైతు రెండు వేల రూపాయలు షేర్ అమౌంట్ క్రింద జమచేస్తే దానికి సమానముగా ఎంత రైతులు షేర్ అమౌంట్ క్రింద జమ చేస్తారో అంతే మొత్తంలో కేంద్ర ప్రభుత్వం ఈక్విటి షేర్ కింద ప్రతి రైతు రెండు వేల రూపాయలు ఎఫ్‌పిఓలో జమ చేయడం జరుగుతుంది అన్నారు. ఈ విధంగా 15 లక్షల రూపాయలు మించకుండా ఎఫ్‌పిఓలో జమ చేయడం జరుగుతుందని అన్నారు. ఇట్టి షేర్ అమౌంట్‌ను ఆ రైతులు వివిధ రకాల వ్యాపారాలు నిర్వహించుకోవచ్చు. అంతే కాకుండా ఇట్టి సేవలు నిర్వహించడానికి ప్రతి ఎఫ్‌పిఓలో ఎస్టాబ్లిష్‌మెంట్ కాస్ట్ కింద ఏడాదికి 6 లక్షల రూపాయల చొప్పున 3 సంవత్సరాల వరకు కేంద్ర ప్రభుత్వం ఇవ్వడం జరుగుతుంది. అంతే కాకుండా ఏక్ పేడ్ మాకే నామ్ ప్రోగ్రాంలో భాగంగా, వన మహోత్సవం పిఎసిఎస్ కోటకదిరలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ఆడిట్ అధికారి టైటస్ పాల్, సంఘ అధ్యక్షులు రాజేశ్వర్ రెడ్డి, మాచాన్ పల్లి, అప్పయపల్లి మాజీ సర్పంచులు, నోడల్ అధికార, సహకార సిబ్బంది పాల్గొన్నారు.

# మహిళలు ఆర్థికాభివృద్ధి సాధనకు అవకాశాలు సద్వినియోగం



కలెక్టర్ విజయేందిర బోయి సూచన

**ప్రజాపక్షం/మహబూబ్ నగర్ ప్రతినిధి:** మహిళలు ఆర్థికాభివృద్ధి సాధనకు ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి అన్నారు. మంగళవారం జడ్చర్ల మండల మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో ఎంపిడిఓ కార్యాలయంలో నిర్వహించిన మహిళా శక్తి సంబరాలు కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు మహిళా శక్తి సంబరాలు ఈనెల 12 నుంచి 18 వరకు నియోజకవర్గ స్థాయిలో జిల్లా ఇన్చార్జి మంత్రి, శాసన సభ్యులు సూచనలు సమన్వయంతో నిర్వహించనున్నట్లు తెలిపారు. మహిళా శక్తి సంబరాలు కార్యక్రమంలో భాగంగా మంగళవారం జిల్లాలో అన్ని మండలంలో మండల మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో ఇందిర మహిళా శక్తి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు, నేడు బుధవారం గ్రామ సామఖ్య ఆధ్వర్యంలో సమావేశాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మహిళా శక్తి సంబరాలు మహిళల నైపుణ్యాలను ప్రదర్శించే అద్భుత వేదిక అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నిర్వహణలో మహిళా సాధికారతకు దోహదపడుతుందని తెలిపారు. ఫిష్ ఔట్ లెట్, మహిళా శక్తి, బస్సులు, సౌర శక్తి ప్లాట్లు ద్వారా విద్యుత్ సరఫరా, పెట్రోల్ బంకులు, వ్యవసాయ పనిముట్లు, పాఠశాలల విద్యార్థులకు యూనిఫామ్స్ తయారు, అమ్మ ఆదర్శ పాఠశాలల మరమ్మతులు మొదలగు కార్యక్రమాలను మహిళల ద్వారా అమలు చేస్తున్నామని తెలిపారు. మహిళల సాధికారత అన్ని సమావేశాలలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించి మహిళలను చైతన్యం చేయాలన్నదే ప్రభుత్వ ఉద్దేశం అని తెలిపారు. ఈ కార్యక్రమంలో డి.ఆర్.డి.ఓ నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

## కృత్రిమ మేధ ద్వారా నాణ్యమైన విద్య



### రెండు కంప్యూటర్లతో ఎఐ ద్వారా విద్యా బోధనను ప్రారంభించిన ఎంఇఒ వి.కురుమూర్తి

**ప్రజాపక్షం/అడ్డాకుల:** పొన్నకల్ ప్రాథమిక పాఠశాలలో వివిధ ప్రైవేట్ పాఠశాలల నుంచి 67 మంది విద్యార్థులు అడ్మిషన్ కావడం అభినందనీయమని, మీ ఆశలను వమ్ము చేయకుండా పాఠశాల ఉపాధ్యాయ బృందం కృషి చేయాలని సాంకేతిక, పరిజ్ఞానంతో కృత్రిమ మేధ ద్వారా నాణ్యమైన విద్యను అందించాలని ఉపాధ్యాయులకు సూచించారు. ప్రాథమిక పాఠశాల పొన్నకల్‌లో జరిగిన ఉపాధ్యాయులు తల్లిదండ్రులు సమావేశానికి మంగళవారం ముఖ్య అతిథిగా హాజరైన ఎంఈఓ వి.కురుమూర్తి మాట్లాడుతూ జిల్లాలోనే అత్యధికంగా అడ్మిషన్లు చేరిన పాఠశాలగా ప్రఖ్యాతి పొందిందని, ఉపాధ్యాయుల కృషికి తగిన ఫలితం లభించిందన్నారు. మాజీ ఎంపీపీ దోనూరు నాగార్జున రెడ్డి మాట్లాడుతూ పొన్నకల్ ప్రాథమిక పాఠశాల జిల్లాలోనే ఉత్తమమైన పాఠశాలగా మారుతున్న అందుకు ఆనందంగా ఉందని, గ్రామస్తులుగా తమ వంతు సహయ సహకారాలు ఎల్లవేళలా ఉంటాయని, కృత్రిమ మేధ ద్వారా విద్య బోధనకు రెండు కంప్యూటర్లు మంజూరు చేయడాన్ని స్వాగతిస్తున్నామని మరిన్ని కంప్యూటర్లు ఇవ్వాలని ఎంఈఓని కోరారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎన్.వెంకటేశ్ మాట్లాడుతూ పాఠశాలలో ఉన్న ప్రతి విద్యార్థికి మంచి గుణాత్మకమైన విద్యను అందిస్తామన్నారు. చదువులో రాణించడం కోసం విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించి చదివించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు జాకీర్ పాష, దొరబాబు, రవి నాయక్, ఆసిఫ్ ఖాన్, స్వాతిలతో పాటు గ్రామస్తులు శ్రీశైలంయాదవ్, తల్లిదండ్రులు ఆంజనేయులు, నాగరాజు, చంద్రకళ, శిరీష, తదితర 55 మందికి పైగా తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## అనుమతుల పేరిట అక్రమ రవాణా

### సామాజిక కార్యకర్త దిడ్డి ప్రవీణ్ కుమార్

**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ ప్రతినిధి:** మహబూబ్‌నగర్ జిల్లా కోయిల్ కొండ మండలంలో అనుమతుల పేరిట ఇసుక అక్రమ రవాణా దుర్జాగా కొనసాగుతుందని సామాజిక కార్యకర్త నేనుసైత్యం స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు దిడ్డి ప్రవీణ్ కుమార్ తెలిపారు. కోయిల్ కొండ మండలం పారిపల్లి గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం కోసం ఆచార్యపూర్ కొత్తూరు శివారు. వాగు నుండి మంగళవారం 14 ట్రాక్టర్ల ఇసుకను తరలించేందుకు కోయిలకొండ తహసిల్దార్ రాజ గణేష్ అనుమతులు ఇచ్చారు. దీంతో రంగ ప్రవేశం చేసిన ఇసుక మాఫియా అనుమతులు పేరిట అక్రమ రవాణాకు తెర లేపింది. నిబంధనల ప్రకారం కేవలం 14 ట్రాక్టర్లకు మాత్రమే అనుమతి ఇవ్వగా, అదనంగా మరో 18 ట్రాక్టర్లను ఇసుక మాఫియా జోడించి మొత్తం 32 ట్రాక్టర్లతో ఆచార్యపూర్ వాగు నుండి ఇసుకను అక్రమంగా తరలించడం అంతేకాకుండా మంగళవారం ఉదయం 11 గంటల నుండి మధ్యాహ్నం మూడు గంటల వరకు మాత్రమే 14 ఇసుక ట్రాక్టర్లకు అధికారికంగా అనుమతులు ఇవ్వగా, మొత్తం 32 ట్రాక్టర్లు ఉదయం తొమ్మిది గంట నుంచి ఈ ఇసుక అక్రమ రవాణాన్ని ప్రారంభించడం గమనార్హం.

**తహసీల్దార్ ఆదేశాలు బేఖాతరు**



ఆచార్యపూర్ వాగు నుండి మంగళవారం 14 ట్రాక్టర్లకు ఇసుకను తరలించేందుకు కోయిల్ కొండ తహసీల్దార్ రాజ గణేష్ ఇచ్చిన అనుమతులను బేఖాతరు చేస్తూ ఇసుక మాఫియా ఉదయం 9 గంటల నుండి సాయంత్రం ఐదు గంటల వరకు దాదాపు 200 ట్రిప్పులకు పైగా ట్రాక్టర్లతో ఇసుకను అక్రమంగా తరలించడం జరిగిందని సామాజిక కార్యకర్త దిడ్డి ప్రవీణ్ కుమార్ ఆరోపించారు. తహసీల్దార్ ఆదేశాలు బేఖాతరు చేస్తూ ఇసుక మాఫియా అక్రమంగా ఇసుకను తరలిస్తున్న అక్కడే ఉన్న కొంతమంది రెవెన్యూ, పోలీస్ సిబ్బంది అబ్బే ఇవన్నీ మనకెందుకులే అని చూసి చూడనట్లు వ్యవహరించడం చూస్తే ఇసుక మాఫియాకు కొందరు అధికారుల అండదండలు పుష్కలంగా ఉన్నాయని స్పష్టమవుతుందని ఆయన విమర్శించారు. మొత్తం మీద కోయిల్‌కొండ మండలంలో అధికారికంగా, అనధికారికంగా పగలు రాత్రి అని తేడా లేకుండా ఇసుక అక్రమంగా తరలిస్తున్న పట్టించుకునే నాథుడే కరువయ్యారని ప్రవీణ్ ఆవేదన వ్యక్తం చేశారు.

# పేదల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిన మహోన్నత వ్యక్తి వైఎస్ఆర్



మంత్రి వాకిటి శ్రీహరి

**ప్రజాపక్షం/మక్తల్/నాగర్‌కర్నూల్‌ప్రతినిధి/పెబ్బేరు:** దివంగత వైయస్ రాజశేఖరరెడ్డి లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా రైతాంగానికి ఎంతో మేలు చేశారని పేద ప్రజల గుండెల్లో వైయస్సార్ చిరస్థాయిగా నిలిచిపోయారని రాష్ట్ర పశుసంవర్ధక పాడి పరిశ్రమ అభివృద్ధి మత్స్య క్రీడలు యువజన శాఖ మంత్రి డా.వాకిటి శ్రీహరి అన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి దివంగత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి జయంతి సందర్భంగా మక్తల్ పట్టణంలోని మంత్రి నివాసంలో మైయస్సార్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ రాధా లక్ష్మారెడ్డి, కోళ్ల వెంకటేశ్, కట్ట సురేష్, గడ్డంపల్లి హనుమంతు, వాకిటి భాస్కర్, బిల్డర్ తాయప్ప, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి దివంగత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి జయంతి సందర్భంగా ఆయన సేవలను గుర్తు చేసుకుంటూ మంగళవారం అచ్చంపేట మండల కాంగ్రెస్‌పార్టీ నాయకులు పట్టణంలో రాజీవ్‌గాంధీ విగ్రహం దగ్గర వైఎస్ రాజశేఖర్ రెడ్డి జయంతి వేడుకలు ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ సూచనమేరకు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో పాల డైరీ చైర్మన్ నర్సయ్యయాదవ్, ఐఎన్‌టియూసి తాలుకా అధ్యక్షులు మహబూబ్‌ఆలీ, శక్రునాయక్, కృష్ణారెడ్డి, యూత్‌కాంగ్రెస్ నాయకులు వినోద్, శ్రీను, తులసిరామ్, కేశవులు, సాయిబాబా పాల్గొన్నారు.



పెబ్బేరు మున్సిపల్ కేంద్రంలో స్థానిక సుభాష్ చంద్రబోస్ సర్కిల్లో దివంగత స్వర్గీయ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి డా.వైఎస్ రాజశేఖర్ రెడ్డి జయంతి వేడుకలు పెబ్బేరు పట్టణ, మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఆయనచిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించి స్వీట్లు పంపిణీ చేపట్టారు. ఈ కార్యక్రమంలో పెబ్బేరు పట్టణ , మండల కాంగ్రెస్ నాయకులు, కాంగ్రెస్ శ్రేణులు, అభిమానులు పాల్గొన్నారు.

వైఎస్ రాజశేఖర్ రెడ్డి తన హయాంలో అనేక సంక్షేమ పథకాలు అమలు చేసి తెలుగు ప్రజల




గుండెల్లో చిరస్థాయిగా నిలిచారని ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ కార్యాలయంలో మంగళవారం వైయస్సార్ జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా వైఎస్ఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ బెక్కరి అనిత, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహ్మారెడ్డి, డిసిసి మీడియా సెల్ కన్వీనర్ సీజే బెనహర్, డిసిసి ప్రధాన కార్యదర్శి సిరాజ్ ఖాద్రి, పట్టణ కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ అజ్మత్ అలీ, జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు అవేజ్ అహ్మద్, నాయకులు కంచిమి లక్ష్మణ్, గులాం జహీర్, పీర్ సాదిక్, బాలస్వామి, అంతయ్య తదితరులు పాల్గొన్నారు.

# రీల్


## కీరవాణికి పితృవియోగం



ప్రముఖ సంగీత దర్శకులు కీరవాణి ఇంట విషాదం నెలకొంది. ఆయన తండ్రి, ప్రఖ్యాత గేయ రచయిత, చిత్రకారుడు శివ శక్తి దత్త కన్నుమూశారు. 92 ఏళ్ల వయసులో వయోభారంతో మణికొండ పంచవటి కాలనీలోని నివాసంలో తుది శ్వాస విడిచారు. 1988లో రాఘవేంద్రరావు దర్శకత్వం వహించిన జానకి రాముడు చిత్రానికి సోదరుడు విజయేంద్రప్రసాద్‌తో కలిసి పని చేశారు. ఆ చిత్రానికి స్క్రీన్ రైటర్‌గా శివశక్తి దత్త పని చేశారు. బాహుబలి 1లో మమతల తల్లి, బాహుబలి 2లో సాహోరే బాహుబలి, ఆర్ఆర్ఆర్ రామం రాఘవం, హనుమాన్‌లో థీమ్ సాంగ్ సహా పలు చిత్రాలకు పాటలు రచించారు. శివశక్తి దత్త అసలు పేరు కోడూరి సుబ్బారావు. రాజమహేంద్రవరం సమీపంలోని కొవ్వూరులో జన్మించిన శివశక్తి దత్త... చిన్నప్పుడే కళలపై మక్కువతో ఇంట్లో నుంచి పారిపోయి మద్రాస్ చేరుకున్నారు. అక్కడి ఓ కళాశాలలో సంగీత విద్యను అభ్యసించి గిటార్, సితార్, హార్మోనియం నేర్చుకున్నారు. కమలేష్ అనే కలం పేరుతో చిత్రాలు గీసేవారు. సినీ రంగంలో అడుగుపెట్టిన తర్వాత సోదరులు విజయేంద్రప్రసాద్ తోపాటు.. కీరవాణి, రాజమౌళి, ఎంఎం శ్రీలేఖ చిత్రాలకు సాహిత్య సంగీత సహకారాన్ని అందిస్తూ వారి విజయాల్లో ముఖ్యపాత్ర పోషించేవారు. శివశక్తి దత్త మరణం ఆ కుటుంబానికి తీరనిలోటని సినిమా ప్రముఖులు ఆవేదన వ్యక్తం చేశారు. శివశక్తి దత్త మరణం పట్ల పవన్ కళ్యాణ్‌తో పాటు మెగాస్టార్ చిరంజీవి సంతాపంప్రకటించారు.

## హరిహర వీరమల్లు తెలంగాణ కథ కాదు

### చిత్ర నిర్మాతల స్పష్టీకరణ




పవన్ కళ్యాణ్ 'హరి హర వీరమల్లు' తెలంగాణకు చెందిన ఓ వీరుడి కథ ఆధారంగా రూపొందించబడిందని వార్తలు వస్తున్నాయి. అయితే ఆ వార్తల్లో వాస్తవం లేదు. ఈ చిత్రం నిజ జీవితంలోని ఏ ఒక్క నాయకుడి కథ ఆధారంగానూ తెరకెక్కలేదు. సనాతన ధర్మాన్ని పరిరక్షించే ఓ వీరుడి ప్రయాణాన్ని తెలిపే కల్పిత కథగా ఇది తెరకెక్కింది అని చిత్ర సమర్పకులు ఏ ఎం రత్నం అన్నారు. జ్యోతి కృష్ణ దర్శకత్వ బాధ్యతలు చేపట్టిన తర్వాత 'హరి హర వీరమల్లు' కథ పూర్తిగా మారిపోయింది. దర్శకుడు కథలోని స్ఫూర్తిని, సారాన్ని అలాగే ఉంచుతూ.. సరికొత్త కథగా దీనిని మలిచారు. పురాణాల ప్రకారం, అయ్యప్ప స్వామిని శివుడుమోహినిల కుమారుడిగా, శైవం , వైష్ణవం మధ్య వారధిగా ఎలా వర్ణిస్తారో.. అలాగే 'హరి హర వీరమల్లు'ను శివుడు , విష్ణువుల అవతారంగా చూడబోతున్నాం. సరిగ్గా గమనిస్తే, హరి(విష్ణు) హర(శివుడు) అనే టైటిల్ ఈ చిత్ర సారాంశాన్ని తెలియజేస్తుంది. శివుడు, విష్ణువుల అవతారం 'వీరమల్లు' అని తెలిపేలా ఈ చిత్రంలో పలు అంశాలను గమనించవచ్చు. విష్ణువు వాహనం గరుడ పక్షిని సూచించే డేగను ఈ చిత్రంలో ఉపయోగించారు. అలాగే, కథానాయకుడు తన చేతుల్లో శివుడిని సూచించే డమరుకం పట్టుకున్నాడు. ఈ చిత్రంలో కథానాయకుడు ధర్మాన్ని రక్షించడానికి మరియు ధర్మం కోసం పోరాడటానికి శివుడు, విష్ణువుల రూపంగా కనిపిస్తాడు.'హరి హర వీరమల్లు' చిత్రం జూలై 24వ తేదీన ప్రపంచవ్యాప్తంగా భారీస్థాయిలో విడుదల కానుంది.

## 3బిహెచ్‌కె సక్సెస్ మీట్



హీరో సిద్ధార్థ్ లేటెస్ట్ ఫ్యామిలీ బ్లాక్ బస్టర్ '3 బిహెచ్‌కె'. శ్రీ గణేష్ దర్శకత్వం వహించారు. శరత్ కుమార్, దేవయాని, యోగి బాబు, మీతా రఘునాథ్, చైత్ర కీలక పాత్రల్లో కనిపించనున్నారు. శాంతి టాకీస్ బ్యానర్‌పై అరుణ్ విశ్వ నిర్మించిన చిత్రం జూలై 4న విడుదలై ఘన విజయాన్ని అందుకొని సక్సెస్ ఫుల్ గా రన్ అవుతోంది. ఈ సందర్భంగా సక్సెస్ మీట్ నిర్వహించారు. హీరో సిద్ధార్థ్ మాట్లాడుతూ ఈ సినిమాలో ప్రతి కొడుకు థియేటర్ కి వెళ్లి తండ్రిని చూడగలుగుతున్నాడు. ప్రతి తండ్రి కొడుకుని చూడగలుగుతున్నాడు. ఒక కామన్ మ్యాన్ కథ చెప్పడం నాకు. గెలుపు మన దగ్గరికి వచ్చేటప్పుడు ఆ సంతృప్తి వేరు. అలాంటి ఆనందాన్ని డైరెక్టర్ శ్రీ గణేష్ ఈ సినిమాలో చూపించాడు. ఈ సినిమాలో ప్రభు క్యారెక్టర్ లాగే నేను కూడా లైఫ్ ని రెండుసార్లు రీసెట్ చేశాను. ప్రభు పాత్ర చాలా విషయాలు నాకు చాలా విషయాలు నేర్పింది. ఓడిపోవడం పర్మినెంట్ కాదని డైరెక్టర్ ఈ సినిమాతో చాలా అద్భుతంగా చూపించాడు. అరుణ్ విశ్వా మంచి కంటెంట్‌ని సపోర్ట్ చేసే ప్రొడ్యూసర్. వారితో మరిన్ని సినిమాలు చేయాలని ఉంది. శ్రీ గణేష్ రైటింగ్ అద్భుతంగా ఉంటుంది అని అన్నారు.

## ఈనెల 31న 'కింగ్‌డమ్' విడుదల



తెలుగులో రూపొందుతోన్న భారీ చిత్రాల్లో 'కింగ్‌డమ్' ఒకటి. విజయ్ దేవరకొండ, సత్యదేవ్, భాగ్యశ్రీ బోర్సే ప్రధాన పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి గౌతమ్ తిన్ననూరి దర్శకత్వం వహిస్తున్నారు. శ్రీకర స్టూడియోస్ సమర్పణలో సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ పతాకాలపై సూర్యదేవర నాగ వంశీ, సాయి సౌజన్య ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్నారు.'కింగ్‌డమ్' చిత్రం జూలై 31న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. ఈ సందర్భంగా ఒక ప్రోమోను విడుదల చేసింది.

## బాంబు బెదిరింపు

(మొదటి పేజీ తరువాయి)



లేవని తేలడంతో అందరు ఊపిరిపీల్చుకున్నారు. అయితే అగంతకుడు తాను పంపిన ఇమెయిల్‌లో జడ్జి వేడుకుంటూ తన బాధను వెల్లడించాడు. దానిలోని అంశాలు ఈ విధంగా ఉన్నాయి. ''ప్రశాంత్‌కిషోర్, సునీల్ లు ఇచ్చిన సలహా మేరకు 2021లో తమిళనాడు డిఎంకె ప్రభుత్వం రాష్ట్రంలోని మీడియాను అదుపు చేసేందుకు ప్రయత్నించింది. జర్నలిస్టులను మచ్చిక చేసుకునేందుకు ఒక ఏజెన్సీకి అప్పగించారు. ఈ జర్నలిస్టులను ఆకర్షించడానికి డబ్బుతో పాటు వారి లైంగిక కోరికలు తీర్చేందుకు.. అన్నా యూనివర్సిటీకి చెందిన ప్రొఫెసర్ చిత్రకళ ఎస్. గోపాలన్ సహకారంతో ఆంధ్రప్రదేశ్‌లోని చిత్తూరులోని అనాథాశ్రమాలకు నుంచి 12 నుంచి 16 ఏళ్ల వయసు కలిగిన బాలికలను సరఫరా చేశారు. ఇదే విధంగా చెన్నైలోని అయ్యకుడి అనాథాశ్రమాల నుంచి కూడా బాలికలను తరలించి లైంగికంగా వేధించారు. ఏపి జర్నలిస్టు వద్దకు ఏపి బాలికలను పంపించారో వారి పేర్లను కూడా పంపిస్తున్నాను. ఈ స్కామ్ గురించి డిఎంకెకు తెలిసోతెలియదో నాకు తెలియదు. అయితే ఈ స్కామ్‌పై కెరళ పోలీసులు తమిళనాడు ప్రభుత్వానికి సమాచారం అందించింది. నా లక్ష్యం పెద్ద నష్టం కలిగించడం కాదు, కానీ వ్యవస్థలను అప్రమత్తం చేయడమే లక్ష్యం. తమిళనాడులోని మహిళా రక్షణ విభాగాలు (ఎడబ్ల్యూపిఎస్) స్పందించకపోవడం, అలాగే కేరళ పోలీసులు ఈ విషయంపై తమిళనాడు డిజిపి కార్యాలయానికి మెయిల్ పంపినా చర్యలు తీసుకోకపోవడం వల్ల తాను ఈ కార్యచరణకు పాల్పడాల్సి వచ్చింది'' అందుకే ఈ మెయిల్ కాపీ పంపిస్తున్నాను. ఈ ఇమెయిల్ అబ్దియా అబ్దుల్లా హాట్‌మెయిల్ పేరుతో వచ్చిందని పోలీసులు నిర్ధారించారు.






## యూరియా కొరతతో ఆందోళనలో రైతులు



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్రంలో యూరియా కొరత తీవ్రంగా ఏర్పడడంతో రైతులు దిక్కుతోచని స్థితిలో తీవ్ర ఆందోళన చెందుతున్నారనీ, తక్షణమే యూరియా కొరత లేకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణమే తగు చర్యలు తీసుకోవాలని తెలంగాణ రైతు ఐక్యవేదిక విజ్ఞప్తి చేసింది. రాష్ట్రంలో ఖరీఫ్ సీజన్ ప్రారంభమైనందున రైతుల అవసరాలకు అనుగుణంగా సరిపడా యూరియాను కేటాయించాలని తెలంగాణ రైతు ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు శేర్ నర్సారెడ్డి ఒక ప్రకటనలో కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. కేంద్ర ప్రభుత్వం ఏప్రిల్, మే, జూన్ నెలలకు సంబంధించి రాష్ట్రానికి ఐదు లక్షల మెట్రిక్ టన్నుల కోటా నిర్దేశించినప్పటికీ అందులో ఇప్పటివరకు 3.06 లక్షల టన్నుల యూరియా మాత్రమే రాష్ట్రానికి సరఫరా అయిందని తెలిపారు. అరకొర సరఫరా కారణంగా రాష్ట్రంలో దాదాపుగా 1.94లక్షల మెట్రిక్ టన్నుల యూరియా కొరత ఏర్పడిందని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రానికి ఎరువుల కేటాయింపు విషయంలో కేంద్ర ప్రభుత్వం వివక్ష చూపుతోందనీ, రాష్ట్రంలో రైతులకు తీవ్రమైన ఎరువుల కొరత నెలకొన్నప్పటికీ రాష్ట్రం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న ఇద్దరు కేంద్ర మంత్రులు జి.కిషన్ రెడ్డి, బండి సంజయ్ లు మాట్లాడకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. యూరియా వేయకపోతే పంటలు దెబ్బతినే ప్రమాదం ఉన్నందున రైతుల వ్యవసాయ అవసరాలను దృష్టిలో ఉంచుకొని యూరియా కొరత లేకుండా తక్షణమే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తగు చర్యలు తీసుకోని రైతులను ఆదుకోవాలని తెలంగాణ రైతు ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు శేర్ నర్సారెడ్డి విజ్ఞప్తి చేశారు.
















## స్థానిక ఎన్నికల్లో దివ్యాంగులకు అవకాశం ఇవ్వాలి




ఎంఆర్‌పిఎస్ అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** స్థానిక సంస్థల ఎన్నికల్లో దివ్యాంగులకు అవకాశం కల్పించాలని ఎంఆర్‌పిఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ అన్నారు. హైదరాబాద్ నాంపల్లిలోని బిజెపి రాష్ట్రం కార్యాలయంలో మంగళవారం బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావును కలిసి వినతి పత్రం అందచేశారు. ఈ సందర్భంగా కృష్ణ మాదిగ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలకు ముందు దివ్యాంగుల ఫించన్లు పెంచుతామని హామీ ఇచ్చిందని, కానీ అమలు చేయకుండా మోసం చేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజలకు అండగా ఉండాల్సిన ప్రతిపక్షాలు నిర్లక్ష్యం వహిస్తున్నాయని, అందుకే తాము ప్రభుత్వంపై పోరాటానికి సిద్ధమైనట్లు చెప్పారు. ఇందులో భాగంగా అన్ని రాజకీయ పార్టీల అధ్యక్షులను కలిసి మద్దతు కోరుతున్నట్టు మంద కృష్ణ మాదిగ తెలిపారు. ప్రభుత్వంపై పోరాటంలో భాగంగా ఈ నెల 13 నుండి దివ్యాంగుల మహాగర్జన సన్నాహక సమావేశాలు జిల్లాల్లో నిర్వహించనున్నట్టు ఆయన చెప్పారు. ఆగస్టు 13న దివ్యాంగుల మహాగర్జన ఛలో ఢిల్లీ కార్యక్రమాన్ని ఎల్బీ స్టేడియంలో ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు.








Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at D.No 1- 6/75, Suravaram Venkataram Reddy Bhavan, Subhashnagar, Mahabubnagar - 509001, Telangana State, RNI TELTEL /2018/76758 **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com